www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 26-9-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 162 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, తిథి: చవితి ఉ.9.33 తదుపరి పంచమి, నక్షత్రం: విశాఖ రా.10.09 తదుపరి అనూరాధ, వర్జ్యం: రా.2.38-4.26, దుర్ముహూర్తం: ఉ. 8.31-9.19, మ.12.30-1.18, అమృతఘడియలు: మ.12.15-2.03, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.08, సూర్యాస్తమయం: 6.04 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



పాకిస్తాన్‌తోనే భారత్ ఫైనల్

● బంగ్లాపై పాక్ ఉత్కంఠ గెలుపు

● ఆసియాకప్

దుబాయ్: ఆసియాకప్ చరిత్రలో మొట్టమొదటి సారిగా భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్‌కు రంగం సిద్ధం కానుంది. గురువారం సూపర్-4లో బంగ్లాదేశ్‌తో జరిగిన లో స్కోరింగ్ థ్రిల్లర్‌లో పాక్ బౌలర్లు విశేషంగా రాణించారు. దీంతో 11 రన్స్ తేడాతో నెగ్గిన దాయాది, ఈనెల 28న భారత్‌తో టైటిల్ ఫైట్‌లో తలపడనుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 135 పరుగులు చేసింది. మహ్మద్ హారిస్ (31) మహ్మద్ నవాజ్ (25), షహీన్ అఫ్రీది (19) రాణించారు. టస్కిన్‌కు మూడు.. రిషాద్, మెహెదీ హసన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత స్వల్ప ఛేదనలో బంగ్లా బ్యాటర్లు పూర్తిగా తేలిపోయారు. దీంతో 20 ఓవర్లలో 9 వికెట్లకు 124 పరుగులే చేసి ఓడింది. షమీమ్ (30) ఒంటరి పోరాటం చేశాడు. పవర్‌ప్లేలోనే 36/3 స్కోరుతో జట్టు ఓటమి దిశగా పయనించింది. అలాగే వరుస విరామాల్లో పాక్ బౌలర్లు వికెట్లు తీస్తూ ఒత్తిడి పెంచారు. దీంతో స్వల్ప లక్ష్యమే అయినా బంగ్లా గట్టెక్కలేకపోయింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ షహీన్, రౌఫ్‌లకు మూడేసి, సయీమ్‌కు 2 వికెట్లు దక్కాయి.

చివర్లో కోలుకుంది..

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పాక్‌ను బంగ్లా బౌలర్లు ఏమాత్రం కుదురుకోనీయలేదు. తొలి ఓవర్ నుంచే వికెట్ల పతనం సాగింది. అయితే చివర్లో హారిస్, నవాజ్‌ల ఆటతో కాస్త పరువు నిలుపుకొంది. మొదటి పది ఓవర్లలో పాక్ 46/4 స్కోరుతో తీవ్ర ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో వంద రన్స్ కూడా కష్టమే అనిపించింది. కానీ మహ్మద్ హారిస్, నవాజ్‌ల హిట్టింగ్‌తో పరుగులు వేగంగా వచ్చాయి. 14వ ఓవర్‌లో నవాజ్ క్యాచ్ కూడా విఫలమైంది. ఆఖరి ఐదు ఓవర్లలో 52 పరుగులు చేసిన పాక్ పోరాడగలిగే స్కోరందుకుంది.

మిడిలార్డర్‌లో జితేష్‌కు చాన్స్?



లంకతో సూపర్-4 పోరు నేడు ● రాత్రి 8 గం. నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

దుబాయ్: ఆసియా కప్ ఫైనల్ బెర్త్‌ను ఇప్పటికే ఖరారు చేసుకొన్న భారత్.. సూపర్-4లో శుక్రవారం శ్రీలంకతో జరిగే ఆఖరి మ్యాచ్‌లో తలపడబోతోంది. భారత్‌కు ఈ మ్యాచ్ నామమాత్రమేగనుక కొన్ని ప్రయోగాలు చేసే అవకాశం ఉంది. వికెట్ కీపర్/బ్యాటర్ సంజూ శాంసన్ మిడిలార్డర్‌లో ఇమడలేక పోతుండడంతో.. ఆ స్థానంలో జితేష్ శర్మకు చాన్స్ దక్కొచ్చు. ఫినిషర్‌గానూ అతడిని పరీక్షించడానికి ఇదే చివరి చాన్స్ కూడా. కాగా, టీమిండియాను ఎక్కువ ఆందోళనకు గురిచేస్తున్న సమస్య ఫీల్డింగ్. టోర్నీలో మొత్తం 10 క్యాచ్‌లు చేజార్చగా.. ఒక్క బంగ్లాతో మ్యాచ్‌లోనే ఐదు క్యాచ్‌లు వదిలేశారు. ఫీల్డింగ్ కోచ్ దిలీప్ ఇటీవలే ప్రత్యేకంగా సాధన చేయించిన తర్వాత కూడా భారత ఫీల్డర్లలో మార్పు రాలేదు. కనీసం ఫైనల్ నాటికైనా టీమిండియా ఫీల్డింగ్ మెరుగుపడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కెప్టెన్ సూర్యకుమార్ వైఫల్యం జట్టును మరింత ఒత్తిడికి గురిచేస్తోంది. అభిషేక్ శర్మ అదరగొడుతున్నా.. గిల్ టీ20 తరహాలో బ్యాటింగ్ చేయలేకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఇక స్టార్ పేసర్ బుమ్రాకు విశ్రాంతినిచ్చే అవకాశం ఉంది. మరోవైపు రెండు వరుస ఓటములతో టోర్నీ నుంచి అవుటైన లంక.. ఈ మ్యాచ్‌లోనైగా గెలిచి పరువు దక్కించుకోవాలనుకొంటోంది.

జట్లు (అంచనా): అభిషేక్, గిల్, సూర్యకుమార్, తిలక్ వర్మ, శాంసన్/జితేష్ (వికెట్ కీపర్), శివం దూబే, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, కుల్దీప్, వరుణ్ చక్రవర్తి, బుమ్రా/అర్ష్‌దీప్ సింగ్.

శ్రీలంక: పథుం నిస్సంక, కుశాల్ మెండిస్ (వికెట్ కీపర్), కుశాల్ పెరీరా, అసలంక (కెప్టెన్), కమిందు మెండిస్, షనక, హసరంగ, కరుణ్‌రత్నే, చమీర, తీక్షణ.

రాహుల్ హాఫ్ సెంచరీ

● భారత్ 'ఎ' 169/2



లఖ్‌నవూ: కేఎల్ రాహుల్ (74 రిటైర్డ్ హర్ట్) హాఫ్ సెంచరీతో సత్తా చాటడంతో ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో రెండో అనధికార టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 'ఎ' 169/2 స్కోరు చేసింది. 412 పరుగుల లక్ష్య ఛేదనలో..విజయానికి మనోళ్ల చివరి రోజు 243 పరుగులు చేయాల్సి ఉంది. ఓవర్‌నైట్ 16/3తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్ 'ఎ' 185 రన్స్‌కే కుప్పకూలింది. బ్రార్, మానవ్ చెరో మూడు, సిరాజ్, యశ్ ఠాకూర్ రెండేసి వికెట్లు పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 'ఎ' 420, భారత్ 'ఎ' 194 రన్స్ చేశాయి.

'ఆసియా ఆర్చరీ'కి జ్యోతి సురేఖ

న్యూఢిల్లీ: కాంపౌండ్ ఆర్చర్ జ్యోతి సురేఖ ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌నకు ఎంపికైంది. గురువారం సోనేపట్‌లో జరిగిన సెలెక్షన్ ట్రయల్స్‌లో అద్భుత ప్రదర్శన కనబరచిన సురేఖ ఎనిమిదో సారి ఈ టోర్నీ బెర్త్‌ను పట్టేసింది. నవంబరు 7 నుంచి 14 వరకు బంగ్లాదేశ్‌లో ఈ చాంపియన్‌షిప్ జరగనుంది.



భారత్ 'ఎ' మహిళల గెలుపు

బెంగళూరు: షఫాలీ వర్మ (70), మమత (56 నాటౌట్) అర్ధ శతకాలతో మెరవడంతో..వన్డే వరల్డ్ కప్ వామప్ మ్యాచ్‌లో భాగంగా గురువారం న్యూజిలాండ్‌పై భారత్ 'ఎ' మహిళలు నెగ్గారు. తొలుత కివీస్ 273/9 స్కోరు చేసింది. అనంతరం వర్షం వల్ల కుదించిన మ్యాచ్‌లో మనోళ్లు 39.3 ఓవర్లలో 226/6 స్కోరు చేసి గెలుపొందారు.

ఇంగ్లండ్ భారీ విజయం : భారత మహిళలతో జరిగిన మరో వామప్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 153 పరుగులతో నెగ్గింది. తొలుత ఇంగ్లండ్ 50 ఓవర్లలో 340/9 స్కోరు చేసింది. బ్రంట్ (120 రిటైర్డ్ హర్ట్) శతక్కొట్టింది. భారీ ఛేదనలో భారత్ 34 ఓవర్లలో 187 పరుగులకే కుప్పకూలింది. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ బౌలర్ అరుంధతి రెడ్డి గాయపడింది. ఆమెను వీల్‌చైర్‌లో బయటికి తీసుకెళ్లాల్సివచ్చింది.

పడిక్కళ్‌కు చోటు

వైస్ కెప్టెన్‌గా జడేజా

నితీశ్ కుమార్ ఫిట్ ● కరుణ్‌పై వేటు

వెస్టిండీస్‌తో సిరీస్‌కు భారత జట్టు


పడిక్కళ్





న్యూఢిల్లీ: వెస్టిండీస్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్ కోసం భారత క్రికెట్ జట్టును గురువారం ప్రకటించారు. 15 మందితో కూడిన బృందానికి శుభ్‌మన్ గిల్ నేతృత్వం వహిస్తుండగా, వైస్ కెప్టెన్‌గా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాను నియమించారు. ఇంగ్లండ్ పర్యటనలో డిప్యూటీగా వ్యవహరించిన రిషభ్ పంత్ గాయం నుంచి ఇంకా కోలుకోలేదు. ప్రస్తుతం ఆసియాకప్ కోసం దుబాయ్‌లో ఉన్న కెప్టెన్ గిల్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, కోచ్ గంభీర్ సమావేశమై జట్టును ప్రకటించారు. అక్టోబరు 2 నుంచి అహ్మదాబాద్‌లో తొలి టెస్టు జరుగనుంది. మరోవైపు దులీప్ ట్రోఫీ, భారత్ 'ఎ' జట్ల తరఫున విశేషంగా రాణించిన దేవ్‌దత్ పడిక్కళ్‌కు మరోసారి పిలుపందింది. గతేడాది అతను రెండు టెస్టులాడాడు. అలాగే గాయం నుంచి కోలుకున్న ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డిని సెలెక్టర్లు ఎంపిక చేశారు. పంత్ గాయంతో దూరంకావడంతో ధ్రువ్ జురెల్ ప్రధాన కీపర్‌గా ఉండనుండగా, అతడికి బ్యాకప్‌గా ఎన్.జగదీశన్‌ను తీసుకున్నారు. అయితే ఇంగ్లండ్‌తో సిరీస్ ఆడిన కరుణ్ నాయర్, పేసర్ శార్దూల్ ఠాకూర్‌కు మాత్రం జట్టులో చోటు దక్కలేదు. కరుణ్ నుంచి తాము ఎక్కువగా ఆశించినప్పటికీ అతను నిరాశపర్చినట్టు చీఫ్ సెలెక్టర్ అగార్కర్ అభిప్రాయపడ్డాడు. అటు తనపై వేటుకు కారణమేంటో సెలెక్టర్లనే అడగాలని కరుణ్ తేల్చాడు. రిజర్వ్ ఓపెనర్‌గా ఉన్న అభిమన్యు ఈశ్వరన్, పేసర్ ఆకాశ్ దీప్‌లను ఇరానీ కప్‌లో రెస్టాఫ్ ఇండియాకు ఎంపిక చేశారు. మరో పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌ను కూడా పరిగణనలోకి తీసుకోలేదు. పని ఒత్తిడి కారణంగా స్టార్ పేసర్ బుమ్రాకు విశ్రాంతినిస్తారనే కామెంట్స్ వినిపించినా అతడిని కూడా ఆడించబోతున్నారు. స్పిన్ విభాగంలో అక్షర్, జడేజా, కుల్దీప్, సుందర్ ఉన్నారు.

భారత టెస్టు జట్టు: గిల్ (కెప్టెన్), రవీంద్ర జడేజా, జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, పడిక్కళ్, జురెల్, జగదీశన్, నితీశ్ కుమార్, వాషింగ్టన్ సుందర్, అక్షర్, కుల్దీప్ యాదవ్, బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ.


సూర్య

రాజకీయ వ్యాఖ్యలొద్దు..

సూర్యకు రెఫరీ మందలింపు

పాక్ క్రికెటర్లపై భారత్ ఫిర్యాదు

దుబాయ్ : పాకిస్థాన్‌తో ఆసియా కప్ గ్రూప్ దశ మ్యాచ్ అనంతరం చేసిన వ్యాఖ్యలతో టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ చిక్కుల్లో పడే పరిస్థితి ఎదురైంది. ఈ వ్యాఖ్యలపై ఐసీసీకి పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో బీసీసీఐ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, క్రికెట్ ఆపరేషన్స్ మేనేజర్‌తో కలిసి సూర్యకుమార్ విచారణకు హాజరయ్యాడు. రాజకీయ ప్రేరేపిత వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా సూర్యకు రెఫరీ సూచించినట్టు తెలిసింది. అయితే ఆ వ్యాఖ్యలకుగాను సూర్యకుమార్‌కు విధించే శిక్షను రెఫరీ నిర్ధారించలేదు. కానీ..సూర్య వ్యాఖ్యలు లెవల్-1 తప్పిదంగా భావిస్తున్నారు. దాంతో అతడిని హెచ్చరించడమో లేదంటే మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించడమో చేస్తారని టోర్నమెంట్ వర్గాలు వెల్లడించాయి. సూర్యకుమార్ చేసిన వ్యాఖ్యలపై పాకిస్థాన్ జట్టు యాజమాన్యం తనకు రెండు నివేదికలు అందజేసిందని మ్యాచ్ రెఫరీ రిచీ రిచర్డ్‌సన్ భారత జట్టు యాజమాన్యానికి ఈ-మెయిల్ పంపాడు. పాకిస్థాన్ చేసిన ఫిర్యాదులు, అందుకు సంబంధించిన ఆధారాలను పరిశీలిస్తే.. సూర్యకుమార్ వ్యాఖ్యలు క్రికెట్ ప్రతిష్ఠను భంగపరిచేలా ఉన్నట్టు తెలుస్తోందని రిచర్డ్‌సన్ పేర్కొన్నాడు.

సూర్య ఏమన్నాడంటే..

ఈనెల 14న పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. మ్యాచ్ తర్వాత సూర్య మాట్లాడుతూ.. 'పహల్గామ్ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు అండగా నిలిచేందుకు ఇంతకంటే అద్భుతమైన సమయం ఉండదు. ఆ కుటుంబాలకు మేం సంఘీభావం ప్రకటిస్తున్నాం. అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించిన మా భద్రతా బలగాలకు ఈ విజయాన్ని అంకితం చేయాలనుకుంటున్నాం' అని అతడు చెప్పాడు. అంతేకాదు..బీసీసీఐ, తమ ప్రభుత్వ సూచన మేరకు మ్యాచ్ తర్వాత ప్రత్యర్థి జట్టు క్రికెటర్లతో కరచాలనం చేయలేదని కూడా సూర్యకుమార్ తెలిపాడు.

హారిస్, ఫర్హాన్‌పై భారత్ ఫిర్యాదు

పాక్ ఆటగాళ్లు హారిస్ రౌఫ్, సాహిబ్‌జాదా ఫర్హాన్‌పై ఐసీసీకి బీసీసీఐ ఫిర్యాదు చేసింది. ఈనెల 21న భారత్‌తో మ్యాచ్ సందర్భంగా వారు ప్రవర్తించిన తీరు రెచ్చగొట్టేవిధంగా ఉందని ఆ ఫిర్యాదులో పేర్కొంది. తమపై భారత్ సైనిక చర్య విఫలమైందన్న కోణంలో..విమానం కూలిపోతున్న తీరుగా పాక్ పేసర్ రౌఫ్ సైగలు చేశాడు. అలాగే భారత ఓపెనర్లు అభిషేక్, గిల్‌ను రౌఫ్ దూషించాడు. ఇక..అదే మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ సంబరాన్ని ఓపెనర్ ఫర్హాన్ 'గన్ ఫైరింగ్' తరహాలో చేసుకున్నాడు.

నేడు పాక్ క్రికెటర్ల విచారణ

బీసీసీఐ చేసిన ఫిర్యాదుపై పాకిస్థాన్ ఆటగాళ్లు రౌఫ్, ఫర్హాన్‌లను రెఫరీ రిచీ రిచర్డ్‌సన్ శుక్రవారం విచారించనున్నాడు. బంగ్లాదేశ్‌తో పాకిస్థాన్ మ్యాచ్ ఆడుతున్న నేపథ్యంలో గురువారం వారిని విచారించలేదు.


అమ్మకానికి హైదరాబాద్ 'సైబర్ పెరల్'

క్యాపిటల్‌ల్యాండ్ ఇండియా ట్రస్ట్ వెల్లడి

న్యూఢిల్లీ: ప్రముఖ ప్రాపర్టీ ట్రస్ట్ క్యాపిటల్‌ల్యాండ్ ఇండియా ట్రస్ట్ (క్లింట్) చెన్నై, హైదరాబాద్‌ల్లోని తన రెండు వాణిజ్య ఆస్తులను అమ్మకానికి పెట్టింది. ఈ రెండు ఆస్తులను రూ.1,103 కోట్లకు విక్రయించేందుకు ఇప్పటికే ఒక సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపింది. హైదరాబాద్, హైటెక్ సిటీ సమీపంలోని సైబర్‌పెరల్, చెన్నైలోని సైబర్ వేల్ టవర్లు ఈ సంస్థ చేతిలో ఉన్నాయి. 2007లో సింగపూర్ స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్టయిన తర్వాత క్లింట్ ఆస్తులను అమ్మడం ఇదే మొదటిసారి. అనేక ఐటీ, బీఎఫ్ఎస్ఐ కంపెనీలు కొలువు తీరిన ఈ రెండు వాణిజ్య ఆస్తుల విస్తీర్ణం 14 లక్షల చదరపు అడుగులు (ఎస్ఎఫ్‌టీ)గా ఉంది.

హైదరాబాద్‌లో 'బీసీజీ' కార్యాలయం


హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మరో ప్రముఖ అమెరికా సంస్థ హైదరాబాద్‌లో కొలువు తీరింది. మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ రంగంలో ఉన్న బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) హైదరాబాద్‌లో తన కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపింది. ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు తర్వాత భారత్‌లో హైదరాబాద్ తమకు ఐదో స్థానమని బీసీజీ తెలిపింది. భారత్‌లో పెరుగుతున్న వ్యాపార అవకాశాలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌లోనూ తమ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,14,440 ▼	1,04,900 ▼	1,50,000 ▲
విజయవాడ	1,17,500 ▲	1,11,500 ▲	1,41,000 ▲
విశాఖపట్నం	1,16,630 ▼	1,05,100 ▼	1,50,000 ▲
రాజమండ్రి	1,14,440 ▼	1,04,900 ▼	1,37,900 ▼
ప్రొద్దుటూరు	1,18,000 ▼	1,08,560 ▼	1,39,900 ▲
ముంబై	1,13,349 ▼	1,03,828 ▼	1,37,040 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ



హైదరాబాద్	540	విజయవాడ	550
వరంగల్	542	గోదావరి	540
చిత్తూరు	578	విశాఖపట్నం	530
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్




హైదరాబాద్	100	విజయవాడ	115
వరంగల్	100	గుంటూరు	117
కరీంనగర్	100	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	92
కర్నూలు	100	నెల్లూరు	97
విశాఖపట్నం	122	అనంతపురం	97
గోదావరి	115		

వెండీ కొండెక్కె..

ఆల్‌టైం రికార్డు స్థాయికి కేజీ సిల్వర్ ధర..

హైదరాబాద్‌లో రూ. 1.50 లక్షలకు చేరిక



న్యూఢిల్లీ: బంగారంతో పాటు వెండి కూడా కొండెక్కుతోంది. సామాన్యులకు అందనంత పైకి ఎగబాకుతోంది. ఢిల్లీ మార్కెట్లో కిలో వెండి ధర గురువారం రూ.1,000 పెరిగి సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1.40 లక్షలకు చేరింది. హైదరాబాద్ మార్కెట్లో ఇప్పటికే రూ.1.50 లక్షలకు పెరిగింది. ఫ్యూచర్స్ మార్కెట్లోనూ కొత్త రికార్డును సృష్టించింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో డిసెంబరు డెలివరీ కాంట్రాక్టు ధర రూ.3,528 (2.63 శాతం) పెరిగి రూ.1,37,530కి చేరగా.. 2026 మార్చి కాంట్రాక్టు రేటు రూ.3,431 (2.53 శాతం) పెరుగుదలతో రూ.1,38,847కు ఎగబాకింది. అంతర్జాతీయంగా దీని ధరలు పెరగడమే ఇందుకు కారణం. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ సిల్వర్ రేటు ఒక దశలో 45 డాలర్ల పైకి చేరి కొత్త ఆల్‌టైం రికార్డు స్థాయిని నమోదు చేసింది.

ఈ ఏడాదిలో 56 శాతం అప్

గత ఏడాది చివరి నాటికి ఢిల్లీ మార్కెట్లో రూ.89,700 స్థాయిలో ఉన్న కిలో వెండి ధర.. ఈ ఏడాదిలో ఇప్పటికే రూ.50,300 (56 శాతం) పెరిగింది. ఒక ఏడాదిలో వెండి ధరలు 50 శాతానికి పైగా పెరగడం ఇదే తొలిసారి. గడిచిన పదేళ్లలో వెండికిదే అత్యధిక వార్షిక పెరుగుదల కూడా.

పదేళ్లలో వెండి ధరల పెరుగుదల

సంవత్సరం	కిలో ధర (రూ.)	పెరుగుదల (%)
2016	39,930	19.0
2017	38,425	-3.8
2018	38,245	-0.5
2019	46,665	22.0
2020	67,383	44.4
2021	61,979	-8.0
2022	68,092	9.9
2023	73,395	7.8
2024	86,017	17.2
2025 (ఇప్పటివరకు)	1,40,000	56.0

కారణాలివీ..

- ట్రంప్ సుంకాలతో పెరిగిన అంతర్జాతీయంగా వాణిజ్య అనిశ్చితి పెరగడం
- ఫెడ్ రేట్లు తగ్గుతున్న సమయంలో డాలర్, యూఎస్ బాండ్ల రిటర్నుల రేట్లు తగ్గటంతో ఇన్వెస్టర్లు బంగారం, వెండి వంటి విలువైన లోహాల్లోకి పెట్టుబడులు మళ్లిస్తుండటం
- పారిశ్రామిక రంగాల్లో, ఎలక్ట్రానిక్ ఉపకరణాల తయారీలో వెండి వినియోగం పెరగడం
- దేశీయంగా పండగ సీజన్ గిరాకీ, రూపాయి క్షీణత కూడా వెండి ధరలను మరింత పైకి ఎగదోస్తున్నాయి.

హెచ్-1బీ వీసాల ఫీజులపై బేఫికర్

క్లయింట్లపైనే 30-70 శాతం భారం

కంపెనీల లాభాలకూ ధోకా ఉండదు: క్రిసిల్

న్యూఢిల్లీ: హెచ్-1బీ వీసాల ఫీజును డొనాల్డ్ ట్రంప్ సర్కారు లక్ష డాలర్లకు పెంచిన ప్రభావం, భారత ఐటీ కంపెనీలపై పెద్దగా ఉండదని దేశీయ పరపతి రేటింగ్ సంస్థ క్రిసిల్ వెల్లడించింది. భారత ఐటీ సర్వీస్ కంపెనీలు ట్రంప్ పెంచిన వీసా ఫీజులో 30 నుంచి 70 శాతం భారాన్ని అమెరికా క్లయింట్లకే బదిలీ చేసే అవకాశం ఉన్నందున, వాటి నిర్వహణ లాభాలపైనా ఈ పెంపు ప్రభావం పెద్దగా ఉండదని స్పష్టం చేసింది. ఈ కంపెనీల నిర్వహణ లాభాలు గత ఏడాదితో పోలిస్తే, వచ్చే ఆర్థిక సంవత్సరం మహా అయితే 10-20 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒక శాతానికి సమానం) తగ్గే అవకాశం ఉందని అంచనా వేసింది. అమెరికా ప్రభుత్వం నిన్న మొన్నటి వరకు ఒక్కో హెచ్-1బీ వీసాపై 2,000 డాలర్ల నుంచి 5,000 డాలర్లు ఫీజుగా వసూలు చేసింది. ఈ నెల 21 నుంచి ఈ మొత్తాన్ని లక్ష డాలర్లకు పెంచిన సంగతి తెలిసిందే. దీంతో ఐటీ పరిశ్రమ వర్గాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో క్రిసిల్ ఈ నివేదిక విడుదల చేయడం విశేషం. నివేదిక ప్రధానాంశాలు..

- గత ఆర్థిక సంవత్సరం భారత ఐటీ కంపెనీల విదేశీ ఆదాయంలో అమెరికా వాటా 53 శాతం
- వీసాల ఫీజు పెంచినా ఈ ఆదాయానికి పెద్దగా ఢోకా ఉండకపోవచ్చు
- ప్రస్తుతం అమెరికాలోని భారత ఐటీ కంపెనీల ఉద్యోగుల జీతభత్యాల్లో హెచ్-1బీ వీసాల ఫీజు భారం శాతం 0.02-0.05 శాతం మాత్రమే
- హెచ్-1బీ వీసాల ఉద్యోగులు 35 శాతం వద్ద స్థిరంగా ఉన్నా, వచ్చే ఆర్థిక సంవత్సరం జీతాల ఖర్చులో వీసాల ఫీజు భారం ఒక శాతం మించుతుంది
- హెచ్-1బీ వీసాల ఉద్యోగులు 35 శాతాని కంటే తగ్గితే, ఫీజుల భారం 0.3-0.6 శాతం వరకు ఉండే అవకాశం
- హెచ్-1బీ ఉద్యోగులను క్రమంగా తగ్గించుకుంటున్న భారత ఐటీ కంపెనీలు
- 2017-25 మధ్య ఏటా సగటున 9 శాతం చొప్పున తగ్గిన హెచ్-1బీ ఉద్యోగులు
- హెచ్-1బీ వీసాల తిరస్కరణ రేటు పెరగడంతో నియర్‌షోర్ కేంద్రాలు, స్థానికుల నియామకంపై దృష్టి పెట్టిన భారత ఐటీ కంపెనీలు
- వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచే ఐటీ కంపెనీలపై ఫీజుల పెంపు ప్రభావం

రూ.11 లక్షల కోట్లు

తగ్గిన జీఎస్‌టీ రేట్లు అమల్లోకి వచ్చిన తొలి రోజు జరిగిన డిజిటల్ చెల్లింపులివి..

న్యూఢిల్లీ: జీఎస్‌టీ రేట్లు తగ్గడంతో వినియోగదారుల్లో కొనుగోళ్ల ఉత్సాహం వెల్లివిరిసింది. ఆర్‌బీఐ తాజా గణాంకాలే ఇందుకు నిదర్శనం. జీఎస్‌టీ రేట్లు తగ్గిన తొలి రోజున (ఈ నెల 22న) దేశంలో డిజిటల్ చెల్లింపులు ఏకంగా రూ.11 లక్షల కోట్లకు పెరిగాయి. అంతక్రితం రోజు (ఈనెల 21)న నమోదైన రూ.1.1 లక్షల కోట్ల డిజిటల్ పేమెంట్స్‌తో పోలిస్తే దాదాపు 10 రెట్లు అధికమయ్యాయి.

ఎలా	ఎంత
ఆర్‌టీజీఎస్	8.2 లక్షల కోట్లు
నెఫ్ట్	1.6 లక్షల కోట్లు
యూపీఐ	82,477 కోట్లు

డిజిటల్ చెల్లింపులు ఈ మార్గాల్లో ..

- యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)
- నేషనల్ ఎలక్ట్రానిక్స్ ఫండ్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్)
- రియల్ టైమ్ గ్రాస్ సెటిల్‌మెంట్ (ఆర్‌టీజీఎస్)
- ఇమ్మీడియెట్ పేమెంట్ సర్వీసెస్ (ఐఎంపీఎస్)
- డెబిట్, క్రెడిట్ కార్డులు

25% పెరిగిన ఈ-కామర్స్ విక్రయాలు: మార్కెట్ రీసెర్చ్ సంస్థ రెడ్‌సీర్ ప్రకారం.. జీఎస్‌టీ తగ్గిన తొలి రెండు రోజుల్లో ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా విక్రయాలు 23-25 శాతం మేర పెరిగాయి. ఈ-కామర్స్ లావాదేవీల్లో క్రెడిట్ కార్డు ద్వారా చెల్లింపులు దాదాపు 6 రెట్లు పెరిగి రూ.10,411 కోట్లకు, డెబిట్ కార్డు ద్వారా పేమెంట్స్ 4 రెట్లు పెరిగి రూ.814 కోట్లకు చేరాయి.

మార్కెట్ మదుపరుల్లో 25% మహిళలే..

12 కోట్లు దాటిన ఎన్ఎస్ఈ ఇన్వెస్టర్ బేస్

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద ఈక్విటీ ట్రేడింగ్ వేదికైన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) ఇన్వెస్టర్లు ఈ నెల 23 నాటికి 12 కోట్లు దాటారు. గత 8 నెలల్లో ఇన్వెస్టర్ల సంఖ్య మరో కోటి (11 కోట్ల నుంచి 12 కోట్లకు) పెరిగిందని ఎన్ఎస్ఈ గురువారం వెల్లడించింది. మొత్తం ఇన్వెస్టర్లలో 25 శాతం (ప్రతి నలుగురిలో ఒకరు) మహిళలేనని తెలిపింది.

14 ఏళ్లకు తొలి కోటి..

ఈ ఏడాది జనవరిలో ఎన్ఎస్ఈ వినూత్న ఇన్వెస్టర్ల సంఖ్య 11 కోట్లు దాటింది. ఎక్స్ఛేంజీ కార్యకలపాలు ప్రారంభించిన 14 ఏళ్లకు తొలి కోటి ఇన్వెస్టర్ల మైలురాయిని చేరుకుంది. ఆ తర్వాత ఏడేళ్లకు రెండు కోట్లకు చేరింది. ఆపై 3.5 ఏళ్లలో మూడు కోట్లు దాటింది. ఆ తర్వాత ఏడాదికి పైగా కాలంలో (2021 మార్చి నాటికి) 4 కోట్లకు ఎగబాకింది. అంటే, 4 కోట్ల ఇన్వెస్టర్లను సాధించేందుకు ఎక్స్ఛేంజీకి పాతికేళ్లకు పైగా సమయం పట్టింది. ఆ తర్వాత ప్రతి 6-7 నెలలకు ఇన్వెస్టర్లు కోటి మేర పెరుగుతూ వచ్చారు.

23.5 కోట్లు: ఈ నెల 23 నాటికి ఎన్ఎస్ఈలో నమోదైన మొత్తం ఇన్వెస్టర్ అకౌంట్ల సంఖ్య

33 ఏళ్లు: ఎక్స్ఛేంజీలోని 12 కోట్లకు పైగా వినూత్న ఇన్వెస్టర్ల సగటు వయసు. దాదాపు 40 శాతం మంది 30 ఏళ్లలోపు వారే.

99.85 శాతం: ఎన్ఎస్ఈ ఇన్వెస్టర్లు దేశంలోని 99.85 శాతం పిన్ కోడ్‌లలో విస్తరించి ఉన్నారు.

మహారాష్ట్ర టాప్: రాష్ట్రాల వారీగా చూస్తే, 1.9 కోట్ల ఇన్వెస్టర్లతో మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉంది. ఉత్తర ప్రదేశ్ (1.4 కోట్లు), గుజరాత్ (1.03 కోట్లు) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

25,000 దిగువకు నిఫ్టీ

సెన్సెక్స్ 556 పాయింట్లు డౌన్

ముంబై: స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా ఐదో రోజూ నష్టపోయాయి. సెన్సెక్స్ 555.95 పాయింట్లు కోల్పోయి 81,159.68 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 166.05 పాయింట్లు పతనమై 25,000 దిగువ స్థాయి 24,890.85 వద్ద ముగిసింది. ఈక్విటీ వర్గాల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3.21 లక్షల కోట్ల మేర తరిగిపోయి రూ.457.35 లక్షల కోట్లకు పడిపోయింది. విదేశీ సంస్థాగత పెట్టుబడుల నిరవధిక ఉపసంహరణ, హెచ్1బీ వీసా ఫీజు పెంపు ఆందోళనలు, అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాలు ఇందుకు ప్రధాన కారణం. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 25 నష్టపోయాయి.

ఫుడ్ ప్రాసెసింగ్‌లో రూ.65,000 కోట్ల పెట్టుబడులు

కర్నూలులో రిలయన్స్‌ప్లాంట్

తెలంగాణ, ఏపీల్లో కోకా-కోలా బాట్లింగ్ ప్లాంట్లు

న్యూఢిల్లీ: భారత ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో రూ.65,000 కోట్ల పెట్టుబడులకు రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (ఆర్‌సీపీఎల్), మరో మూడు కోకా-కోలా బాట్లింగ్ కంపెనీలు ముందుకు వచ్చాయి. ఈ మొత్తంలో ఆర్‌సీపీఎల్ ఒక్కటే రూ.40,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. ఢిల్లీలో గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజుల పాటు జరుగుతున్న వరల్డ్ ఫుడ్ ఇండియా సదస్సు తొలి రోజునే ఇందుకు సంబంధించిన ఎంఓయూలపై సంతకాలు చేసినట్టు కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ తెలిపారు. ఈ సదస్సులో రూ.లక్ష కోట్ల మేరకు పెట్టుబడి ఒప్పందాలు కుదరవచ్చన్న ఆశాభావం ప్రకటించారు. కాగా ఆర్‌సీపీఎల్ రూ.1,500 కోట్లకు పైగా పెట్టుబడితో సమీకృత ఆహార, పానీయ ఉత్పత్తుల తయారీ ప్లాంట్లు ఏర్పాటు చేయనుందన్నారు. మహారాష్ట్రలోని కటోల్, నాగ్‌పూర్, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో ఈ ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి.మరోవైపు ఎస్ఎల్ఎంజీ బెవరేజెస్, హిందుస్తాన్ కోకా-కోలా బెవరేజెస్, కాంధారీ గ్రూప్ కంపెనీలు ఉమ్మడిగా రూ.25,760 కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు కుదుర్చుకున్నాయి. ఈ కంపెనీలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఉత్తరప్రదేశ్, బిహార్, కర్ణాటకల్లో కొత్త బాట్లింగ్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నాయి.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



సభలో సినీ రగడ

కామినేని వ్యాఖ్యలకు బాలకృష్ణ కౌంటర్

జగన్‌పై ధ్వజం.. చిరంజీవి ప్రస్తావన 11

బాలయ్య మాటలపై చిరు తీవ్ర స్పందన

శుక్రవారం | 26-9-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

యూరప్ నుంచి రాగానే
కోర్టుకు రండి

జగన్ విదేశీ పర్యటనకు షరతులతో సీబీఐ కోర్టు అనుమతి

వచ్చే నెల 1-30 తేదీల మధ్య 15 రోజుల పర్యటన

నవంబరు 14లోపు కోర్టులో హాజరుకు ఆదేశం

సీబీఐ అభ్యంతరాలతో షరతులు విధింపు



హైదరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ యూరప్ పర్యటనకు హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టు అనుమతి ఇచ్చింది. అక్టోబరు 1 నుంచి 30వ తేదీ మధ్య 15 రోజుల పాటు యూరప్ వెళ్లేందుకు పలు షరతులతో అనుమతి మంజూరు చేసింది. అదే సమయంలో... పర్యటన ముగిసిన అనంతరం స్వయంగా కోర్టుకు హాజరు కావాలని ఆదేశించింది. జగన్ ఎన్నడూ కోర్టు షరతులను ఉల్లంఘించ లేదని ఆయన తరపు న్యాయవాది పేర్కొనగా... సీబీఐ తరఫున వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ దీనితో విభేదించారు. "జగన్ ఆర్థిక నేరాల్లో నిందితుడు. విదేశీ పర్యటనలకు ఆయనను అనుమతించకూడదు. పైగా... గతంలో విదేశీ పర్యటనలకు అనుమతించినప్పుడు ఒకటి రెండు సందర్భాల్లో మినహా ఆయన కోర్టు ముందు హాజరు కాలేదు. విదేశాల నుంచి ఎప్పుడు వచ్చారో కూడా తెలియదు. అందువల్ల... దీనికి సంబంధించి తగిన షరతులు విధించాలి" అని కోర్టును కోరారు. దీంతో... న్యాయస్థానం పలు షరతులతో జగన్ యూరప్ పర్యటనకు అనుమతించింది. ఆయన తన పర్యటన పూర్తి వివరాలను కోర్టుకు, సీబీఐకి ఇవ్వాలని ఆదేశించింది. అలాగే... యూరప్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత నవంబరు 14వ తేదీలోపు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరై స్వదేశానికి ఎప్పుడు తిరిగి వచ్చారో స్పష్టం చేస్తూ కోర్టుకు మెమో సమర్పించాలని ఆదేశించింది.

తప్పు చేసినవారిని వదలను 12

నాది కక్ష రాజకీయమైతే అధికారంలోకి రాగానే జైల్లో వేసేవాడిని

ప్రజాస్వామ్యంపైనే నాడు వైసీపీ దాడి.. స్పీకర్, డిప్యూటీ స్పీకర్, డిప్యూటీ సీఎం.. అంతా బాధితులమే.. ఏ తప్పూ చేయని నాపై 17 కేసులు: సీఎం

వైసీపీ 'సోషల్' సైకోలపై కొరడా 13

సీఎం 'యూరియా' వ్యాఖ్యలపై మార్ఫింగ్ వీడియోలు

గుంటూరు, అనంతలో ఇద్దరి అరెస్టు.. నెల్లూరు వాసి పరార్

150 కేసులు వేసినా
150 రోజుల్లోనే మెగా డీఎస్సీ పూర్తి

యువగళంలోనే మెగా ఆలోచన

నిరుద్యోగ యువతతో మాట్లాడే వాడిని.. డీఎస్సీ ఫైల్ పైనే తొలి సంతకమని అప్పుడే చెప్పా

ఏపీ మోడల్ ఎడ్యుకేషన్‌ను ప్రపంచానికి చూపిద్దాం: లోకేశ్


డీఎస్సీ నియామకపత్రాలతో కొత్త టీచర్ల సంబరం

ఇక ఏటా డీఎస్సీ

ఏడాదికో నోటిఫికేషన్ ఇస్తాం.. అందరూ పరీక్షలకు సిద్ధమవ్వండి: సీఎం

అవినీతి లేకుండా మెగా డీఎస్సీ నిర్వహించాం

'బాబు ష్యూరిటీ- జాబు గ్యారంటీ' నిజమైంది


ప్రభుత్వంలోనే మెరుగైన సౌకర్యాలు, బోధన

సర్కారీ బడుల్లో 'నో అడ్మిషన్' బోర్డులుండాలి

పిల్లలకు విలువలతో కూడిన విద్య నేర్పండి

కొత్త టీచర్లకు సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం

అనారోగ్యం కారణంగా హాజరుకాలేకపోయిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్


ప్రకాశం జిల్లాకు చెందిన పి.కవితకు (ఎస్ఏ ఇంగ్లిష్) నియామకపత్రం అందజేస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన మంత్రి లోకేశ్, బీజేపీ ఏపీ చీఫ్ మాధవ్

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఇక ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని, ఏడాదికో నోటిఫికేషన్ ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఉద్యోగార్థులందరూ పరీక్షలకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన 15,941 మందికి గురువారం అమరావతిలో నిర్వహించిన సభలో సీఎం చంద్రబాబు, అధికారులు నియామక పత్రాలు అందించారు. సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. 'అసాధ్యమనుకున్న పనిని ఏడాదిలోగా పూర్తి చేసి నియామక పత్రాలు ఇప్పించిన ఘనత మంత్రి లోకేశ్‌దే. ఉద్యోగం కోసం

మిగతా 13వ పేజీలో...

'మెగా డీఎస్సీ'.. మెగా హిట్

15,941 మందికి నియామక పత్రాలు అందజేత

చిరస్థాయిగా నిలిచే శుభ సమయం

ఉద్యోగార్థుల ఏళ్ల నిరీక్షణకు తెరపడింది

కొత్త టీచర్లకు డిప్యూటీ సీఎం పవన్ శుభాకాంక్షలు

రైలు పైనుంచి క్షిపణి 2


రైలు పైనుంచి నింగిలోకి దూసుకెళ్తున్న అగ్ని-ప్రైమ్ క్షిపణి

అగ్ని-ప్రైమ్ పరీక్ష సక్సెస్

తొలిసారిగా రైలుపై నుంచి పరీక్షించిన డీఆర్డీవో

2 వేల కి.మీ.ల దూరంలోని లక్ష్యాల్ని ఛేదించే సామర్థ్యం

రైల్ నెట్‌వర్క్‌తో దేశంలో ఎక్కడికైనా తరలించే చాన్స్

వాంగ్‌చుక్ సంస్థకు విదేశీ నిధులు కట్!

- ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్సును రద్దు చేసిన కేంద్రం
- లద్దాఖ్‌లో హింసకు ఆయనే కారణమని ప్రకటించిన మరుసటి రోజే కీలక నిర్ణయం

లేహ్, సెప్టెంబరు 25: లద్దాఖ్‌లో బుధవారం చెలరేగిన హింసకు కారణం విద్యావేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుకేనని ఆరోపించిన కేంద్ర హోం శాఖ.. ఆయనపై చర్యలకు ఉపక్రమించింది. ఆయన స్థాపించిన 'లద్దాఖ్ విద్యా సాంస్కృతిక ఉద్యమం' అనే సంస్థకు విదేశీ నిధులు అందకుండా బ్రేక్ వేసింది. ఆ సంస్థకు విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్‌ఏ) కింద జారీ చేసిన లైసెన్సును గురువారం రద్దు చేసింది. ఆ సంస్థ పలుమార్లు ఎఫ్‌సీఆర్‌ఏను ఉల్లంఘించినట్లు గుర్తించామని సీబీఐ వర్గాలు చెబుతున్నాయి. కొంతకాలంగా వాంగ్‌చుక్ సంస్థ ఆర్థిక లావాదేవీలపై సీబీఐ విచారణ జరుపుతున్నా ఇంతవరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. అయితే లద్దాఖ్‌లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న మరుసటి రోజే కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఇదిలా ఉండగా.. రాష్ట్ర హోదా కోసం నిరసనలు హింసాత్మకంగా మారిన లద్దాఖ్‌లో గురువారం కర్ఫ్యూ విధించారు. అల్లర్లలో ప్రమేయం ఉన్న 50 మందిని అరెస్టు చేశారు. కాగా, తాను రెచ్చగొట్టే ప్రసంగాలు చేశానని, అందుకే లద్దాఖ్‌లో హింస చెలరేగిందన్న కేంద్ర హోం శాఖ అభియోగాన్ని వాంగ్‌చుక్ ఖండించారు. కేంద్రం సమస్య నుంచి తప్పించుకోవడానికి తనను బలిపశువును చేస్తోందని ఆరోపించారు. ప్రజా భద్రత చట్టం కింద తనను రెండేళ్ల జైలులో పడేయడానికి పథకం రచిస్తోందని ఆరోపించారు. తాను జైలుకు వెళ్లడానికైనా సిద్ధమేనన్నారు. తాను స్వేచ్ఛగా ఉన్నప్పుడు కంటే జైలులో ఉన్నప్పుడే ప్రభుత్వానికి సమస్యలు పెరుగుతాయని ఆయన వ్యాఖ్యానించారు.

కర్ణాటకలో కులగణనకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

బెంగళూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, విద్య సర్వేకి (కులగణన) హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కులగణన చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేదని, శాస్త్రీయత లేదని రాష్ట్ర ఒక్కలిగ సంఘం, అఖిల కర్ణాటక బ్రాహ్మణ మహాసభ, మాజీ ఎమ్మెల్యే, సీనియర్ న్యాయవాది కేఎన్ సుబ్బారెడ్డి తదితరులు హైకోర్టులో పిటిషన్‌లను దాఖలు చేసిన విషయం తెలిసిందే. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విభు బఖ్రు, న్యాయమూర్తి జస్టిస్ జోషిల ద్విసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌లను రెండురోజులపాటు విచారించింది. ఇరుపక్షాల వాదనలను ఆలకించింది. కులగణనపై స్టే ఇచ్చేందుకు నిరాకరిస్తూ గురువారం మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను డిసెంబరు రెండో వారానికి వాయిదా వేసింది.

భారత్‌తో ఇంధన, వాణిజ్య సంబంధాల విస్తరణ

- అమెరికా కోరుకుంటోందన్న ఆ దేశ ఇంధన మంత్రి రైట్

న్యూయార్క్, సెప్టెంబరు 25: భారత్‌తో అమెరికా వాణిజ్యంతోపాటు ఇంధన సహకారాన్ని విస్తరించాలని కోరుకుంటోందని అగ్రరాజ్య ఇంధన శాఖ మంత్రి క్రిస్ రైట్ పేర్కొన్నారు. అమెరికాకు భారత్ అద్భుతమైన మిత్ర దేశమన్నారు. అయితే రాయితీతో రష్యా నుంచి భారత్ ముడిచమురును దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య విభేదాలు నెలకొన్నట్టు ఆయన అంగీకరించారు. బుధవారం న్యూయార్క్‌లో మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమే కాకుండా వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశమని, భారత్‌లో ఇంధన డిమాండ్ వేగంగా పెరుగుతోందని రైట్ పేర్కొన్నారు.

ఎన్నికల ప్రచారానికి అక్రమ నిధులు...
ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు సర్కోజీకి ఐదేళ్ల జైలు

పారిస్, సెప్టెంబరు 25: ఎన్నికల ప్రచారానికి అక్రమంగా నిధులు పొందినట్టు రుజువు కావడంతో ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీ (70)కి గురువారం పారిస్ క్రిమినల్ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ తీర్పుపై ఆయన అప్పీలు చేసినప్పటికీ శిక్ష వాయిదా పడదని, ఆయన జైలులో ఉండాల్సినదేనని స్పష్టం చేసింది. అయితే జైలుకు వెళ్లాల్సిన తేదీని తరువాత ప్రకటిస్తామని తెలిపింది. 2007 ఎన్నికల సందర్భంగా ఆయన లిబియా దేశం నుంచి అక్రమంగా నిధులు పొందినట్టు కేసు నమోదైంది. లిబియాకు పాశ్చాత్య దేశాలతో దౌత్య సంబంధాలు మెరుగుపడేలా కృషి చేస్తానంటూ అప్పటి ఆ దేశ అధినేత మహమ్మర్ గడాఫీకి హామీ ఇచ్చి ప్రతిఫలంగా ఎన్నికల కోసం నిధులు పొందారని కోర్టు తెలిపింది.



స్వచ్ఛతా హై సేవలో కెనరాబ్యాంకు సీఎండీ సత్యనారాయణరాజు

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

- కెనరాబ్యాంకు సీఎండీ సత్యనారాయణరాజు

బెంగళూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని కెనరాబ్యాంకు చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కే సత్యనారాయణ రాజు అభిప్రాయపడ్డారు. స్వచ్ఛతా హై సేవా పిలుపులో భాగంగా గురువారం బనశంకరి బీడీఏ కాంప్లెక్స్ ప్రాంగణంలో శ్రమదానం చేశారు. కెనరాబ్యాంకు ప్రధాన కార్యాలయంతోపాటు నగరపరిధిలోని బ్యాంకుశాఖల ఉద్యోగులు 250మందికిపైగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ప్రధానమంత్రి స్వచ్ఛతా పిలుపు మేరకు సమాజంలో చైతన్యం తీసుకురావాలనే స్వచ్ఛతా హై సేవా నిర్వహిస్తున్నామన్నారు. భారత్ అతిపెద్ద ఆర్థికదేశంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ దశలో ఆర్థికతలో సాధనే కాకుండా సంపూర్ణ ఆరోగ్యం కీలకమన్నారు. అందుకే కెనరాబ్యాంకు ఓ పోరాటంలాగా స్వచ్ఛతా హై సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

వాయుసేన శక్తికి మరింత 'తేజస్'

న్యూఢిల్లీ, సెప్టెంబరు 25: మన వాయుసేన నుంచి మిగ్-21 యుద్ధ విమానాలకు వీడ్కోలు పలుకుతున్న వేళ దేశీయ యుద్ధ విమాన కొనుగోళ్ల కోసం ఓ పెద్ద ఒప్పందం జరిగింది. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) నుంచి వాయుసేన కోసం 97 తేజస్ ఎంకే-1ఏ జెట్లను రూ. 62,370 కోట్లతో కొనుగోలు చేయడానికి రక్షణ మంత్రిత్వ శాఖ ఒప్పందం చేసుకుంది. 97 యుద్ధ విమానాల్లో సింగిల్ సీట్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు 68, రెండు సీట్ల శిక్షణ విమానాలు 29 ఉన్నాయి. వీటితో అనుబంధ పరికరాలు కూడా భారత వాయుసేనకు అందించాల్సి ఉంటుంది. 2027-28 నుంచి ఈ తేలికపాటి యుద్ధ విమానాల (ఎల్‌సీఏ) సరఫరా ప్రారంభం కానుంది. తదనంతరం ఆరేళ్లలో సరఫరా ప్రక్రియ పూర్తవుతుంది. గతంలో 2021లో 46,898 కోట్లతో 83 తేజస్ ఎంకే-1ఏ ఎయిర్‌క్రాఫ్ట్‌ల కొనుగోలుకు ఇలాంటి ఒప్పందమే జరిగింది. తాజా ఒప్పందానికి ఈ ఏడాది ఆగస్టు 19న ప్రధాని ఆధ్వర్యంలో జరిగిన భద్రతా వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ అనుమతి ఇచ్చింది. గతంలోని ఒప్పందం కంటే ఈ ఒప్పందంలోని ఎయిర్‌క్రాఫ్ట్‌ల్లో 64% అధికంగా దేశీయ పరికరాలు, 67 అదనపు పరికరాలు ఉంటాయి. అలాగే ఉత్తమ్ యాక్టివ్ ఎలక్ట్రానికల్లీ స్కాన్ ఆరే (ఏసా) రాడార్, స్వయం రక్ష కవచ్ సూట్‌తో పాటు క్లిష్టమైన ఉపరితలాల్లో విమానాన్ని నియంత్రణలో ఉంచే యాక్చుయేటర్స్ కూడా ఉంటాయి. వాయుసేనలో మిగ్-21 వంటి పాత తరం విమానాలను ఉపసంహరిస్తున్నందున వాటి స్థానంలో అధునాతన సింగిల్ ఇంజన్ తేజస్ విమానాలను ప్రవేశపెట్టనున్నారు. భారత వాయుసేన అవసరాలను ఈ దేశీయ విమానాలు తీర్చగలవని భావిస్తున్నారు. చివరి మిగ్-21 స్క్వాడ్రన్‌లకు శుక్రవారం తుది వీడ్కోలు పలుకుతున్న వేళ ఈ ఒప్పందం జరగడం విశేషం. తేజస్ విమానాల తయారీ, సరఫరా ప్రాజెక్టులో 105 కంపెనీలు భాగస్వామ్యం కానున్నాయని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ఒప్పంద కాలంలో ఏటా 11,750 ఉద్యోగాలు వస్తాయని చెప్పింది.

తేజస్‌కు అమెరికా ఇంజన్లు లేనట్లేనా?

దేశీయ తేజస్ మార్క్2 విమానాలకు అమెరికా సంస్థ జనరల్ ఎలక్ట్రిక్(జీఈ) ఎఫ్-414 ఇంజన్లను అమర్చకపోవచ్చనే ప్రచారం జరుగుతోంది. అగ్రరాజ్యం కక్షసాధింపు నేపథ్యంలో ఫ్రాన్స్‌కు చెందిన శాఫ్రాన్ ఎస్ఏ కలసి భారత్‌లో ఇంజన్‌లు అభివృద్ధి చేసే అవకాశం ఉందని బ్లూమ్‌బెర్గ్ తన కథనంలో పేర్కొంది. ఆ కంపెనీ నుంచి భారత్ ఇంజన్లు కొనుగోలు చేస్తుందా లేక కలసి తయారు చేస్తుందా అనే విషయంలో స్పష్టత లేదంది.

రైలుపై నుంచి క్షిపణి

అగ్ని-ప్రైమ్ పరీక్ష సక్సెస్.. తొలిసారి రైలు నుంచి పరీక్షించిన డీఆర్‌డీవో

అల్వాల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత రక్షణ వ్యవస్థలోకి మరో సరికొత్త అస్త్రం వచ్చి చేరింది. తొలిసారి రైలుపై నుంచి ప్రయోగించదగిన మధ్యశ్రేణి అగ్ని-ప్రైమ్ క్షిపణి పరీక్షను డీఆర్‌డీవో గురువారం విజయవంతంగా నిర్వహించింది. రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించిన ప్రత్యేక మొబైల్ లాంచింగ్ వ్యవస్థపై నుంచి ఇలాంటి ప్రయోగం చేయడం ఇదే మొదటిసారి. ఈ పరీక్ష విజయవంతమైందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఎక్స్‌లో వెల్లడించారు. అణుసామర్థ్యం కలిగిన అగ్ని ప్రైమ్ క్షిపణిని అతి తక్కువ సమయంలో అవసరమైన చోటుకి తరలించి ప్రయోగించేలా రైలు ఆధారిత మొబైల్ లాంచింగ్ వ్యవస్థను డీఆర్‌డీవో అభివృద్ధి చేసినట్టు ఆయన తెలిపారు. ఈ క్షిపణి పరీక్షను విజయవంతం చేసిన డీఆర్‌డీవో, స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ (ఎస్ఎఫ్‌సీ), సాయుధ దళాలను ఆయన అభినందించారు. ఈ పరీక్షను విజయవంతం చేసిన బృందాలను డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ కామత్ అభినందించారు.



రైలు ఆధారిత మొబైల్ లాంచర్ నుంచి అగ్ని-ప్రైమ్ క్షిపణిని పరీక్షిస్తున్న డీఆర్‌డీవో

అగ్ని ప్రైమ్ అగ్ని-5

అగ్ని ప్రైమ్ మిస్సైల్‌లో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించారు. ఇది 2 వేల కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను సైతం అలవోకగా ఛేదించగలదు. శత్రు రాడార్ల కళ్లుగప్పి వారి స్థావరాలపై కచ్చితమైన దాడులు చేయగలదు. రైల్ నెట్‌వర్క్‌తో అనుసంధానించడం వల్ల చాలా తక్కువ సమయంలోనే దేశంలోని ఏ సరిహద్దు ప్రాంతానికైనా వేగంగా తరలించవచ్చు. దీనిలోని నావిగేషన్ వ్యవస్థను ఆధునీకరించారు. ఈ పరీక్ష విజయవంతం కావడంతో భారత్ వద్ద ఉన్న అగ్ని-5 క్షిపణిపైనా చర్చ మొదలైంది. అగ్ని-ప్రైమ్ కూడా 'అగ్ని' శ్రేణికే చెందినప్పటికీ.. అగ్ని-5తో దీనికి పోలికలేదు. ఇవి రెండూ వేర్వేరు ప్రయోజనాల కోసం రూపొందించిన క్షిపణులు. అగ్ని ప్రైమ్.. నెక్ట్స్ జనరేషన్ మధ్యశ్రేణి బాలిస్టిక్ క్షిపణి. అణు సామర్థ్యం కలిగిన ఈ క్షిపణిని రైలు, లేదా రోడ్డు ఆధారిత మొబైల్ లాంచర్లపై నుంచి కూడా ప్రయోగించవచ్చు. దీనిలో సింగిల్ వార్‌హెడ్ ఉంటుంది. ఇక భారత్ వద్ద ఉన్న అత్యంత దీర్ఘశ్రేణి ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి అగ్ని-5. అణుసామర్థ్యం కలిగిన ఈ మిస్సైల్ 5వేల కిలోమీటర్లకంటే ఎక్కువ దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. దీన్ని డీఆర్‌డీవో అభివృద్ధి చేసింది. ఇది మూడు వార్‌హెడ్లను మోసుకెళ్లగలదు. అవి ఒక్కొక్కటీ వేర్వేరు లక్ష్యాలను లక్ష్యంగా చేసుకుని ఛేదిస్తాయి.

మిగ్-21కు నేడు తుది వీడ్కోలు

- చండీగఢ్‌లో డీకమిషన్ కార్యక్రమం

చండీగఢ్, సెప్టెంబరు 25: ఆరు దశాబ్దాల సేవల అనంతరం భారత వాయుసేన సమరాశ్వాలైన మిగ్- 21 యుద్ధ విమానాలకు శుక్రవారం తుది వీడ్కోలు పలకనున్నారు. చండీగఢ్‌లో నిర్వహించే భారీ కార్యక్రమంలో రష్యా మూలాలున్న ఆ జెట్లు వాయుసేన నుంచి రిటైర్మెంట్ తీసుకోనున్నాయి. ఈ కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారు. 1960వ దశకంలో కమిషన్ అయిన చోటే ఆరు దశాబ్దాల తర్వాత వాటిని డీకమిషన్ చేయనున్నారు. చివరిసారిగా మిగ్-21 బైసన్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను శుక్రవారం చండీగఢ్‌లో ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ నడపనున్నారు. 1963లో తొలి మిగ్‌ను వింగ్ కమాండర్ దిల్బాగ్ సింగ్ నడిపారు. తర్వాత ఐఏఎఫ్ 870కి పైగా మిగ్-21లను సేకరించింది. పాక్‌తో 1965, 71లో జరిగిన యుద్ధాల్లో ఈ సూపర్ సోనిక్ జెట్లు కీలకపాత్ర పోషించాయి. 1999 కార్గిల్ యుద్ధంలోనూ, 2019 బాలాకోట్ ఎయిర్‌స్ట్రైక్‌ల్లోనూ కీలకంగా వ్యవహరించాయి. పలుమార్లు ఇవి కూలిపోవడంతో వీటి భద్రతా ప్రమాణాల లోటుపాట్లు వెలుగులోకి వచ్చాయి. కాగా, డీకమిషనింగ్‌లో 23 స్క్వాడ్రాన్‌కు చెందిన 6 మిగ్-21 జెట్స్ ల్యాండ్ అయిన తర్వాత వాటర్ క్యానన్లతో సెల్యూట్ చేస్తారు. వాటి పైలట్ల లో స్క్వాడ్రన్ లీడర్ ప్రియా శర్మ కూడా ఉన్నారు. బుధవారం జరిగిన రిహార్సల్స్‌లో ఆమె పూర్తి డ్రెస్‌లో పాల్గొని వార్తల్లో నిలిచారు. ఈ యుద్ధ విమానాలను చిట్టచివరిగా నడిపిన మహిళా ఫైటర్ పైలట్‌గా చరిత్ర లిఖించారు. చండీగఢ్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో చివరి మిగ్‌లను నడిపే ఆరుగురు ఐఏఎఫ్ పైలట్లలో మహిళా ఫైటర్ పైలెట్, స్క్వాడ్రన్ లీడర్ ప్రియా శర్మ ఒకరు.

లోకం తీరు



ప్రతీ ఆయుధం మీద మేకిన్ ఇండియా!

- చిప్‌ల నుంచి షిప్‌ల దాకా ఇక్కడే తయారీ
- జీఎస్టీతో అన్ని ధరలు తగ్గాయి: మోదీ



గ్రేటర్ నోయిడా, సెప్టెంబరు 25: చిప్‌ల నుంచి షిప్‌ల వరకు దేశంలోనే అన్నీ తయారయ్యే విధంగా ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. దేశ రక్షణ వ్యవస్థకు సంబంధించి అన్ని ఆయుధాల విడిభాగాల మీద 'మేక్ ఇన్ ఇండియా' ముద్ర ఉండేటట్లు చూస్తామని ప్రకటించారు. గురువారం ఆయన ఢిల్లీ శివారులోని గ్రేటర్ నోయిడాలో ఉత్తరప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, భారత సైనిక వ్యవస్థ కూడా దేశీయ ఆయుధాలనే కోరుకుంటోందని, ఇతర దేశాల మీద ఆధారపడకూడదనే అభిప్రాయంతో ఉందని తెలిపారు. రష్యా భాగస్వామ్యంతో ఉత్తరప్రదేశ్‌లో ఏకే-203 రైఫిళ్లను తయారు చేస్తున్నట్లు ప్రకటించారు. వీటి ఉత్పత్తి త్వరలో ప్రారంభం అవుతుందన్నారు. యూపీలో కేవలం రక్షణ ఉత్పత్తుల కోసం ప్రత్యేక కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దేశంలో వ్యాపారులు చేసే చిన్నచిన్న తప్పులకు కూడా భారీ శిక్షలు పడే విధంగా చట్టాలు ఉన్నాయని, వాటిని సవరిస్తామని ప్రకటించారు. దేశంలో తయారయ్యే మొబైల్ ఫోన్లలో 55% ఉత్తరప్రదేశ్‌లోనే తయారవుతున్నాయని మోదీ వెల్లడించారు. ఇప్పుడు ప్రపంచంలో మొబైల్ ఫోన్ల తయారీలో భారత్ రెండో స్థానంలో ఉందని చెప్పారు. జీఎస్టీ సంస్కరణలతో టూత్‌పేస్ట్ మొదలు ట్రాక్టర్ల దాకా అన్ని వస్తువుల ధరలు తగ్గాయని ఆయన చెప్పారు.

ఇజ్రాయెల్ నరమేధంపై మౌనం వీడండి

- గాజాలో వేలాదిమందిని చంపేస్తున్నా.. ఏమీ పట్టనట్టు ప్రధాని మోదీ మౌనం
- ఓ ఆంగ్ల పత్రికకు సోనియా సంపాదకీయం



న్యూఢిల్లీ, సెప్టెంబరు 25 : పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు చేస్తూ, ఇప్పటివరకు వేలాదిమంది పౌరులను, పిల్లలను చంపివేసినా మోదీ ప్రభుత్వం మౌనంగా ఉండటం సరికాదని కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ అన్నారు. ఇజ్రాయెల్ చర్యను నరమేధంగా (జెనోసైడ్) దుయ్యబట్టిన ఆమె.. కనీస నైతికత, మానవత లేనివారే మోదీలా పూర్తి మౌనం వహిస్తారని ఆమె ఆక్షేపించారు. ఓ జాతీయ ఆంగ్ల పత్రికకు 'పాలస్తీనాపై భారత్ మౌనం, ఎడబాటు' అనే శీర్షికతో సోనియా సంపాదకీయం రాశారు. పాలస్తీనాకు మద్దతుగా భారత్ మరోసారి తన చారిత్రక నాయకత్వ పాత్రను పోషించాలని, పాలక దౌత్యనీతిని పక్కనబెట్టి దేశ ప్రజలు పాలస్తీనా కోసం మాట్లాడాలని ఆ వ్యాసంలో కోరారు. కాగా, పాలస్తీనా సమస్యపై పత్రికలకు సోనియా వ్యాసం రాయడం ఇది మూడోవది. కాగా, కాంగ్రెస్ వ్యవహారాలకు కొంతకాలంగా దూరంగా ఉంటున్న ఆ పార్టీ ఎంపీ శశిథరూర్ ఓ ఆంగ్ల పత్రికకు సోనియా రాసిన వ్యాసాన్ని సమర్థించారు. గాజాపై జరుపుతున్న మారణహోమం అన్ని హద్దులు దాటేసిందనీ, నిర్దయ దాడులను వెంటనే కట్టిపెట్టాలనీ ఇజ్రాయెల్‌కు తెలపాలని ఆయన వ్యాఖ్యానించారు.

దేశవ్యాప్త 'సర్'పై పార్టీలతో ఈసీ భేటీ!

రాష్ట్రాల సీఈవోలకు నిర్దేశం.. బిహార్ వివాదంతో కమిషన్ నిర్ణయం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 25: బిహార్ తరహాలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో త్వరలోనే ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) నిర్వహించాలని కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) నిర్ణయించింది. బిహార్లో రాజకీయ పార్టీలను సంప్రదించకుండా.. ఈ ప్రక్రియను చేపట్టి విపక్షాల ఆగ్రహానికి గురైన ఈసీ.. ఇప్పుడు దేశవ్యాప్త ప్రక్రియ మొదలుపెట్టే ముందే పార్టీలతో సంప్రదింపులు జరపాలని భావిస్తోంది. రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల ఎన్నికల ప్రధానాధికారులు(సీఈవో)లు వాటితో సమావేశాలు జరపాలని నిర్దేశించింది. వాస్తవానికి దేశమంతటా ఎన్నికల జాబితాలను సవరించాలని జూన్ 24నే ఆదేశాలు జారీచేసింది. పార్టీలను సంప్రదించకుండా మర్నాటి నుంచే రిజిస్టరైన ఓటర్లంతా కొత్త ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తిచేసి.. సంబంధిత ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని ఆదేశించి.. ఆ ఫారాల పంపిణీ ప్రారంభించింది. బిహార్లో అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో హడావుడిగా అక్కడ ఎస్ఐఆర్ చేపట్టింది. సెప్టెంబరు 30న ఈ రాష్ట్ర ఓటర్ల తుది జాబితాను ప్రచురించి ఈ ప్రక్రియను ముగించాలని నిర్ణయించింది. ఈ లోపల కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ ఆ రాష్ట్రంలో ఓటరు అధికార యాత్ర' నిర్వహించారు. బీజేపీతో ఈసీ కుమ్మక్కై ప్రతిపక్షాల ఓట్లను తొలగించాలని చూస్తోందని.. ఓట్ల చోరీ ద్వారా అధికారంలోకి రావాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. దేశవ్యాప్త ఎస్ఐఆర్‌ను ఎప్పుడు ప్రారంభించాలో ఈసీ ఇంకా నిర్ణయించనప్పటికీ.. అందుకు సీఈవోలు ఎంతవరకు సన్నద్ధంగా ఉన్నారో ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి ఈనెల 10న వారితో ఢిల్లీలో సమావేశంకూడా నిర్వహించింది. బిహార్లో ఈ ప్రక్రియ నిర్వహించేటప్పుడు ఎదురైన ఇబ్బందులు.. సజావుగా ముగించేందుకు తాము అమలు చేసిన వ్యూహాలు, విధానాలపై ఆ రాష్ట్ర సీఈవో ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆ రాష్ట్రంలో భారీసంఖ్యలో నేపాల్, బంగ్లాదేశ్ చొరబాటుదారులకు ఓటు హక్కు పొందారన్న ఆరోపణల నేపథ్యంలోనే ఈసీ అక్కడ ఎస్ఐఆర్ చేపట్టింది. అయితే ఓటర్ల పౌరసత్వ చట్టబద్ధతను ప్రశ్నించడానికి కమిషన్‌కు ఎలాంటి అధికారమూ లేదని కాంగ్రెస్, ఆర్జేడీ సహా పలు ప్రతిపక్షాలు వాదించాయి. అసలు ఎస్ఐఆర్ చేపట్టే అధికారమే దానికి లేదంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. అయితే ఓటర్ల పౌరసత్వాన్ని నిర్ధారించే అధికారాన్ని 326వ అధికరణ తమకు దఖలు పరచిందని ఈసీ స్పష్టంచేసింది. భారతీయ పౌరులకు మాత్రమే ఓటర్లుగా నమోదు చేసుకునే హక్కుందని ఈ అధికరణ చెబుతోందని పేర్కొంది.

బిహార్లో ఈబీసీలకు సంపూర్ణ హక్కులు

- బీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలకు ప్రైవేటు కాలేజీలు, వర్సిటీల్లో రిజర్వేషన్: రాహుల్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 25: బీజేపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. అబద్ధాలు ప్రచారం చేసినా.. బిహార్లో బీసీలకు సంపూర్ణ హక్కులు కల్పించేందుకు మహాగఠ్‌బంధన్ (మహాకూటమి) కట్టుబడి ఉందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్పష్టంచేశారు. బుధవారం పట్నాలో 'అతి పిచ్‌డా న్యాయ్ సంకల్ప్ పాత్ర'ను ప్రారంభించిన ఆయన.. గురువారం దీనిపై 'ఎక్స్'లో స్పందించారు. అత్యంత వెనుకబడిన వర్గాలు, బీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలను బలోపేతం చేసి.. వారికి మరింత భాగస్వామ్యం కల్పించేందుకు 'సంకల్ప్ పాత్ర'లో నిర్మాణాత్మక హామీలిచ్చామని తెలిపారు. ఈ వర్గాల అభ్యున్నతికి విద్యే కీలకమని.. ప్రైవేటు కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో వీరికి రిజర్వేషన్ కల్పిస్తామని.. ప్రైవేటు స్కూళ్లలో 50% కోటా ఇస్తామన్నారు. ఉద్యోగ నియామకాలకు సంబంధించి 'అర్హులైన అభ్యర్థులు లేరు' అనే అన్యాయ వ్యవస్థకు స్వస్తి పలుకుతామన్నారు. అసలైన సామాజిక న్యాయం, సమాన అభివృద్ధికి కచ్చితమైన గ్యారెంటీ ఇస్తున్నట్లు తెలిపారు.

ఓట్ల చోరీపై సంతకాల ఉద్యమం షురూ

ఓట్ల చోరీపై ఈసీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ దేశవ్యాప్తంగా సంతకాల ఉద్యమం ప్రారంభించింది. అక్టోబరు 15వ తేదీ వరకు ఇది కొనసాగుతుంది. 5 కోట్ల సంతకాలు సేకరించాలని సంకల్పించింది.

ప్రభుత్వం చేతికి హైదరాబాద్ మెట్రో!

- ఎల్ అండ్ టీతో చర్చల అనంతరం నిర్ణయం
- అప్పు రూ.13 వేల కోట్లు ప్రభుత్వం స్వీకరించాలి
- కంపెనీ వాటా కింద రూ.2 వేల కోట్లు చెల్లించాలి
- ముఖ్యమంత్రి రేవంత్ సమక్షంలో కుదిరిన ఒప్పందం

హైదరాబాద్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర భవిష్యత్తుకు సంబంధించి కీలకమైన ముందడుగు పడింది. మెట్రో రైలు సేవలను నగరమంతా విస్తరించేందుకు అవసరమైన రెండో దశ, మూడో దశ మెట్రోల నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయి. రెండు, మూడు దశల్లో ఏ రకంగానూ భాగస్వామ్యం పంచుకోవడానికి సిద్ధంగా లేని ఎల్ అండ్ టీ సంస్థను సాగనంపి, తొలిదశ మెట్రోను స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దాంతో దేశంలోనే తొలి ప్రైవేటు మెట్రో ప్రభుత్వపరం అవుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం కమాండ్‌కంట్రోల్ సెంటర్‌లో ఎల్ అండ్ టీ ప్రతినిధులతో కూర్చొని చర్చలు జరిపారు. మెట్రో మొదటి దశ కింద ఉన్న రూ.13 వేల కోట్ల అప్పులను ప్రభుత్వం తీసుకోవడానికి అంగీకరించారు. హైదరాబాద్ మెట్రో రైల్ స్పెషల్ పర్పస్ వెహికిల్‌లో ఎల్ అండ్ టీ భాగమైన రూ.5,900 కోట్లమొత్తంలో రూ.2000 కోట్లు వన్ టైం సెటిల్‌మెంట్ కింద చెల్లించేందుకు సమ్మతం తెలిపారు. ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే మెట్రో తొలిదశ నిర్వహణ ప్రభుత్వం చేతికి వస్తుంది. రెండోదశ పనులకు మార్గం సుగమం అవుతుంది.

సంస్కృతీ సంప్రదాయాలకు పునరుజ్జీవం

- 'విజయవాడ ఉత్సవ్'ను ప్రశంసించిన స్పీకర్ అయ్యన్న, డిప్యూటీ స్పీకర్ రఘురామ
- పున్నమి ఘాట్‌లో కార్యక్రమాల వీక్షణ
- పవిత్ర సంగమంలో మహాబృంద నృత్యం


విజయవాడ సిటీ/విజయవాడ కల్చరల్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): తెలుగునాట కనుమరుగవుతున్న సంస్కృతీ సాంప్రదాయాలకు 'విజయవాడ ఉత్సవ్' పునరుజ్జీవం పోస్తుందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. విజయవాడ పున్నమి ఘాట్‌లో గురువారం జరిగిన కార్యక్రమాలను స్పీకర్ అయ్యన్న, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు వీక్షించారు. అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ఐదేళ్ల సైకో, శాడిస్టుల పాలనలో పండుగలు, సంస్కృతి సాంప్రదాయాలకు భంగం వాటిల్లిందన్నారు. వేదికపై చేనేత చీరల ప్రదర్శనను అయ్యన్న ప్రత్యేకంగా అభినందించారు. చీరలోని అందం చుడీదార్‌లో ఉండదనే గొప్ప సత్యాన్ని నేటి తరం తెలుసుకోవాలని హితవు పలికారు. డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ మన సంస్కృతీ సాంప్రదాయాలు, కళలకు ఈ కార్యక్రమం అద్దం పడుతుందన్నారు.

మహాబృంద నృత్యం

కొండపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పవిత్ర సంగమం వేదికగా నిర్వహించిన విజయనర్తన కార్యక్రమం కనులవిందు చేసింది. ఈ కార్యక్రమంలో 300 మందితో కూడిన మహాబృందం నృత్య ప్రదర్శన చేశారు. ఇటలీ తెలుగు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టి.కిశోర్ తమ సంస్థ తరఫున విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ కళాకారులను సత్కరించారు.

ఉత్సవ్‌లో నేటి కార్యక్రమాలు

శుక్రవారం పున్నమిఘాట్‌లో బీట్ గురూస్ లైవ్, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఉన్నాయి. తుమ్మలపల్లి కళాక్షేత్రం వేదికగా.. గుంటూరుకు చెందిన ఎం.బి.కె మ్యూజిక్ అండ్ డ్యాన్స్ స్కూల్ విద్యార్థుల కూచిపూడి నృత్య ప్రదర్శన, తర్వాత సంగీత వాద్య ప్రదర్శన, కాళిక వేషాల ప్రదర్శన, తోలుబొమ్మలాట, పౌరాణిక పద్య నాటకం కార్యక్రమాలు జరుగుతాయి. ఘంటసాల ప్రభుత్వ కళాశాలలో కూచిపూడి, భరతనాట్యం, కోలాటం, గాత్ర సంగీత ప్రదర్శనలు, సాంఘిక నాటిక, తదితర కార్యక్రమాలు జరగనున్నాయి.



వేదికపై మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్న, పక్కన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎంపీ కేశినేని చిన్న, ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, బుద్దా వెంకన్న తదితరులు



నత్తలొచ్చేశాయి జాగ్రత్త!

ఆంధ్రాలోని పంటలపై ఆఫ్రికా నత్తల దాడి.. పండ్ల తోటలను, పంటలను పట్టి పీల్చేస్తున్నాయి





నిమ్మ చెట్టు ఎక్కి కాండానికి ఉన్న రసాన్ని పీలుస్తున్న నత్తలు

- చెట్ల కాండాలకు పట్టి రసం తాగేస్తున్నాయి
- నిలువునా ఎండిపోతున్న చెట్లు, పంటలు
- కేరళలో కనిపించిన ఈ నత్త రాష్ట్రంలోకి చొరబడింది
- రైతులంతా సామూహిక నివారణ చర్యలు చేపట్టాలి
- నత్తల బెడదపై ఉద్యాన శాస్త్రవేత్తల సూచన

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నత్త మాంసానికి అలవాటుపడిన వ్యక్తి ఒక రాక్షస నత్తను దేశంలోకి రహస్యంగా తెస్తాడు. కొన్నాళ్ల గడిచేసరికి ఆ రాక్షస నత్త సంతతి విస్తరించి చివరకు దేశాన్నే ప్రమాదంలోకి నెట్టేస్తుంది. రెండు ముక్కల్లో చెప్పాలంటే మల్లాది వెంకట కృష్ణమూర్తి రాసిన 'నత్తలొస్తున్నాయి జాగ్రత్త' నవల కథ ఇది. ఇప్పుడు వాస్తవంలోకి వస్తే గోదావరి జిల్లాల్లోని రైతులు నత్తలొచ్చేశాయి బాబోయ్ అంటూ కలవరపడుతున్నారు. నత్తలతో తమకు కంటి మీద కునుకు లేకుండా పోయిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆఫ్రికా నత్తలుగా పేర్కొనే ఇవి ఇక్కడి పంటలకు మరణశాసనం రాస్తున్నాయి. ఈ నత్తల దాడితో పంటలు, పండ్ల తోటలు, నిలువునా ఎండిపోతున్నాయి. వందలు, వేల సంఖ్యలో ఈ నత్తలు పొలాల్లో, తోటల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. గడ్డి, ఆకులు, లేత మొక్కలు అంటూ తేడా లేకుండా అన్నింటినీ తినేస్తున్నాయి. ప్రధానంగా నిమ్మ, కోకో, పామాయిల్, బొప్పాయి, జామ తోటల్లో చెట్టు కాండాలను పట్టుకుని వాటిలోని రసాన్ని పీల్చేస్తున్నాయి. ఈ నత్తల బెడద ఉభయ గోదావరి జిల్లాల్లో తాజాగా వెలుగుచూసింది. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని ఉద్యాన వర్సిటీకి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలంలోని పెంట్లమ్మ అడవి ప్రాంతం సమీపంలోని వ్యవసాయ భూముల్లో ఈ ఆఫ్రికా జాతి నత్తలు తిష్టవేశాయి. అవపాడు, నల్లజర్ల, ప్రకాశరావుపాలెం, ముసళ్లగుంట, సింగరాజపాలెం ప్రాంతాల్లో ఎక్కువగా ఉద్యాన పంటలను రైతులు సాగుచేస్తుంటారు. ఈ తోటలకు ఆఫ్రికా నత్తల బెడద అధికంగా ఉంది. చెట్ల కాండాలను పట్టుకుని దాని రసాన్ని తాగేస్తున్నాయి. మొక్కల ఆకులు, చిగురులను కూడా ఇవి వదలడం లేదు. ఆకులను పశువులు మేసినట్లు మేస్తున్నాయి. దీంతో మొక్కలు ఎండిపోయి చనిపోతుండడంతో రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు.



రసాన్ని పీల్చివేయడంతో చనిపోయిన నిమ్మ చెట్టు

కేరళ నుంచి మన రాష్ట్రంలోకి..!

మూడు నెలల క్రితం అక్కడక్కడ ఈ నత్తలు కనిపించాయి. మొదట్లో రైతులు దీన్ని పెద్దగా పట్టించుకోలేదు. అయితే కొద్ది రోజుల్లోనే వీటి సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. తీవ్రతను గుర్తించిన రైతులు వాటిని ఏరి తగలబెట్టారు. అయినా పూర్తి స్థాయిలో వీటి నివారణ జరగలేదు. పురుగు మందులు కూడా పిచికారి చేశారు. అయినా వాటిని అదుపు చేయలేకపోయారు. ఆఫ్రికా జాతి నత్త మొదటిగా కేరళలో కనిపించింది. అక్కడ ఉన్న వక్క తోటలను, ఇతర ఉద్యాన పంటలను దెబ్బతీసింది. అక్కడి రైతులు గుర్తించేలోపే తీవ్ర నష్టం వాటిల్లింది. నల్లజర్ల మండలంలో కొంత మంది రైతులు వక్క సాగు చేపట్టినట్లు సమాచారం. ఇందుకోసం వక్క మొక్కలను కేరళ నుంచి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. ఆ మొక్కలతో పాటే ఈ ఆఫ్రికా జాతి నత్తలు, వాటి గుడ్లు ఇక్కడికి వచ్చి ఉండవచ్చనే అనుమానాలున్నాయి. నత్తల బెడద తీవ్రం కావడంతో రైతులు వ్యవసాయ శాఖ అధికారులను ఆశ్రయించారు. దాంతో ఉద్యాన యూనివర్శిటీ శాస్త్రవేత్తలు, కేవీకే శాస్త్రవేత్తల బృందం నత్తలు దాడి చేస్తున్న తోటలను పరిశీలించింది. ఇటీవల పార్వతీపురం, మన్యం జిల్లా కొమరాడ మండలం రేగువలస గ్రామంలో బొప్పాయి తోటలపై నత్తలు దాడి చేశాయి.

ఇలా చేస్తే నత్తలను నివారించొచ్చు

నత్త పురుగు జాతికి చెందినది కాదు. అందువల్ల పురుగు మందులు పిచికారి చేసినా ప్రయోజనం ఉండదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కీటక జాతి కావడం వల్ల వీటికి కీటకనాశన మందులు వాడాలని రైతులకు సూచిస్తున్నారు. కాపర్ సల్ఫేట్, ఐరన్ సల్ఫేట్ మిశ్రమాన్ని నీటితో కలిపి చెట్టుపై పిచికారి చేయడం వల్ల మంచి ఫలితాలు వస్తాయని శాస్త్రవేత్తలు తెలిపారు. ఒక లీటరు నీటికి 1.5 గ్రాముల కాపర్ సల్ఫేట్, రెండు గ్రాముల ఐరన్ సల్ఫేట్ పిచికారి చేయడంతో నివారణ సాధ్యమవుతుందని వివరించారు. ఇలా చేయడం వల్ల 30 శాతం నత్తలు తక్షణమే చనిపోతాయని, 70 శాతం నత్తలు రెండురోజుల్లో చనిపోతాయని సూచించారు. ఉప్పుద్రావణం చల్లడం ద్వారా కూడా చనిపోతాయని, అయితే మొక్కలకు ఉప్పుద్రావణ తీవ్రత ఎక్కువగా పడితే మొక్కలు కూడా చనిపోయే ప్రమాదం ఉందన్నారు.

నెలకు వంద గుడ్లు... వేగంగా విస్తరణ

ఆఫ్రికా నత్తల సంతానోత్పత్తి రేటు అధికంగా ఉంటుంది. ప్రస్తుతం గంగురేగువలస, అవపాడులో ఉన్న నత్తల జీవిత కాలం 5 నుంచి ఆరేళ్లు ఉంటుంది. ఇది ద్విలింగ జాతికి చెందినది కావడంతో రెండేళ్ల వయస్సులోనే సంతానోత్పత్తి ప్రారంభిస్తుంది. నెలకు 100 గుడ్లు పెడుతుంది. ఏటా 1000 నుంచి 1200 గుడ్లు పెడుతోంది. జూలై నుంచి ఫిబ్రవరి వరకు సంతానోత్పతికి అనువైన సమయమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నత్తల నివారణ సామూహికంగా చేపటాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఒక్క రైతే నివారణ చర్యలు చేపడితే పక్క తోటలోకి ఇవి వెళ్లిపోతాయని హెచ్చరిస్తున్నారు.



రామగిరి సౌర ప్రాజెక్టుకు రాజస్థాన్ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తున్న ప్రధాని మోదీ



రామగిరిలో శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్, సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఎండీ కమలాకర్

సీమకు 300 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు

శ్రీసత్యసాయి జిల్లా రామగిరిలో ఏర్పాటు

రాజస్థాన్ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ

పుట్టపర్తి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): 300 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మెగా సోలార్ విద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించి తొలి అడుగు ఘనంగా పడింది. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండల కేంద్రం సమీపంలో ఏర్పాటుకానున్న ఈ మెగా ప్రాజెక్టుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురువారం రాజస్థాన్‌లోని బాన్సువాడ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకి-ఎస్ఈసీఐ) 1,047 ఎకరాల విస్తీర్ణంలో 300 మెగావాట్ల సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తోంది. రామగిరి సమీపంలో ఏర్పాటు చేసిన సభా వేదిక వద్ద మెగా సోలార్ ప్రాజెక్టు శిలాఫలకాలను కలెక్టర్ శ్యాంప్రసాద్, సెకి ఎండీ కమలాకర్ బాబు ఆవిష్కరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా వెయ్యి మందికి ప్రత్యక్షంగా, వేలాది మందికి పరోక్షంగా ఉపాధి లభించనుందని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే పునరుత్పాదక ఇంధనంలో ఆంధ్రప్రదేశ్ స్థాయి పెరుగుతుందని అన్నారు. ప్రధాన మంత్రి చేతుల మీదుగా ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగడం జిల్లాకు గర్వకారణమని చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో ముందుండాలని ప్రోత్సాహిస్తున్న సీఎం చంద్రబాబు ఒక విజనరీ లీడర్ అని, ఆయనకు మనందరం తోడ్పాటు అందించాలని అన్నారు. రాష్ట్రం మొత్తం మీద దాదాపు 5 వేల మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని, ఉమ్మడి అనంతపురం జిల్లా వాటా అత్యధికమని చెప్పారు.



జెండా ఊపి తిరుమలకు నెయ్యి లారీని పంపుతున్న సంగం డెయిరీ చైర్మన్ నరేంద్ర కుమార్

టీటీడీ ప్రసాదాలకు సంగం నెయ్యి

- మహత్తర అవకాశం మాకు లభించింది: చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ప్రసాదాలకు సంగం డెయిరీ నెయ్యి సరఫరా చేసే అవకాశం లభించిందని ఆ సంస్థ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. వడ్లమూడి సంగం డెయిరీ ఆవరణలో గురువారం టీటీడీకి సరఫరా చేసే నెయ్యి వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి జెండా ఊపి తిరుమల పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగం డెయిరీ 48 ఏళ్ల ప్రస్థానంలో గొప్ప మైలురాయిని సాధించిందని తెలిపారు. శాస్త్రీయ పద్ధతిలో శుద్ధి చేసిన సంగం నెయ్యిని పంపిణీ చేసే మహత్తర అవకాశం డెయిరీకి లభించిందన్నారు. ఇక నుంచి తిరుమలకు క్రమంతప్పకుండా నెయ్యి సరఫరా చేస్తామని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ ఎండీ పి. గోపాలకృష్ణన్, అధికారులు పాల్గొన్నారు.

కారు అదుపుతప్పి ఇద్దరి మృతి

- ఐదుగురికి గాయాలు.. అతి వేగం, నిద్రమత్తే కారణం
- మృతులు స్విమ్స్ వైద్యుడు, ఆయన కుమార్తె
- తిరుపతి నుంచి గుంటూరు వస్తుండగా తాతపూడి వద్ద ఘటన



మృతులు తంగెళ్ల కేదర వెంకట కిశోర్, అశ్వినందన

చిలకలూరిపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అతివేగం.. నిద్రమత్తు కారణంగా జరిగిన ప్రమాదంలో తండ్రీ కుమార్తె మృతి చెందగా మరో ఐదుగురు గాయపడ్డారు. జాతీయ రహదారిపై చిలకలూరిపేటకు సమీపంలోని తాతపూడి వద్ద గురువారం తెల్లవారుజామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట రూరల్ పోలీసుల కథనం ప్రకారం తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ తంగెళ్ల కేదర వెంకటకిశోర్ (42) కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో తిరుపతి నుంచి స్వస్థలమైన గుంటూరుకు బయలుదేరారు. తెల్లవారుజామున మార్టూరు-చిలకలూరిపేట మధ్య తాతపూడి ఫ్లై ఓవర్ వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. డ్రైవింగ్ చేస్తున్న డాక్టర్ కిశోర్ కారులో నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన కుమార్తె అశ్వినందనను గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. డాక్టర్ కిశోర్ భార్య డాక్టర్ అన్నా సంధ్య యాదవ్, కుమారుడు ఆయుష్ నందన, కిశోర్‌కు వరసకు చెల్లెలు అయ్యే డాక్టర్ రెబ్బగుండ్ల శ్వేత, ఆమె కుమార్తెలు అన్నా అధ్యా, అన్నా మైరా గాయపడ్డారు. వీరు చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం డాక్టర్ కిశోర్, అశ్వినందన మృతదేహాలను బంధువులకు అప్పగించారు. చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేశారు. కాగా.. ప్రమాద విషయం తెలిసిన వెంటనే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. చిలకలూరిపేటలో క్షతగాత్రులు చికిత్స పొందుతున్న ఆస్పత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. ప్రమాదానికి గురైన వారు ఆయన బంధువులని సమాచారం.

ఇంటి వెలుగులు ఆరిపోయాయి

- నీటి కుంటలో పడి కవలలు మృతి



అఖిల్, నిఖిల్ (ఫైల్)

దర్శి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఊహించని ప్రమాదం కవల సోదరులను బలి తీసుకుంది. తల్లికి గర్భశోకాన్ని మిగిల్చింది. ప్రకాశం జిల్లా దర్శి మండలం లంకోజనపల్లి పంచాయతీ లూధగిరి కాలనీకి చెందిన నాగరాజు, ప్రమీల దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. మగ పిల్లలిద్దరూ కవలలు. వివాదాల కారణంగా భార్యభర్తలు కొంతకాలంగా వేరుగా ఉంటున్నారు. ప్రమీల విజయవాడలో కూలీ పనులు చేసుకుంటూ కుమారులు అఖిల్ (11), నిఖిల్ (11), కుమార్తెను చదివించుకుంటోంది. దసరా సెలవులు కావడంతో వారి పిన్ని అఖిల్, నిఖిల్‌ను దర్శి తీసుకొచ్చింది. మనవళ్లను తన వద్ద కొన్ని రోజులు ఉంచుకుంటానని వారి అమ్మమ్మ దర్శి నుంచి వెంకటచలంపల్లి కొండ వద్ద నిర్మించిన జగనన్న కాలనీకి తీసుకెళ్లింది. గురువారం ఉదయం పిల్లలిద్దరూ తమ సమీప బంధువైన చిన్నాతో కలిసి బహిర్భూమికి వెళ్లారు. అక్కడ నీటి కుంటలో దిగి మునిగిపోయారు. చిన్నా వెంటనే వారి అమ్మమ్మకు, చుట్టుపక్కల వారికి చెప్పటంతో హుటాహుటిన అక్కడకు వెళ్లి పిల్లలను బయటకు తీశారు. అప్పటికే స్పృహ కోల్పోయిన అఖిల్, నిఖిల్‌ను దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు పరీక్షించే సమయానికి ఒకరు మృతిచెందారు. మరొకరిని బతికించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం దక్కలేదు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ మీద నాలుగు కఠినమైన కేసులు పెట్టి ఏళ్ళపాటు జైల్లోకి నెడితే లద్దాఖ్ ప్రజా ఉద్యమం నశించిపోతుందని ఈ దేశపాలకులు నిజంగానే నమ్ము తున్నారా? ఆయన అడ్డదారిలో విదేశీ విరాళాలు పోగేస్తున్నాడన్న పేరిట సీబీఐ జరపబోతున్న విచారణతో లద్దాఖ్ ప్రజలు ఆయన పట్ల విశ్వాసాన్ని కోల్పోయి, వెంటనడవడం మానేస్తారా? దేశప్రజలంతా కుట్రదారుగా, దేశద్రోహిగా చూస్తారా? లద్దాఖీలకు ఆయనేమిటో, ఏ విలువలకు, ఆశయాలకు కట్టుబడివున్నాడో తెలుసు. సృజనాత్మక విద్యావేత్త, ఇంజనీర్ కూడా అయిన వాంగ్‌చుక్ జీవితం ఆధారంగా నిర్మితమైన 'త్రీ ఇడియట్స్' చూసిన దేశప్రజలు కూడా ఈ రామన్ మెగసెసే అవార్డు గ్రహీత తన మాతృభూమి పరిరక్షణ కోసం పడు తున్న ఆవేదనను గుర్తించకుండా, సహానుభూతిలేకుండా ఏమీ లేరు.

వాంగ్‌చుక్ రెచ్చగొట్టడం వల్లే మొన్నటి హింస జరిగిందని కేంద్రం అంటోంది. జెన్ జీ తరహా ఉద్యమాలను ఉదహరిస్తూ ఈయన లద్దాఖ్ కుర్రకారుని రెచ్చగొట్టాడని పాలకులు తమకు అనువైన వాదనలు చేస్తున్నారు. కానీ, యువజనం ఇలా రెచ్చిపోయేవరకూ పరిస్థితిని తెచ్చింది ఎవరు? చిన్న రాయికూడా గాలిలోకి లేవకుండా, అత్యంత శాంతియుతంగా వందలాదిమందితో వాంగ్‌చుక్ మైనస్ పదిడిగ్రీల చలిలో పలుమార్లు నిరశనదీక్షలు చేశాడు. ఆయన దీక్షకు కూర్చోవడం ఇది ఐదోసారి. ప్రతీసారీ ప్రాణాలకు తెగించి, దీక్ష కాలాన్ని పెంచుతూ ఢిల్లీ పెద్దల మనసు కరగాలని కోరుకున్నాడు. తమ గొంతు లద్దాఖ్ నుంచి సరిగా వినబడదేమోనని వందలాది కిలోమీటర్లు నడిచి, దేశరాజధానిలో దీర్ఘకాలం దీక్ష చేపట్టి పాలకుల పిలుపుకోసం ఎదురుచూశాడు. అయినా ఫలితం లేకపోయింది. కేంద్ర ప్రభుత్వం తమ ఉద్యమాన్ని ఇంత తేలికగా తీసిపారేయడానికి వాంగ్‌చుక్ అనుసరిస్తున్న శాంతిమార్గం కారణమని లద్దాఖ్ కుర్రకారు భావించేవరకూ పరిస్థితి వచ్చింది. హింసకు ఎవరు కారకులైనా శిక్షించవలసిందే. కానీ, రగులుతున్న లద్దాఖ్ ప్రజలను హింసకు ప్రేరేపించదలిస్తే వాంగ్‌చుక్ ఆ పని ఎంతో సునాయాసంగా ఎప్పుడో చేయగలిగేవాడు.

మండుతున్న మంచు భూమి

ఆయనను జైల్లోకి నెట్టడానికి ఆధారాలే అక్కరలేదు, పాలకుల దగ్గర సవాలక్ష మార్గాలు ఉంటాయి. న్యాయస్థానాలు బెయిల్ ఇవ్వడానికి కూడా జంకుతున్న, జైళ్ళలో మగ్గుతున్న ప్రజాఉద్యమ కారులలో ఈయన కూడా చేరిపోవచ్చు. కానీ, ఈ చర్యలు లద్దాఖ్ ప్రజలను తమకు మరింత దూరం చేస్తాయని తెలిసి కూడా పాలకులు అణచివేత మార్గాన్ని ఎంచుకోవడం విచిత్రం.

చైనా, పాక్ సరిహద్దు, చొరబాట్లు, దేశభద్రతలతో ముడిపడి వున్న కీలక ప్రాంతం కనుక, రాష్ట్ర హోదా ఇవ్వకూడదని కేంద్రం భావించడం సరైనదా కాదా అన్నది వేరే విషయం. ఐదేళ్ళక్రితం వరకూ అది రాష్ట్రమేననీ, ఆ హోదా ఢిల్లీ పాలకులకు ఎన్నడూ ఒక అడ్డంకి కాలేదన్న నిజాన్ని కూడా పక్కనబెడదాం. ఆరేళ్ళ క్రితం జమ్మూకశ్మీర్‌ను శిక్షించడంలో భాగంగా లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతంగా మారినప్పుడు, మిగతా దేశ ప్రజల మాదిరిగా ఇక్కడి వారు కూడా ఏవో అద్భుతాలు జరిగిపోతాయనుకున్నారు. కానీ, ఏడాదిలోనే కలలు కరిగిపోవడం మొదలైంది. వివిధ తెగలకు నిలయమైన ఈ ప్రాంతంలో సాంప్రదాయికంగా ఉన్న హక్కులకు 370 అధికరణ రద్దుతో హామీ లేకుండా పోయింది. ఏడు దశాబ్దాలుగా లేని అభద్రత వారిని వెంటాడుతోంది. పైగా, కళ్ళముందు కశ్మీర్‌లో స్థానికతకు ఏ మాత్రం విలువలేకుండా అన్ని ద్వారాలూ తెరుచుకొని, సర్వమూ పరాయీకరణ జరుగుతున్న వేగం వారిలో కొత్తభయాలు పెంచింది. రాష్ట్ర ప్రతిపత్తిని కాదంటున్నప్పటికీ, ఆరవషెడ్యూల్ రక్షణలు, ఉద్యోగాలను స్థానికులకు రిజర్వుచేస్తూ ఓ ప్రత్యేక పబ్లిక్ సర్వీస్ కమిషన్, రెండు పార్లమెంటరీ సీట్లు ఇత్యాది డిమాండ్లను నెరవేర్చడం కేంద్రానికి కష్టం కాదు. ఆరో షెడ్యూల్‌లో చేర్చడం లద్దాఖ్ తెగల వారసత్వహక్కుల పరిరక్షణకు అవశ్యకమని షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్ కూడా స్పష్టంచేసింది. అలా జరిగినపక్షంలో అస్మదీయులకు భూ సంతర్పణలు, వనరుల అప్పగింత సులభం కాదు కనుక కేంద్రం ఆ ఊసెత్తడం లేదు. లద్దాఖీల ఈ డిమాండ్లన్నీ నెరవేరుస్తానని హామీ ఇస్తూ వచ్చిన బీజేపీ క్రమంగా తమపట్ల కఠినంగా వ్యవహరిస్తూండటంతో స్థానికుల్లో అనుమానాలు పెరిగి పోతున్నాయి. భూమి కార్పొరేట్లకు పోతుందనీ, ఉపాధి బయటవారు తన్నుకుపోతారనీ, కొండలు, లోయలు, పర్యావరణం ధ్వంసనాశన మవుతాయన్న భయాలు హెచ్చుతున్నాయి. లద్దాఖీల ఆవేదనను, ఆరాటాన్ని పట్టించుకోకుండా చైనా, పాకిస్థాన్‌తో సరిహద్దులు పంచుకుంటున్న ఈ ప్రాంతంలో రాజకీయ విన్యాసాలు చేయడం శ్రేయస్కరం కాదు.

ఈ విపత్తులు, విలయాలు మన స్వయంకృతమే!

జడివాన, గాలివాన, తెరిపిలేని వర్షం, తెరిపిచ్చినా ముసురు, వదలని ముసురు, మళ్లీ కుంభవృష్టి, హో... ఇవి సాధారణ వానలా? కావు. 'చిల్లుబడ్డ' ఆకాశం కుమ్మరిస్తున్న విషాదాలు, మనలను చుట్టివేస్తోన్న విపత్తులు. ఈ వర్షాకాలంలో భారత ఉపఖండం ఉత్తరాది ప్రాంతాలలో సంభవించిన వరద బీభత్సం, జీవన విధ్వంసాన్ని వర్ణించేందుకు నా వద్ద మాటలు లేవు. రాష్ట్రాలకు రాష్ట్రాలు వరద తాకిడికి కుదేలయ్యాయి. గృహాలు, పాఠశాలలు, ఆసుపత్రులు కూలిపోయాయి; రోడ్లు, ఇతర ప్రాథమిక సదుపాయాలు ధ్వంసమయ్యాయి. సువిశాల సస్యశ్యామల క్షేత్రాలు నీట మునిగిపోయాయి. పశ్చిమ హిమాలయ ప్రాంతాలలో వరుసగా సంభవించిన మేఘ విస్ఫోటనాలతో భూమి సంద్ర మయింది. కొండలు కూలిపోయాయి. ఆస్తినష్టం సరేసరి. స్వల్ప స్థాయిలోనే అయినప్పటికీ ప్రాణ నష్టం ఎంత బాధాకరం. కొండ అంచున సముద్రం, కష్టాల నావలో మనుగడ. మరోసారి నొక్కి చెప్పు తున్నాను: ఉపఖండ ఉత్తరాది ప్రాంతాలలో వర్షించిన కుంభవృష్టి తీవ్రత సాధారణమైనది కాదు. గత ఆగస్టులో పంజాబ్‌లో 24 రోజుల పాటు భారీ వర్షపాతం, అతి భారీ వర్షపాతం సంభవించింది. 24 గంటలలో 115 మిల్లీమీటర్ల వర్షం కురిస్తే అది భారీ వర్షపాతం అని, 204 మిల్లీమీటర్ల వర్షపాతం కురిస్తే అది అతి భారీ వర్ష పాతమని భారత వాతావరణ విభాగం వర్గీకరించింది. అది కుండపోత కాదు, జలప్రళయమే సుమా!




■ సునీతా నారాయణ్

మట్టివాసన

హిమాలయాలు పరివేష్టితమై ఉన్న హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూ–కశ్మీర్‌లు వర్ష విలయసీమలై పోయాయి. గత మూడు నెలల్లో ఇంచుమించు 80 రోజుల పాటు హిమాచల్‌ప్రదేశ్ కొండ వాలు ప్రాంతా లన్నీ భారీ వర్షాల తాకిడికి గురయ్యాయి. ఈ ఉపద్ర వానికి తోడు మేఘ విస్ఫోటనాల కారణంగా మెరుపు వరదలు! ప్రభుత్వ సమాచారం ప్రకారం 13 మేఘ విస్ఫోటనాలు సంభవించగా, వీటికి అదనంగా మరో పది మేఘ విస్ఫోటనాలు వాటిల్లినట్టు మీడియా వెల్లడించింది. ఈ విధ్వంసం ఎందుకు జరుగుతోంది? వాతావరణ అత్యవసర పరిస్థితి, సందేహం లేదు. అయితే అభివృద్ధి పేరిట మనం చేస్తున్న పనుల ఫలితమే ఈ ప్రళయాలు అన్న వాస్తవాన్ని కూడా విస్మరించకూడదు. ప్రకృతికి వాటిల్లే హానిని లక్ష్యపెట్టకుండా సాధిస్తున్న అభివృద్ధే ఈ విధ్వంసంగా పర్యవ సిస్తోంది అనడం ఎంత మాత్రం సత్య దూరం కానేకాదు.

సరే, వాతావరణం ఎలా మారుతుందో తొలుత అర్థం చేసుకుందాం. వాస్తవమేమిటంటే ఈ వర్షాకాలం దుఃఖ రుతువుగా మారిపోవడానికి ప్రధాన కారణం వాతావరణ వ్యవస్థకు తీవ్ర అంతరాయమేర్పడడమే. ఈ విపరిణామం వాతావరణ మార్పుతో ముడివడివున్నది. భూ తాపం పెరిగిపోతున్న కొద్దీ వర్షపాతం మితిమీరుతోంది. కొన్ని రోజుల పాటు మరీ అత్యధికంగా ఉంటున్నది. ఇదే ఈ వర్షాకాలంలో మనం చూసింది. ఒక వర్షరుతువు అంతా సంభవించే మొత్తం వర్షపాతం కొద్ది గంటలలోనే వాటిల్లింది! ఈ విపరీత వాతావరణ పోకడలకు మరిన్ని కారణాలు ఉన్నాయి. పడమటి తుపానులు (మధ్యధరా సముద్రంలో పుట్టి భారత్, పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, నేపాల్ మొదలైన దేశాలకు శీతాకాలంలో అకస్మాత్తుగా వర్షం, మంచును తీసుకువచ్చే అల్పపీడన తుపానులు) సాధారణ వాతావరణ పరిణామమనే విషయమని మనకు తెలుసు. ఈ వానాకాలం అవి మరింత తీవ్రమయ్యాయి. నైరుతి రుతుపవనాల కాలంలో అప్పుడప్పుడు ఒకటి లేదా రెండుసార్లు మాత్రమే సంభవించే ఈ పడమటి తుపానులు ఈ సెప్టెంబర్ మొదటివారం దాకా 19 పర్యాయాలు సంభవించాయి. ఈ పడమటి తుపానులు రుతుపవనాలతో ఘర్షించడం వల్లే ఉపఖండం ఉత్తరాది ప్రాంతాలలో ప్రళయకారక వర్షపాతం సంభవించింది.



సముద్రాలు వేడెక్కడం, ఆర్కిటిక్ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు పెరగడం, భూమధ్య రేఖ, ఉత్తర ధ్రువ ప్రాంతం మధ్య ఉష్ణోగ్రతలలో తేడా తగ్గిపోవడం మొదలైన కారణాల ఫలితంగా వాయు వ్యవస్థల్లో తీవ్ర అస్తవ్యస్తత నెలకొన్నది. ఈ అస్థిరతే ఇప్పుడు కుండపోత వర్షాలు, పెను వరదలుగా పర్యవసిస్తోంది. చూస్తుంటే ప్రకృతి మనపై పగ తీర్చుకుంటున్నట్టుగా ఉన్నది. ఈ విపత్కర పరిస్థితి ఇప్పుడిప్పుడే సమసిపోదు.

ఆర్కిటిక్ మహాసముద్రం నుంచి వీచే జెట్ ప్రవాహం (ట్రోపో ఆవరణలో 12 కిలోమీటర్ల కంటే ఎత్తులో అతివేగంగా ప్రవహించే పశ్చిమ పవనం. దీని వేగం గంటకు 120 నుంచి 370 కిలోమీటర్ల వరకు ఉంటుంది) అనే పవనాలతో పడమటి తుపానులు అనుసంధానమవడం వల్లే ఈ విలయం సంభవించిందని చెప్పవచ్చు. వాతావరణ మార్పు కారణంగా ఈ ఆర్కిటిక్ వాయు వ్యవస్థ బలహీనపడింది. ఈ పరిణామం ప్రపంచ వాతావరణ వ్యవస్థలకు తీవ్ర అంతరాయం కలిగిస్తోంది.

ఈ ఏడాది అరేబియా సముద్రం నుంచి ప్రభవించే వాయు వ్యవస్థలకు సైతం అంతరాయం ఏర్పడింది. అవి బంగాళాఖాతం నుంచి వచ్చే రుతుపవనాలకు వ్యతిరేకంగా తీవ్ర ఒత్తిడి కలిగించాయి. మొత్తం మీద సముద్రాలు వేడెక్కడం నుంచి ఆర్కిటిక్ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు పెరగడం వరకు, భూమధ్యరేఖ, ఉత్తర ధ్రువ ప్రాంతం మధ్య ఉష్ణోగ్రతలలో తేడా తగ్గిపోవడం దాకా ఎన్నో కారణాల ఫలితంగా వాయు వ్యవస్థల్లో తీవ్ర అస్తవ్యస్తత నెలకొన్నది. ఈ అస్థిరతే ఇప్పుడు కుండపోత వర్షాలు, వరదల రూపంలో మనకు తీవ్ర తాకిడిని కలిగిస్తున్నాయి. చూస్తుంటే ప్రకృతి మనపై పగ తీర్చుకుంటు న్నట్టుగా ఉన్నది. ఈ విపత్కర పరిస్థితి ఇప్పుడిప్పుడే సమసిపోదు. పైగా అది మరింతగా విషమిస్తుంది. ఇది ఖాయం.

మన కష్టాలకు వాతావరణ మార్పును తప్పుపట్టడం వల్ల ప్రయోజనం లేదు. అలాగే కర్మవాద వైఖరి– ప్రకృతి ఇలా వ్యవహరిస్తుంటే మానవులం మనమేం చేయగలం? –అన్న వైఖరిని కూడా విడనాడాలి. ఇది భగవంతుడి పని కానేకాదు. ఇది మనకు మనం కొనితెచ్చుకున్న సంక్షోభం. అది ఇప్పుడు పూర్తిగా మన వాకిట ఉన్నది. ఆర్థికాభివృద్ధికై మన వాతావరణంలోకి మితం లేకుండా మనం విడుదల చేస్తున్న కర్బన ఉద్గారాల ఫలితమే వాతావరణ మార్పు కదా. వ్యక్తుల, దేశాల దురాశ ఇందుకు అపరిమితంగా కారణమవుతోంది. ఎన్ని అని చెప్పను ఈ విషాదాల వృత్తాంతాలు?! 'అయిపోయిందేదో అయిపోయింది. ఇప్పటికైనా మనం మేల్కోవాలి' అని నేను చెప్పినప్పుడు నా మాటల్లోని ఆవేదనను మీరు అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

మన ప్రజాస్వామ్య కురుక్షేత్రం ధర్మక్షేత్రమేనా?

భారతదేశ ఎన్నికలు స్వేచ్ఛాయుతమూ, న్యాయ బద్ధమైనవేనా? పాలక పక్షం పాల్పడుతున్న ఎన్నికల అక్రమాలు ఓటర్ జాబితాలను రూపొందించే దశ నుంచే ప్రారంభమవుతున్నాయని, ఇందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) తోడ్పడుతోందని ఆరోపిస్తూ ఆ రాజ్యాంగ సంస్థకు వ్యతిరేకంగా ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ చేస్తున్న రాజీలేని పోరాటంతో ప్రారంభమైన చర్చ అది. ప్రశస్త సేవలు అందిస్తున్న ఒక ప్రజాస్వామిక సంస్థను అప్రతిష్ఠపాలు చేసేందుకే కాంగ్రెస్ నాయకుడు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మోదీ ప్రభుత్వ మద్దతుదారులు ఆరోపిస్తున్నారు. అధికారంలో ఉన్నవారికి ఇబ్బందికరమైన ప్రశ్నలు సంధించేందుకు సాహసించిన ఏకైక నాయకుడు రాహుల్ అని ఆయన విధేయులు వాదిస్తున్నారు. ఈ వాదప్రతివాదాల రణగొణ ధ్వనిలో మన మౌలిక ప్రశ్న– భారతదేశంలో ఎన్నికలు నిజంగా స్వేచ్ఛాయుతంగా, పక్షపాతరహితంగా జరుగుతున్నాయా? అన్నదానిపై నిష్పాక్షిక సమాధానాన్ని కోల్పోయింది.

ఆ ప్రశ్నకు సమాధానంగా నేను ఒక ప్రతిపాదన చేస్తున్నాను: భారతదేశంలో ఎన్నికలు చాలావరకు స్వేచ్ఛాయుతమే కానీ అవి తప్పకుండా నిష్పాక్షికంగా జరుగుతున్నాయని చెప్పలేము. జవహర్‌లాల్ నెహ్రూ (అవును, ఇప్పుడు విమర్శలు అవహేళనలకు గురవు తున్న ఆదర్శవాది నెహ్రూజీ) స్వాతంత్ర్యానంతరం సమస్త భారత ప్రజలకు వయోజన ఓటు హక్కు లభింపచేయడంలో ప్రముఖపాత్ర వహించారు. సార్వత్రిక వయోజన ఓటు హక్కు కల్పించడం చరిత్ర లోనే అతి పెద్ద జూదం అని రాజ్యాంగ సభలో చాలా మంది కొట్టివేశారు. భారత గణతంత్ర రాజ్యం మరింతగా విచ్ఛిన్నమయ్యేందుకే అది దారి తీస్తుందని కూడా వారు హెచ్చరించారు. 18 సార్వత్రిక ఎన్నికల అనంతరం ఎన్నికల ప్రజాస్వామ్యం పట్ల తన నిబద్ధత 'జూదం' కాదని, భవిష్యత్‌ను సముజ్వలంగా నిర్మించేందుకు ఉద్దేశించిన ప్రజాస్వామిక పెట్టుబడి అని, అది సమున్నత చరిత్రాత్మక లబ్ధిని సమకూర్చిందని గట్టిగా వాదించే సౌలభ్యాన్ని నెహ్రూకు చరిత్ర సమకూర్చింది.

1952లో ప్రప్రథమ సార్వత్రిక ఎన్నికలు ఆరు నెలల పాటు జరిగాయి. వాతావరణ సంబంధమైన, ఏర్పాట్ల పరమైన సవాళ్ల కారణంగా ఆ ఎన్నికల ప్రక్రియ సుదీర్ఘంగా సాగింది. దేశవ్యాప్తంగా 1.96 లక్షల పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. వాటిలో 27,527ను మహిళలకు రిజర్వ్ చేశారు. ఆనాడు దేశంలో 17.32 కోట్ల మంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. వారిలో 45 శాతం మంది తమ ఓటు హక్కు వినియోగించుకు న్నారు. 2024లో 18వ సార్వత్రిక ఎన్నికల నాటికి దేశంలో అర్హులైన ఓటర్లు 96.8 కోట్ల మంది ఉన్నారు. దేశ వ్యాప్తంగా 10.5 లక్షల పోలింగ్ కేంద్రాల నేర్పాటు చేశారు. అర్హులైన ఓటర్లలో 64.6 కోట్ల మంది ఓటర్లు అంటే, 65.9 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

కిరాయి గూండాలు పోలింగ్ బూత్‌లను పూర్తిగా స్వాధీనం చేసుకున్న రోజులు, దేశంలోని కొన్ని ప్రాంతాలలో బోగస్ ఓటింగ్ అనేది ఒక పరిపాటిగా ఉన్న రోజులు కూడా గుర్తు చేసుకుందాం. ఒక పోలింగ్ బూత్‌ను 'స్వాధీనం' చేసుకున్న ఘటనకు నేను ఒక ప్రత్యక్ష సాక్షిని. 1990లో మహారాష్ట్ర విధానసభ ఎన్నికలలో ముంబైలోని ఉమేర్‌ఖాది ప్రాంతంలో ఆ



ఘటన చోటుచేసుకుంది. మతపరమైన భావోద్రేకాలు ప్రబలంగా ఉన్న పరిస్థితుల్లో ఆ ఎన్నికలు జరిగాయి. ముంబైలోని ఒక నియోజకవర్గంలో శివసేన, ముస్లిం లీగ్ అభ్యర్థులు ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్నారు. ఇరుపక్షాలవారు పోలీసులను లెక్కచేయకుండా పోలింగ్ బూత్‌లను స్వాధీనం చేసుకుని బ్యాలెట్ పత్రాలపై తమ అభ్యర్థికి అనుకూలంగా ముద్రలు వేశారు. అప్పటికి ఇంకా ఈవీఎమ్‌లు లేవు. టీవీ చానెల్స్ ముందునాటి రోజులవి.

ఓటర్లు ఇప్పుడు గతంలో కంటే చాలా చైతన్యశీలురుగా ఉన్నారు. తమ ప్రజాస్వామ్య హక్కుల గురించి వారికి మెరుగైన అవగాహన ఉన్నది. గత కాలంలో జాట్ దబాంగ్ (శక్తిమంతులు)లు సృష్టించిన దౌర్జన్య పూరిత పరిస్థితుల కారణంగా తమ తమ అవ్వలు, తాతలు, తల్లిదండ్రులు ఓటు వేయలేకపోయేవారని

> **భారత ఎన్నికల సంఘం తన విధి నిర్వహణలో అధికార పక్షం ఒత్తిళ్లకు లొంగకుండా స్వతంత్రంగా ఉండడమే కాకుండా, తన విధ్యుక్త ధర్మాన్ని చిత్తశుద్ధితో నిర్వహిస్తున్నట్టు కనిపించడం కూడా నిష్పాక్షిక ఎన్నికలకు చాలా ముఖ్యం. తటస్థ మధ్యవర్తిగా ఉండవలసిన రాజ్యాంగ సంస్థ ఇప్పుడు ఒక పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్టుగా కనిపిస్తోంది. ఈసీఐ వైఖరి భారత ప్రజాస్వామ్యానికి మేలుచేయదు.**

హర్యానాలో నా పర్యటనల సందర్భంగా గ్రామీణ దళితులు పలువురు వివరించారు. అణగారిన కులాల వారిలో ప్రజాస్వామిక చైతన్యం బాగా ఉన్న రోజులివి. ప్రస్తుత కాలంలో అందునా 24 గంటల న్యూస్ చానెల్స్ యుగంలో అటువంటి ఘటనలు జరగడం అసంభవమే. అనేక అసమానతలు ప్రబలంగా ఉన్న మన సమాజంలో ఓటింగ్ రోజు ఒక విధంగా అరుదైన పౌర సమానత్వం వర్ధిల్లే శుభదినంగా ఉన్నది. ఆ రోజున జామ్‌నగర్ ఆయిల్ రిఫైనరీ కార్మికుడికి, ముకేశ్ అంబానీకి ఒకే విధమైన ఓటింగ్ హక్కు ఉంటుంది. ముంబైలోని ధారావి మురికివాడ వాసి కూడా గౌతమ్ అదానీలా ఠీవిగా పోలింగ్ బూత్‌లోకి ప్రవేశిస్తాడు.

భారత ఎన్నికలు చాలా వరకు స్వేచ్ఛాయుతమైనవే అయినప్పటికీ అవి తక్కువ నిష్పాక్షికతతో జరుగు తున్నాయి. సమానవకాశాలు కల్పించడం అనేది ఎన్నికల ప్రజాస్వామ్య ప్రాథమిక విశ్వాసం. పోటీ చేసే ప్రతి అభ్యర్థికి విజయావకాశాలు సమానంగా ఉండాలి. అయితే ఇప్పుడు అసమ పోటీలు మాత్రమే జరుగుతున్నాయి. అధికారంలో ఉన్న పార్టీ అభ్యర్థి తన ప్రత్యర్థుల కంటే అనేక ఎక్కువ అనుకూలతలు కలిగి ఉంటున్నాడు. అపార ధన బలం, సదా అందుబాటులో ఉండే ప్రభుత్వ వ్యవస్థల కారణంగా అధికార పార్టీ అభ్యర్థికి అనేక అనుకూలతలు సమకూరుతున్నాయి. ధన బలం అనేది మొదటి నుంచీ ఉన్నది. కాంగ్రెస్ ఆధిపత్య పార్టీగా ఉన్న కాలంలో ఆ పార్టీకి అపార ఆర్థిక వనరులు అందుబాటులో ఉండేవి. కాంగ్రెస్ ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులకు అటువంటి అవకాశాలు ఉండేవి కావు. ధనబలమే గెలుపోటములలో నిర్ణయాత్మకశక్తి కానప్పటికీ డబ్బు అపరిమితంగా ఉన్న పార్టీలకు చెప్పుకోదగ్గ విజయావకాశాలు పుష్కలంగా ఉంటాయి.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

వ్యాపార, పారిశ్రామిక వర్గాల నుంచి ఆర్థిక వనరులు ఏదో ఒక విధంగా అన్ని పార్టీలకు లభిస్తాయి. అయితే ప్రభుత్వ వ్యవస్థలను ఎలా 'ఆయుధీకరణ' చేస్తున్నారన్నదే గెలుపోటములను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తుందని చెప్పవచ్చు. ప్రభుత్వ ఏజెన్సీలను నిస్సిగ్గుగా దుర్వినియోగపరిచి అధికారపక్షం అభ్యర్థులు పోటీలో ముందుండేలా చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు అయిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, స్థానిక పోలీసుల సహకారంతో రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ప్రభుత్వ నిధులు పూర్తిగా అందుబాటులో ఉండటం అధికారంలో ఉన్నవారికి ఒక ప్రధాన అనుకూలత. ఎన్నికలు జరిగిన ప్రతిసారీ అధికార పార్టీ పన్ను చెల్లింపుదారుల సొమ్మును సంక్షేమ ప్రయోజనాల పేరిట సంభావ్య అనుకూల ఓటర్లకు పంపిణీ చేస్తోంది. కొన్ని సంవత్సరాల క్రితం 'రేవడి' (ఉచితాలు) రాజకీయాలపై చర్చ జరగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. చిత్రమేమిటంటే 'ఓట్లకు నోట్లు' ఆటలో ఇప్పుడు బీజేపీయే అగ్రగామిగా ఉన్నది. మహారాష్ట్రలో 'లడ్కీ బహిన్' పథకం లేదా బిహార్‌లో ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన కింద మహిళలకు పదివేల రూపాయలు ఇవ్వడం మొదలైనవి అందుకు నిదర్శనాలు. మీడియా కథనాలను ప్రభావితం చేసేందుకు, నియంత్రించేందుకు ప్రభుత్వాధికారాలను ఉపయోగిస్తున్నారు. ఎన్నికలకు ముందు ప్రచార పర్వంలో భాగంగా వాణిజ్య ప్రకటనలతో మీడియా సంస్థలకు విశేష ఆర్థిక లబ్ధి సమకూరుస్తున్నారు. దీని వల్ల ప్రతిపక్షాలకు మీడియాలో న్యాయంగా లభించవలసిన ప్రాధాన్యం లభించడం లేదు.

భారత ఎన్నికల సంఘం విషయానికి వద్దాం. ఎన్నికల సమయంలో అపరిమిత అధికారాలు చెలాయించగల ఈ రాజ్యాంగ సంస్థ అన్ని పార్టీలకు సమానవకాశాలు లభించక పోవడంపై దృష్టి పెట్టేందుకు నిరాకరిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆదాయపు పన్ను శాఖ కాంగ్రెస్ పార్టీకి 1990ల నాటి వ్యవహారాలకు సంబంధించి నోటీసులు జారీ చేసింది. ఆ పార్టీ బ్యాంకు ఖాతాలు స్తంభింపచేసింది. ఈసీఐ మౌనంగా ఉండిపోయింది. ఎన్నికల ప్రచారంలో మతపరమైన భావోద్రేకాలు రెచ్చగొట్టే ప్రకటనలు చేసినవారిపై చర్యలు చేపట్టలేదు. పెయిడ్ న్యూస్ అనే దురాచారం బాగా ప్రబలిపోయింది. ఇక ఇప్పుడు ఓటర్ జాబితాలలో మార్పులు, చేర్పుల్లో అవకతవకల గురించి వార్తలు ముమ్మరంగా వెలువడుతున్నాయి. వీటికి ప్రతిస్పందనగా ఈసీఐ ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టింది. తొలుత ఈ కార్యక్రమాన్ని అమలుపరుస్తున్న బిహార్‌లోనే దానిపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కర్ణాటకలో ఓటర్ జాబితాలలో మోసాలపై ఎఫ్ఐఆర్ దాఖలయినప్పటికీ పోలీసు దర్యాప్తునకు సహకరించేందుకు ఈసీఐ నిరాకరిస్తోంది. ఎన్నికల సంఘం అధికారపక్షం ఒత్తిళ్లకు లొంగకుండా సక్రమంగా వ్యవహరించడమే కాకుండా, తన విధ్యుక్త ధర్మాన్ని చిత్తశుద్ధితో నిర్వహిస్తున్నట్టు కనిపించడం కూడా నిష్పాక్షిక ఎన్నికలకు చాలా ముఖ్యం. తటస్థ మధ్యవర్తిగా ఉండవలసిన రాజ్యాంగ సంస్థ ఇప్పుడు ఒక పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్టుగా కనిపిస్తోంది. ఈసీఐ వైఖరి భారత ప్రజాస్వామ్యానికి మేలు చేయదు.

తాజా కలం: భారతదేశ ప్రప్రథమ ఎన్నికల కమిషనర్ సుకుమార్ సేన్ జీవితకథ ఆధారంగా ఒక బయోపిక్‌ను నిర్మించేందుకు నెట్‌ఫ్లిక్స్ సంకల్పించింది. గణితశాస్త్రవేత్తగా శిక్షణ పొంది, ఐసీఎస్ అధికారి అయిన విద్వజ్జుడు సుకుమార్ సేన్. ఆధునిక భారత ప్రజాస్వామ్య నిర్మాతగా ఆయన వారసత్వం సమున్నతమైనది. నెట్‌ఫ్లిక్స్ రూపొందించే ఆయన బయోపిక్ విడుదల అయినప్పుడు ఎన్నికల సంఘం ప్రధానాధికారి, ఆయన సహచర ఎన్నికల కమిషనర్లు, ఈసీఐ ఇతర ఉన్నతాధికారులు తప్పక చూస్తారని, చూడాలని ఆశిస్తున్నాను. సుకుమార్ సేన్ నుంచి వారు స్ఫూర్తి పొందాలి. మానవ దేహంలోని ఒక కీలక భాగం– వెన్నెముక–ను ఈసీఐ పునః పొందవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

ప్రాణాంతకంగా మారుతున్న 'డీజే'లు

సుమధుర సంగీతానికి రాళ్లయినా కరుగుతాయి, రోగాలు కూడా నయమవుతాయి అని నానుడి. కానీ ఇప్పుడొస్తున్న డీజే సంగీతం ప్రాణాంతకంగా ఉంటోంది. వేలంవెర్రిగా నేడు అన్ని ఫంక్షన్లలో ఇదే రొద. ఇండోర్, అవుట్‌డోర్ ఈవెంట్లలోనూ ఆ రణగొణ ధ్వనులకే ప్రాధాన్యం. పెళ్లిళ్లు, ఉత్సవాలు, ఫంక్షన్లలో మోగుతున్న డీజే సౌండ్లకు గుండెలు ఆగిపోతున్నాయి. ఓ పక్క పోలీసులు హెచ్చరికలు చేస్తున్నా, మరోవైపు నిండు ప్రాణాలు నేల రాలుతున్నా, సరదా మూకలు ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఒకప్పుడు ఫంక్షన్లలో ఎక్కువగా సంప్రదాయ సంగీతం లేదా, బ్యాండ్‌మేళం లేదా, ఆర్కెస్ట్రా వంటివి ఉండేవి. వీటిలో గాయకులు సినిమా పాటలు పాడుతూ అందరినీ ఆహ్లాదపరిచేవారు. ఇప్పుడవేవీ లేవు. రోడ్లపై పెద్ద పెద్ద శబ్దాలతో ఊరే గింపులు నిర్వహిస్తున్నారు. రద్దీగా ఉండే జనావాసాల మధ్య అదే పనిగా ఏర్పాటు చేస్తున్న డీజే శబ్దాలను ఇష్ట మున్నా లేకున్నా అక్కడివారంతా భరించాల్సి వస్తోంది. ప్రాణాంతకమైన ఈ భీకరశబ్దాలపై నిషేధపు ఉత్తర్వు లను ఇటు నిర్వాహకులు గానీ అటు నియంత్రించాల్సిన వారు గానీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దసరా ఉత్సవాల్లోనైనా డీజేలు పెట్టకుండా కట్టుదిట్టమైన చర్యలకు పోలీసులు ఉపక్రమించాలి. ఈ డీజేలకు మరి కొంతమంది బలి కాకుండా చూడాలి.

– డొంకాడ గోపాల్

రాజధానిపై వైసీపీ సన్నాయి నొక్కులు!

ప్రజా రాజధాని అమరావతి విషయంలో వైసీపీ నేతలు సందిగ్ధం నుంచి బయట పడలేదనిపిస్తోంది. ఒకవైపు మూడు రాజధానులపై తాము ఇంకా చర్చించ లేదంటూనే, కావాలంటే విజయవాడ–గుంటూరు మధ్య సింగిల్ రాజధాని నిర్మిస్తే సరిపోతుందని సన్నాయి నొక్కులు నొక్కడం అందుకు ఉదాహరణ.

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ముక్కు, చెవులు, కళ్లుగా చెప్పుకొనే సజ్జల రామకృష్ణారెడ్డిని ఇటీవల జరిగిన ఒక కంక్లేవ్‌లో మూడు రాజధానుల గురించి ప్రశ్నించారు. దానికి ఆయన నేరుగా సమాధానం చెప్పకుండా తాము అధికారంలో ఉండగా పరిపాలన అమరావతి నుంచే కొనసాగిందని, జగన్మోహన్‌రెడ్డి కూడా అమరావతి ప్రాంతం నుంచే కార్యకలాపాలు నిర్వహించారని, ఇకపై కూడా అక్కడే ఉంటారని చెప్పారు. అంతేకాకుండా తాము అధికారంలో ఉండివుంటే అమరావతి రైతులకు మరింత మేలు చేసేవారమని తాలింపు మాటలు కూడా మాట్లాడారు (అమరావతికి భూములిచ్చిన రైతులకు కౌలు డబ్బులు ఇవ్వకపోగా, రాజధానిని అమరావతిలోనే కొనసాగించాలంటూ ఉద్యమం నిర్వహించిన మహిళలు, రైతులను గత పాలకులు ఎన్ని ఇబ్బందులు పెట్టారో ప్రజలు ఇంకా మరచిపోలేదు). అధికార వికేంద్రీకరణ నేపథ్యంలో మాత్రమే జగన్మోహన్‌రెడ్డి విశాఖ పట్నం, కర్నూలు అంశాన్ని ముందుకు తెచ్చినట్టు సజ్జల చెప్పారు. కానీ నేడు జగన్మోహన్‌రెడ్డి, ఆయన పార్టీ మూడు రాజధానులకు కట్టుబడి ఉన్నదా? లేక ప్రజా రాజధాని అమరావతికి ఆమోదం తెలుపుతున్నారా? అనే అంశాన్ని మాత్రం స్పష్టం చేయలేదు. అయితే జగన్మోహన్‌రెడ్డి కూడా అమరావతి ప్రాంతం నుంచే కార్యకలాపాలు నిర్వహించారని, ఇకపై కూడా అక్కడే ఉంటారంటూ చెప్పిన మాటలకు సోషల్ మీడియాలో... వైసీపీ మూడు రాజధానుల నుంచి తప్పుకొన్నట్టు, ప్రజా రాజధాని అమరావతికి మద్దతు ప్రకటించినట్టు ప్రచారం జరిగింది.

ఈ కథనాలకు వివరణ ఇవ్వడం కోసం సజ్జల ప్రత్యేకంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. అయితే ఆయన మళ్లీ గతంలో చెప్పిన విషయాలనే తిప్పి చెప్పారే కానీ, తాము మూడు రాజధానులకు కట్టుబడి ఉన్నామని స్పష్టంగా ప్రకటించలేదు. ఇది చాలదన్నట్టుగా అంబటి రాంబాబు మాట్లాడుతూ, రాజధాని అమరావతి ఎక్కడ ఉంది? అంటూనే చంద్రబాబు సింగిల్ రాజధాని కావాలనుకొంటే విజయవాడ – గుంటూరు మధ్య 500 ఎకరాల్లో నిర్మిస్తే సరిపో తుందని తమ నాయకుడు జగన్ చెప్పారని ప్రకటించారు. ఇదే సమయంలో తమ పార్టీలో మూడు రాజధానులపై ఇంకా చర్చ జరగలేదని కూడా చెప్పారు. అంబటి కూడా మూడు రాజధానులకు పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేయకపోగా, తమ నాయకుడు విజయవాడ–గుంటూరు మధ్య ఏక రాజధాని ఏర్పాటుకు అంగీకరించారని పరోక్షంగా చెప్పారు. వీరి మాటలను బట్టి ఆ పార్టీ ఏక రాజధానికి అంగీకారానికి వచ్చినా, అమరావతి అనే పేరు ఉచ్చరిస్తే ప్రజలకు చంద్రబాబు నాయుడు గుర్తుకు వస్తాడనే దుగ్ధతో కొత్తగా విజయవాడ–గుంటూరు మధ్య రాజధాని అని ప్రతిపాదిస్తున్నట్టు కనిపిస్తోంది.

> **రాజధాని విషయంలో వైసీపీ నేతలలో సందిగ్ధం కొనసాగడం ఆశ్చర్యం కలిగిస్తోంది. గతంలో జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలో అమరావతిని రాజధానిగా సమర్థించిన నోటితోనే... ఇప్పుడు విజయవాడ–గుంటూరుల మధ్య 500 ఎకరాల్లో రాజధాని నిర్మిస్తే చాలునని వ్యాఖ్యానించడం 'నరం లేని నాలుక ఏమైనా మాట్లాడుతుంది' అనే నానుడికి నిదర్శనం.**



జగన్మోహన్‌రెడ్డి పాలనా కాలంలో 'అమరావతి ప్రాంత రైతులు, మహిళలు రాజధాని అమరావతి కోసం చేసిన ఉద్యమాలు, పాలనా రాజధాని విశాఖపట్నం' అంటూ వైసీపీ నేతల ప్రకటనలతోనే కాలం గడిచింది. ఈ నేపథ్యంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన వాగ్దానాల సంగతి ఎలా ఉన్నా, 2024లో మూడు రాజధానులు ప్రధాన అంశంగా ఎన్నికలు జరిగాయి. దీనిపై ప్రజలు స్పష్టమైన తీర్పు చెప్పారు. జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన పాలనా రాజధాని విశాఖపట్నంతో సహా మూడు రాజధానులలో పార్టీ ఘోర పరాజయం పాలైంది. దీనిని బట్టి ప్రజలు మూడు రాజధానులను తిరస్కరించారని ఎంతటి అమాయకులకైనా అర్థమవుతుంది. అయినా రాజధాని విషయంలో వైసీపీ నేతలలో సందిగ్ధం కొనసాగడం ఆశ్చర్యం కలిగిస్తోంది. గతంలో జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలో అమరావతిని రాజధానిగా సమర్థించిన నోటితోనే... ఇప్పుడు విజయవాడ –గుంటూరుల మధ్య 500 ఎకరాల్లో రాజధాని నిర్మిస్తే చాలునని వ్యాఖ్యానించడం 'నరం లేని నాలుక ఏమైనా మాట్లాడుతుంది' అనే నానుడికి నిదర్శనం.

ఇదే సమయంలో వైసీపీ నేతలు నిన్న మొన్నటి వరకు 'సూపర్ సిక్స్'ను ప్రచార కవచంగా వాడుకున్నారు. చివరకు సూపర్‌సిక్స్ సూపర్ హిట్ కావడంతో దిక్కుతోచక మెడికల్ కాలేజీలను పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్‌షిప్ (పిపిపి) విషయాన్ని ముందుకు తీసుకువస్తున్నారు. గతంలో ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి ప్రతిపాదించిన 17 మెడికల్ కాలేజీల నిర్మాణం కనీసం 10 శాతం కూడా పూర్తికాలేదని, ఒక్కొక్క కాలేజీకి వందల కోట్ల రూపాయలు కావలసి వుందన్న విషయం ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలకు మాత్రమే తెలుసు. రాష్ట్రంలోని మిగిలిన ప్రజలు ఏమిచెప్పినా నమ్ముతారనే ధోరణిలో వేల కోట్ల రూపాయల మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తున్నట్టు వైసీపీ నేతలు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారు. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్‌షిప్‌లో పబ్లిక్ అంటే ప్రభుత్వమని అర్థం. అందువల్ల మెడికల్ కాలేజీల నిర్వహణలో ప్రభుత్వ భాగస్వామ్యం కూడా ఉంటుంది. మెడికల్ కాలేజీలను పిపిపి తరహాలో నిర్మించడంపై అభ్యంతరం వ్యక్తం చేయడం, తగిన సూచనలు చేయడంలో తప్పులేదు, కానీ ప్రభుత్వంలోని నాయకులను 'బావుల్లో పడి చావండి' వంటి మాటలను ఉపయోగించడం జగన్‌లో పేరుకుపోయిన ఉక్రోషాన్ని తెలియజేస్తోంది.

■ అన్నవరపు బ్రహ్మయ్య
సీనియర్ పాత్రికేయులు





ఘాట్‌రోడ్డు మీదుగా ముందుకు సాగుతున్న నగరోత్సవం

శివాత్రినయనీ కాత్యాయనీ..

ఇంద్రకీలాద్రికి పోటెత్తుతున్న భక్తజనం

- 2016 తర్వాత కాత్యాయనిగా దుర్గమ్మ దర్శనం
- తెల్లవారుజాము నుంచే బారులు తీరిన భక్తులు
- దర్శనానికి 2 గంటల సమయం

ఉదయమంతా ఉత్సవ వైభోగం.. సాయంకాలం సాంస్కృతిక వైభవంతో ఇంద్రకీలాద్రి ముమ్మారు ముచ్చటపడి మురిసిపోతోంది. ఉభయదాతల కుంకుమార్చనలు.. ఆడపడుచుల వాయినాలు.. సువాసినీ పూజలు.. జల్లుస్నానాలు.. తలనీలాలు.. అన్నప్రసాదాలతో తెలుగునాట ఆధ్యాత్మిక వాతావరణమంతా బెజవాడలోనే విరబూసిందా.. అన్నట్టుగా దసరా శరన్నవరాత్రి సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. తొమ్మిదేళ్ల తర్వాత కాత్యాయనిగా కొలువైన అమ్మ దివ్యమంగళ స్వరూపాన్ని తిలకించేందుకు గురువారం భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకోగా, సాయంసంధ్యవేళ నగరోత్సవంతో ఇంద్రకీలాద్రి అపర కైలాసగిరిని తలపించింది.

విజయవాడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రికి భక్తుల తాకిడి పెరుగుతోంది. 2016 తర్వాత ఈ దసరా ఉత్సవాల్లో గురువారం కాత్యాయనీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మను చూసేందుకు తెల్లవారుజామున 4 గంటల నుంచి భక్తులు బారులు తీరారు. రథం సెంటర్ నుంచి ప్రధానాలయం వరకు క్యూలైన్లు కిటకిటలాడుతూ కనిపించాయి. దర్శనానికి సుమారు 2 గంటల సమయం పట్టింది. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు 62,669 మంది అమ్మవారిని దర్శించుకున్నారు. 14,730 మంది అన్నప్రసాదం స్వీకరించారు. దర్శనానికి ఎంత సమయం పడుతుందన్న విషయాన్ని తెలుసుకోవడానికి కలెక్టర్ లక్ష్మీశ క్యూలైన్‌లో నడుచుకుంటూ ప్రధానాలయానికి చేరుకున్నారు. భక్తుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. కాగా, శుక్రవారం మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చే దుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులు భారీగా వస్తారని అంచనా వేశారు. రద్దీకి తగ్గట్టుగా ఏర్పాట్లు చేశారు. శ్రీదుర్గామల్లేశ్వరుల తెప్పోత్సవానికి దుర్గాఘాట్‌లో హంస వాహనాన్ని సిద్ధం చేస్తున్నారు.



కాత్యాయనీదేవిగా దుర్గమ్మ ఉత్సవమూర్తి



దుర్గాఘాట్‌లో సిద్ధమవుతున్న హంసవాహనం



క్యూలైన్లలో భక్తుల రద్దీ






దుర్గాఘాట్‌లో కృష్ణమ్మకు నవహారతులు





కేరళ డ్రమ్స్‌లో కళాకారుడి విన్యాసం



వీఐపీ.. తలనొప్పి

వీవీఐపీ, వీఐపీ గేటు వద్ద గందరగోళం

- ఎవరికివారే వీఐపీలమంటూ తోపులాట
- తలలు పట్టుకుంటున్న పోలీసులు
- భారీగా పెరిగిపోతున్న క్యూలైన్
- ఓ ఉత్సవ కమిటీ సభ్యుడి హడావిడి
- తమ వారిని లైన్‌లోకి పంపలేదంటూ ఫైర్
- గేటుకు అడ్డుగా నిలబడి వార్నింగ్



వీఐపీలమంటూ భారీగా వచ్చిన భక్తులు

విజయవాడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై వీఐపీల గందరగోళం మళ్లీ మొదలైంది. ఉత్సవాల్లో మొదటిరోజే సామాన్య భక్తుల కంటే వీఐపీల రద్దీనే ఎక్కువగా కనిపించింది. ప్రొటోకాల్, వీవీఐపీ, వీఐపీలను అనుమతించడానికి కొండపైన గతంలో ఉన్న గోశాల దగ్గరలో గేటు ఏర్పాటుచేశారు. కానీ, వీఐపీలమని చెప్పుకొని వెళ్తున్న భక్తులను కట్టడి చేయడంలో సిబ్బంది విఫలమవుతున్నారు. వీవీఐపీలను పంపించే గేటు పక్కనే వీఐపీలకు మరో గేటు పెట్టి క్యూ ఏర్పాటుచేసినా ఫలితం లేదు. వీవీఐపీలకు కేటాయించిన దారి నుంచే వారు కూడా లోపలికి వెళ్తున్నారు. ఎవరు వీఐపీలో, ఎవరు సామాన్య భక్తులో తెలుసుకోలేక పోలీసులు సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. వీఐపీ పాసులు లేకుండా వస్తున్నారని తెలిసినా కొంతమంది సిబ్బంది, అధికారులు, పోలీసులు తమకేమీ పట్టనట్టు చోద్యం చూస్తున్నారు.

పర్యవేక్షణాలోపం

వీవీఐలు, వీఐపీలకు పాసులు కేటాయించారు. వీఐపీ పాసులు ఉండి, వాహనాలకు అనుమతి లేని వారికోసం మోడల్ గెస్ట్‌హౌస్‌కు ఎదురుగా వాహనాలు ఏర్పాటుచేశారు. ఇదంతా బాగానే ఉన్నా.. కొండపైన ఈ పాసులను తనిఖీ చేసే పరిస్థితి లేదు. వీఐపీల పేరుతో ఎవరు, ఎటువైపు నుంచి గుడి వెనుక భాగంలోని మిగతా 6లో..



చక్కనితల్లికి చాంగుభళా

విజయవాడ ఉత్సవ్‌లో వైభవంగా సాంస్కృతిక ప్రదర్శనలు

- పవిత్ర సంగమంలో 300 మంది కళాకారుల బృందనాట్యం
- సంగీత కళాశాల, తుమ్మలపల్లిలో అలరించిన నాట్యాంశాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ/విజయవాడ కల్చరల్) : ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు కనులపండువగా జరుగుతుండగా, కొండ కింద సాంస్కృతిక మహోత్సవాలు భక్తులకు కనువిందు చేస్తున్నాయి. విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా కొండపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో, ఇటలీ తెలుగు అసోసియేషన్, జయహో భారతీయం ఆధ్వర్యంలో పవిత్ర సంగమం వేదికగా గురువారం 'నృత్య సంగమం' ఆవిష్కృతమైంది. 'అయిగిరినందిని నందితమోదిని విశ్వవినోదిని నందినుతే..' కీర్తనకు 300 మంది కూచిపూడి కళాకారిణులు, విద్యార్థినులు నర్తించారు. నవదుర్గల స్వరూపాల్లో తొమ్మిది మంది కళాకారిణులు ఆయుధాలతో 'జయజయహే మహిషాసురమర్దిని' అంటూ సభా మధ్యలోకి ప్రవేశించి అందరినీ ఆధ్యాత్మిక ప్రపంచంలోకి తీసుకెళ్లారు. కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తనలు.. కళాకారులను మిగతా 6లో..



పవిత్ర సంగమంలో జరిగిన బృందనాట్యంలో కళాకారుల అభినయం

ఘంటసాల సంగీత కళాశాలలో..

సత్యనారాయణపురంలోని ఘంటసాల సంగీత కళాశాల గురువారం జరిగిన కార్యక్రమాల్లో చింతా రవిబాలకృష్ణ బృందం ప్రదర్శించిన మహిషాసురమర్దిని రూపకం, మోహినీ భస్మాసుర యక్షగానం ఆసక్తిగా సాగాయి. రామాయణ ఇతివృత్తాన్ని తీసుకుని కాకినాడకు చెందిన అనపర్తి లోవరాజు 30 నిమిషాల పాటు తోలుబొమ్మలాట ప్రదర్శించారు. రామాంజనేయ యుద్ధం పౌరాణిక పద్యనాటకాన్ని రక్తికట్టించారు. ప్రవీణ్ గాత్ర కచేరీ, ఓం సాయిలక్ష్మి, తమ్మిన సాహిత్యప్రియ సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకున్నాయి. సంపత్‌నగర్‌కు చెందిన శ్రీబాలసరస్వతి నాట్యమండలి రాజమహేంద్రవరం వారి 'శ్రీరామాంజనేయ యుద్ధం' నాటక ప్రదర్శన కనులపండువగా సాగింది.

సరికొత్తగా గాంధీహిల్

ఇక గాంధీ ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్

- రీ డెవలప్‌మెంట్‌కు ప్రత్యేక ప్రణాళిక
- అక్టోబరు 2న చంద్రబాబు రాక.. శరవేగంగా ఏర్పాట్లు




గాంధీ స్థూపం వద్ద హంగులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గాంధీహిల్ అభివృద్ధిలో భాగంగా 'గాంధీ ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్' ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. సొసైటీకి నూతన చైర్మన్‌గా వచ్చిన ఖాజాగాంధీ ఈ మెగా ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. గాంధీయిజాన్ని ప్రజలకు తెలియజేసేందుకు, పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు వీలుగా ఈ నూతన ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టుకు అక్టోబరు 2 గాంధీ జయంతి సందర్భంగా అడుగులు మిగతా 6లో..



సిద్ధమవుతున్న బుల్లి రైలు



గుహకు రంగులు

పున్నమి ఘాట్‌లో ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న అయ్యన్న పాత్రుడు, రఘురామ కృష్ణంరాజు, కేశినేని చిన్ని, నెట్టెం రఘురాం తదితరులు



నాన్‌స్టాప్ జోష్

ఉత్సవ్ మస్తీ

- విజయవాడ ఉత్సవ్‌లో ప్రముఖుల మనోగతం
- కార్యక్రమాల్లో పాల్గొన్న శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు 8
- ప్రతి పండుగకు సాంస్కృతిక ప్రదర్శనలు: బొండా ఉమా
- ఉత్తమ ప్రదర్శనలకు సినిమా చాన్స్ : నిర్మాత అనిల్ సుంకర

స్వల్పంగా తగ్గిన వరద

ప్రకాశం బ్యారేజీకి 3 లక్షల క్యూసెక్కులు రాక

విజయవాడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం బ్యారేజీకి వరద స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. ఎగువ నుంచి 3,25,735 క్యూసెక్కుల నీరు వస్తోంది. బ్యారేజీ 69 గేట్లను ఎనిమిది అడుగల మేర ఎత్తి 3,10,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల నుంచి 2,96,646, పాలేరు నుంచి 58,027, కీసర నుంచి 22,602 క్యూసెక్కుల నీరు వస్తోంది. కాగా, ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు భారీగా నీటిని విడుదల చేస్తుండటంతో నాగాయలంక శ్రీరామపాదక్షేత్రంలోని పుష్కరఘాట్‌కు నీరు పోటెత్తింది. ఘాట్‌లోని కృష్ణవేణమ్మ విగ్రహం, శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలోకి నీరు ప్రవేశించింది.

దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు 2025





ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ భక్తులకు గురువారం కాత్యాయనీ దేవిగా దర్శనమిచ్చారు. ఈ ఏడాది ఉత్సవాల్లో ఇది కొత్త అలంకారం. అమ్మవారిని కాత్యాయనీదేవి అలంకారంలో దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

మూడోరోజు రూ.32.92 లక్షలు

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో దసరా మహోత్సవాలలో మూడోరోజు బుధవారం దేవస్థానానికి వివిధ రూపాల్లో మొత్తం రూ.32,92,628లు ఆదాయం సమకూరినట్టు ఈవో వీకే శీనానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.300లు టిక్కెట్‌ల ద్వారా రూ.7,82,700లు, రూ.100ల ద్వారా రూ.3,41,800లు, లడ్డూ ప్రసాదం (ఒక్కొక్క లడ్డూ రూ.15లు) ద్వారా రూ.3,81,185లు, రూ.100ల లడ్డూ ద్వారా రూ.15,35,700లు లభించినట్టు పేర్కొన్నారు. పరోక్ష ప్రత్యేక కుంకుమార్చనల (టిక్కెట్టు రూ.3వేలు) టిక్కెట్టుల ద్వారా రూ.66వేలు, పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన (టిక్కెట్టు రూ.5వేలు) టిక్కెట్‌ల ద్వారా రూ.20 వేలు, ప్రత్యేక ఖడ్గమాలార్చన (టిక్కెట్ రూ.5,116లు) టిక్కెట్ల ద్వారా రూ.66,508లు పుస్తకాలు, ఫోటోలు, క్యాలెండర్ల ద్వారా రూ.9,615లు, తలనీలాల సమర్పణ టిక్కెట్ల ద్వారా రూ.84,120లు మొత్తం కలిపి రూ.32,92,628లు లభించినట్టు ఈవో వివరించారు. కాగా, గత ఏడాది దసరాలో మూడోరోజు వివిధ రూపాల్లో రూ.54,25,407లు ఆదాయం లభించగా, ఈ ఏడాది రూ.500లు టిక్కెట్ రద్దుతో పాటు వీఐపీలు, వీవీఐపీలకు ఉచిత దర్శనాలు కావటంతో గణనీయంగా గత ఏడాది కంటే ఈ ఏడాది మూడవ రోజు ఆదాయం భారీగా తగ్గింది.

దుర్గమ్మకు శ్రీశైలం, అన్నవరం నుంచి పట్టు వస్త్రాలు



కాత్యాయనీదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న శ్రీశైలం, అన్నవరం దేవస్థానాల ఈవోలు

ఇంద్రకీలాద్రి : దసరా నవరాత్రుల్లో నాల్గవ రోజు గురువారం కాత్యాయనీదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారికి శ్రీశైలం, అన్నవరం దేవస్థానాల నుంచి పట్టువస్త్రాలు సమర్పించారు. శ్రీశైలం శ్రీభమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థాన ఈవో శ్రీనివాస్ వేదపండితులతో కలిసి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అన్నవరం దేవస్థానం తరపున ఈవో వి.సుబ్బారావు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వారికి దుర్గగుడి ఈవో శీనానాయక్ అమ్మవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.





భవానీ ఘాట్‌లో శ్రమదానం చేస్తున్న వీఎంసీ అధికారులు, ఉద్యోగులు

భవానీఘాట్‌లో స్వచ్ఛతా హి సేవ..

వన్‌టౌన్ : నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు గురువారం భవానీఘాట్‌లో స్వచ్ఛోత్సవ-స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డి.చంద్రశేఖర్ నిర్వహించారు. భారత ప్రధాని మోదీ పిలుపు మేరకు విజయవాడలో నగర పౌరులు అధికారులు సిబ్బంది సుమారు 200 మంది భవానీఘాట్‌లో స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్నారు. చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ బాబుశ్రీనివాసన్, టెలిఫోన్ ఎక్స్చేంజ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, కేబీఎన్ కాలేజీ ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

స్త్రీ శక్తి పథకం ఎఫెక్ట్.. పెరిగిన మహిళా భక్తులు

సత్యనారాయణపురం : ఈసారి దసరా ఉత్సవాలలో స్త్రీ శక్తి పథకం ఎఫెక్ట్ కనిపించింది. మహిళా భక్తులు పెరగడంతో, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో జిల్లా అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు. భక్తులకు మంచినీరు, పాలు వైద్య సహాయం, లడ్డూ విక్రయ కేంద్రాలు, అన్నప్రసాద స్వీకరణ కేంద్రలను పరిశీలించి సంబంధిత అధికారులను ఆదేశిస్తున్నారు.

ఘాట్ల వద్ద నిరంతర నిఘా



పాత రాజరాజేశ్వరిపేట : దసరా ఉత్సవాల్లో భాగంగా పోలీసు అధికారులు ఇంద్రకీలాద్రి వద్ద నిరంతరం నిఘా ఏర్పాట్లు చేశారు. శనైశ్చరస్వామిగుడి,ఘాట్లు తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. అనుమానిత లగేజీలను తనిఖీ చేసి భక్తులను పంపిస్తున్నారు.

భక్తుల సేవలో..



ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలకు వస్తున్న భక్తులకు త్రిశూల గుర్తు, నామాల బొట్లను పెడుతున్నారు. బొట్టు పెట్టినందుకు భక్తులు నగదు ఇస్తే తీసుకుంటున్నారు.



అత్యుత్సాహం

పాయకాపురం : కనకదుర్గానగర్ ప్రసాదాల కౌంటర్ వద్ద పోలీసులు బారికేడ్లు పెట్టి ఆలయ అధికారుల వాహనాలను అడ్డుకున్నారు. దీంతో గుడి సిబ్బందికి, పోలీసులకు మధ్య వాగ్వివాదం జరిగిన తర్వాత ఐడీ, పాస్‌లను చూసి వాహనాలను అనుమతించారు.



కుమ్మరిపాలెం సెంటర్ వద్ద విధులకు వస్తున్న ఉద్యోగుల అడ్డగింత



అమ్మతోడు

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

పాస్‌లున్నా అడ్డుకుంటున్నారు!

▸ పోలీసుల తీరుపై ఉత్సవ సేవా కమిటీ సభ్యురాలి నిరసన

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దుర్గగుడి దసరా ఉత్సవాలలో పోలీసు అధికారుల అత్యుత్సాహం విమర్శలకు దారితీస్తోంది. పోలీసులు తమవారిని పదుల సంఖ్యలో కొండపైకి తరలించి అమ్మవారి దర్శనం చేయిస్తున్నారని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. సామాన్య భక్తులు గంటలతరబడి అమ్మవారి దర్శనం కోసం వేచి చూస్తున్నా. ప్రధాన గేట్ల వద్ద ఉన్న పోలీసులు తమ వారిని ఎలాంటి ఆంక్షలు లేకుండా స్వాగతం పలుకుతూ, విధుల్లోకి వెళ్లే దుర్గగుడి ఉద్యోగులు, అర్చకులు, ఇతర విభాగాల వారిని అడ్డుకుంటున్నారన్నారు. పోలీసుల తీరుకు నిరసిస్తూ దసరా ఉత్సవ సేవా కమిటీ సభ్యురాలు కొండపై నిరసన వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది. టోల్‌గేట్ నుంచి పోలీసు వాహనాలు బారులుతీరుతున్నా ఎలాంటి ఆంక్షలు విధించకుండా కొండపైకి పంపిస్తున్నారు. కుమ్మరిపాలెం సెంటర్ వద్ద విధులకు హాజరయ్యే ఉద్యోగుల వద్ద పాస్‌లు ఉన్నప్పటికీ గంటల తరబడి నిలబెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కొందరు పోలీసు అధికారులు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తూ భక్తులు, సిబ్బందిపైన తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కొండపై పోలీసుల తీరుకు నిరసన వ్యక్తం చేస్తున్న దసరా ఉత్సవ సేవా కమిటీ సభ్యురాలు



ఫీడ్ బ్యాక్ ద్వారా భక్తుల సమస్యలు తక్షణమే పరిష్కరిస్తున్నాం

▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

ఇంద్రకీలాద్రి : దసరా ఉత్సవాలలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు తెలిపిన ఫీడ్ బ్యాక్ ద్వారా సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. గురువారం దుర్గగుడి ఈవోతో కలిసి ఆయన మీడియా పాయింట్‌లో మాట్లాడారు. కాత్యాయనీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనం ఇవ్వటం పది సంవత్సరాలలో ఇదే మొదటిసారని తెలిపారు. కాత్యాయనీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవటానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారని, అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టామన్నారు. భక్తులు నుంచి క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్ బ్యాక్ తెలుసుకుంటున్నామని, వారు తెలిపిన సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నామని తెలిపారు. అన్న ప్రసాదం కేంద్రంలో మరుగుదొడ్లు తగినన్ని లేవని తెలపగా వెంటనే మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. సామాన్య భక్తులకే ప్రథమ ప్రాధాన్యత అని వారికి చక్కటి దర్శన అనుభూతి కలిగించేందుకు వీఐపీ దర్శన వేళల్లో మార్పులు చేశామని చెప్పారు. వీఐపీలు అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.



ప్రత్యేక ఆకర్షణగా కళాకారుల ప్రదర్శనలు



భళారే..

మోడల్ గెస్ట్ హౌస్ నుంచి దసరా ఏర్పాట్లు వీక్షించిన డీజీపీ

విజయవాడ : మోడల్ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా గురువారం సాయంత్రం పరిశీలించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన వీడియోవాల్స్‌ను ద్వారా ఇంద్రకీలాద్రి, అంతరాలయం ద్వారం, ఓం మలుపు, వీఐపీ క్యూలైన్, సాధారణ భక్తుల క్యూలైను, ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ వంటి అంశాలను పరిశీలించారు. సీపీ రాజశేఖరబాబు టెక్నాలజీ ద్వారా విజయవాడ నగరం, ఇంద్రకీలాద్రిపై పెట్టిన నిఘా, చేసిన కట్టుదిట్టమైన ఏర్పాట్లను వివరించారు.



కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో దసరా ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా



మాట్లాడుతున్న ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు

సీసీఎస్ ఆఫీసును తరలించొద్దు

▸ ఆర్టీసీ ఈయూ నేతల డిమాండ్

బస్టేషన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ హౌస్ నుంచి సీసీఎస్ ఆఫీసును తరలించే ప్రయత్నాన్ని విరమించాలని ఎంప్లాయీస్ యూనియన్ నేతలు పేర్కొన్నారు. గురువారం విజయవాడలో యూనియన్ సీసీఎస్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ, ఇప్పటికే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. యూనియన్ సభ్యులు ఎక్కువగా ఉన్నారన్న కారణంగా రాష్ట్రంలో ఉన్న నాలుగు నాన్ ఆపరేషన్ రీజియన్లలో ఉన్న 13 మంది డెలిగేట్ల సంఖ్యను నాలుగుకు కుదించాలన్న ప్రతిపాదనలను వెనక్కు తీసుకోవాలన్నారు. టీడీపీ హయాంలోనే అప్పట్లో ఆర్టీసీ హౌస్‌ను నిర్మించారని తెలిపారు. ఉద్యోగుల ఆర్థిక అవసరాల కోసం క్రెడిట్ కోపరేటివ్ సొసైటీని (సీసీఎస్) ఆఫీసును ఏర్పాటు చేశారని, సొసైటీకి పది రూపాయల అద్దెగాని, ఎటువంటి రుసుములు వసూలు చేయకుండానే అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. ఆర్టీసీ హౌస్‌లోనే సీసీఎస్ కార్యాలయం ఉండేలా పాలకమండలి నిర్ణయం చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధంగా ఉండాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు.

దుర్గమ్మను దర్శించుకున్న ఎంపీ కలిశెట్టి

విజయవాడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సామాన్యభక్తులకు ప్రాధాన్యమివ్వాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలను గౌరవిస్తూ సాధారణ భక్తుడిలా క్యూలో వచ్చి దుర్గమ్మను దర్శించుకున్నానని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. కాత్యాయనీ దేవీ అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని గురువారం ఆయన దర్శించుకున్నారు. వీఐపీ దర్శనాలకు దేవస్థానం కేటాయించిన సమయాల్లో మాత్రమే దర్శించుకోవాలని కోరారు. దేవస్థానం, జిల్లా యంత్రాంగం చేసిన ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయని భక్తులు చెప్పారన్నారు. దుర్గామాత అనుగ్రహంతో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని జగన్మాతను ప్రార్థించినట్టు ఆయన తెలిపారు.

నవోదయ ప్రవేశ దరఖాస్తుకు గడువు పెంపు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జవహర్ నవోదయ విద్యాలయాల్లో 9, 11 తరగతుల్లో లేటరల్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించినట్టు ప్రిన్సిపాల్ డి.ఏదునందన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు లేటరల్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు తేదీని అక్టోబర్ 7 వరకూ పొడిగించినట్టు తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలల్లో 8, 10 తరగతులు చదివి ఉండాలన్నారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో జేఎన్‌వీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ వివరించారు.



ఎండలోనే సీతమ్మవారి పాదాల ఘాట్ ఎదురుగా అండర్ పాస్ వద్ద పారిశుధ్య కార్మికులు

అమ్మసేవలో.. అలమటిస్తున్నాం!

▸ ఇంద్రకీలాద్రి పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో కీలకపాత్ర

▸ రాత్రింబవళ్లు కష్టపడినా పట్టించుకోని అధికారులు

▸ కనీస భోజన సదుపాయాలు లేవు

▸ పారిశుధ్య కార్మికుల ఆవేదన

విజయవాడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఎక్కడ ఏ కార్యక్రమం జరిగినా ఆ ప్రాంతం అందంగా ఉండాలంటే పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకం. పరిసరాలు అందంగా ఉంటేనే ప్రభుత్వానికి, అధికారులకు మంచిపేరు వస్తుంది. పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పారిశుధ్య కార్మికులదే. దసరా మహోత్సవాలను నగర ప్రజలు ఘనంగా జరుపుకుంటారు. ఈ మహోత్సవాల సమయంలో ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకోవడానికి రోజూ వేలల్లో భక్తులు తరలివస్తుంటారు. అయితే పారిశుధ్య కార్మికులు కొండపైనా.. పరిసరప్రాంతాలు, రోడ్డుపై చెత్త పడిన యుద్ధం ప్రకటించినట్టు వెంటనే శుభ్రం చేసి అందంగా ఉంచుతున్నారు. అటువంటి తమను కనీసం భోజనం చేశావా అని పట్టించుకునే నాథుడే లేడని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి నుంచి భోజనాలు, అన్నప్రసాదమే గతి

దసరా ఉత్సవాలు ఎంత ఘనంగా జరిగాయని చెప్పుకోవడానికి భక్తులకు అందించే వసతులు ఒక ఎత్తయితే.. ఇంద్రకీలాద్రి పరిసర ప్రాంతాలు ఎంత పరిశుభ్రంగా ఉంటే అంత అద్భుతంగా జరిగినట్టు చెప్పుకుంటారు భక్తులు. అయితే పారిశుధ్య కార్మికులను అధిక సంఖ్యలో నియమించి ఎక్కడికక్కడ క్లీన్‌గా ఉంచే విధంగా అధికారులు చర్యలయితే చేపట్టారు కానీ వారి ఆకలి గురించి పట్టించుకునే విషయంలో మాత్రం ఆదమరిచారు. దీంతో ఉదయం టిఫిన్ నుంచి సాయంత్రం భోజనాల వరకు వారు ఇంటి నుంచి కొందరు తెచ్చుకుంటే.. మరికొందరు భక్తులకు ఏర్పాటు చేసిన అన్నప్రసాదానికి వెళ్లి తింటున్నారు. దసరా ఉత్సవాల్లో పాల్గొనే అన్నిశాఖల ఉద్యోగులు, కార్మికులకు మాత్రం జిల్లా యంత్రాంగం లేదా ఆయాశాఖల అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు భోజన ఏర్పాట్లతో పాటు టీ, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నారు. కానీ పారిశుధ్య కార్మికులను నియమించిన మున్సిపల్ అధికారులు, వారిని తీసుకువచ్చిన కాంట్రాక్టర్లు మాత్రం అసలు పట్టించుకోవడం లేదని ఆ చిరు కార్మికులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. తమను ఉన్నత స్థాయి ఉద్యోగుల్లా కాకపోయినా కనీసం మనుషుల్లా చూడాలని వారి ఆవేదన బాధాకరం.

ఏమైనా తిన్నావా అని అడిగేవారు లేరు

- భవాని కుమారి పారిశుధ్య కార్మికురాలు

మూడు షిఫ్టుల్లో పనిచేసే తమను ఎంతసేపు పనిచేశావా, అక్కడికి వెళ్లండి.. చెత్త పేరుకుపోయింది.. శుభ్రం చేయండి.. అనేవారే తప్ప భోజనానికి టైం అయింది తిన్నావా..! అనేవారు ఒక్కరూ లేరు. కనీసం టీ ఇచ్చే నాథుడే లేడు. మొదటిరోజు అందరిలాగే మాకు ప్రత్యేకంగా భోజన ఏర్పాట్లు చేస్తారేమో అనుకున్నాం. కానీ ఎప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడంతో ఐదు, పది మంది చొప్పున భక్తులకు పెట్టే అన్నప్రసాదం వద్దకు వెళ్లి తినివస్తున్నాం. ఇప్పుడు ఇంటివద్ద నుంచే భోజనం తెచ్చుకుంటున్నాం.

మమ్మల్ని మనుషుల్లా గుర్తించాలి

- లక్ష్మి, పారిశుధ్య కార్మికురాలు

భక్తులు వేసిన చెత్తను తీయడంలో పొరపాటు రెండు నిమిషాలు ఆలస్యమైతే మాపై స్వరున ఎగిరే అధికారులు, కాంట్రాక్టర్లు భోజనం చేయడం ఆలస్యమైనా కనీసం పట్టించుకోరు. అందరి కార్మికుల్లా మమ్మల్ని చూడనవసరం లేదు. కనీసం మనుషులుగా అయినా గుర్తిస్తే చాలు. ఎంత చిన్నస్థాయి కార్మికులమైనా మరీ కనీసం పట్టించుకోకపోవడం బాధగా ఉంది.

వీఐపీ.. తలనొప్పి

(5వ పేజీ తరువాయి)

క్యూలోకి వస్తున్నారో అర్థం కావట్లేదు. తీసుకెళ్లిన పాస్ అలాగే బయటకు వస్తుండటంతో అదే పాసుతో వేరే వ్యక్తులు దర్శనానికి వచ్చే అవకాశం ఏర్పడుతోంది. అనవసరమైనవిషయాల్లో రాద్ధాంతం చేస్తున్న పోలీసులు వీవీఐపీ, వీఐపీ పేరుతో ఎవరికి వారే వస్తున్నా పట్టించుకోవడం లేదని భక్తులు మండిపడుతున్నారు. వీవీఐపీ, వీఐపీలకు ప్రత్యేకంగా ఎగ్జిట్ పాయింట్ ఏర్పాటు చేశారు. ఈ పాయింట్ సెక్యూరిటీ, పర్యవేక్షణ సిబ్బంది లేకపోవడంతో దర్శనానికి వచ్చే భక్తులు అనేక మంది ఈ దారి నుంచి వీఐపీల క్యూలోకి వెళ్లిపోతున్నారు. దీంతో ఆ క్యూలో రద్దీ ఎక్కువవుతోంది.

ఉత్సవ కమిటీ సభ్యుడి హడావుడి

ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వారికోసం ఏర్పాటు చేసిన మార్గంలోనే వీఐపీలు దర్శనాలకు వెళ్లాలనుకుంటున్నారు. ఇలా తన వారిని గేటు లోపలకు పంపనందుకు గురువారం ఉత్సవ కమిటీ సభ్యుడు డి.రాజా హడావిడి చేశారు. వీఐపీలకు గురువారం మధ్యాహ్నం 3-5 గంటల వరకు స్లాట్ ఇచ్చారు. వీఐపీ కోటాలో వచ్చిన వారంతా వారికోసం ఏర్పాటు చేసిన క్యూలో కాకుండా ప్రొటోకాల్ జాబితాలో ఉన్న ప్రముఖులను తీసుకెళ్లే మార్గంలో వెళ్లడానికి మీడియా పాయింట్ వద్ద నిలబడ్డారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో అక్కడున్న పోలీసులు ఆ మార్గంలోకి వీఐపీ కోటాలోని భక్తులను అనుమతించలేదు. దీంతో అక్కడున్న ఉత్సవ కమిటీ సభ్యుడు రాజా గేటు వద్దకు వచ్చారు. తన వారిని పంపాలని పోలీసులకు చెప్పారు. వారు గేటు తీయలేమని చెప్పడంతో రాజాకు కోపం వచ్చింది. తన వారిని కాకుండా ఇతరులను ఎలా పంపుతారో చూస్తానంటూ గేటుకు అడ్డంగా నిలబడిపోయారు. తాను బెజవాడలో పుట్టి పెరిగానని పోలీసులకు వార్నింగ్ ఇచ్చేలా వ్యవహరించారు. అక్కడున్న భక్తులను పక్కన ఉన్న వీఐపీ క్యూలోకి వెళ్లమని పోలీసులు అభ్యర్థించినా కదల్లేదు. ఇదే సమయంలో పోలీసు సేవాదళ్ సభ్యులు విభిన్నప్రతిభావంతుడిని వీల్‌చైర్‌లో దర్శనానికి తీసుకొచ్చారు. ఈ గేటు వద్ద అనధికార వీఐపీలు గుమిగూడటంతో లోపలికి తీసుకెళ్లలేకపోయారు.

చక్కనితల్లికి చాంగుభళా

(5వ పేజీ తరువాయి)

అభినందించారు. అనంతరం విద్యార్థులకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్.. ఇటలీ తెలుగు అసోసియేషన్ గుర్తింపు సర్టిఫికెట్లు అందించారు.

తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో..

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఎమ్మెస్ చౌదరి బృందం ప్రదర్శించిన కపిరాజు, చిరుమేఘం నాటికలు సందేశాత్మకంగా సాగాయి. పల్నాడుకు చెందిన చిన్న ఆంజనేయుల తోలుబొమ్మలాట ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, శ్రీకాకుళానికి చెందిన సత్తిరాజు బృంద తప్పెటగుళ్లు ఆహూతులను అలరించాయి. తాడేపల్లికి చెందిన యడ్లవల్లి బుర్రకథ గానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గుంటూరుకు చెందిన రాజ్యలక్ష్మి గాత్ర కచేరీ రసరమ్యంగా సాగగా, ఎన్‌బీకే మ్యూజిక్ అండ్ డ్యాన్స్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాంశాలు దుర్గమ్మ కళానివేదన సమర్పించాయి.

సరికొత్తగా గాంధీహిల్

(5వ పేజీ తరువాయి)

పడుతున్నాయి. అభివృద్ధి పనుల నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆరోజు గాంధీహిల్‌కు వస్తున్నారు. ఇప్పటికే ప్రారంభమైన పనులను పరిశీలించటంతో పాటు భవిష్యత్తులో 'గాంధీ ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్' నమూనాలను వీక్షించనున్నారు. ఈ సెంటర్‌లో భారీ కన్వెన్షన్ సెంటర్, సైన్స్ సెంటర్, మ్యూజియం, లైబ్రరీ, గెస్ట్‌హౌస్‌లు ఏర్పాటు చేస్తారు. గాంధీహిల్ చాలాకాలంగా మౌలిక సదుపాయాలకు దూరమై ప్రజల నిరాదరణకు గురవుతోంది. దీంతో నూతన సొసైటీ భారీ ప్రాజెక్టుతో ముందుకొచ్చింది. ప్రస్తుతం శిథిలమైన మ్యూజియం భవనాన్ని తొలగించారు. ఈ ప్రాంతంలోనే ప్రాజెక్టు పనులు జరుగుతాయి. ఘాట్‌మార్గం, కొండపైన, మినీ రైల్వేట్రాక్ చుట్టూ ఉన్న చెట్లను తొలగించారు. గ్రీన్‌బెల్ట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. పర్యాటకుల విహారం కోసం కొండ చుట్టూ తిరిగే రైలును కూడా బాగు చేయటంతో పాటు ఆధునిక రూపం కల్పిస్తున్నారు. అక్టోబరు 2న చంద్రబాబు ఇక్కడికి వచ్చినప్పుడు స్వాతంత్ర్య సమరయోధులు, సొసైటీ నిర్వాహకులతో సమావేశం కానున్నారు. ప్రత్యేకంగా సభను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

విజయవాడ తూర్పు


చాకలి ఐలమ్మ భారీ విగ్రహావిష్కరణ నేడు

గాంధీనగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రప్రదేశ్): రాజాకారుల మద్దతుతో దేశ్‌ముఖ్‌లు కొనసాగించిన అకృత్యాలు, ఆగడాలపై తన ప్రాణాలకు తెగించి పోరాడిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని చాకలి ఐలమ్మ విగ్రహ కమిటీ ఛైర్మన్ కందకట్ల శ్రీనివాసరావు తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. 130వ జయంతి సందర్భంగా నగరంలోని ఏలూరు లాకుల వద్ద శుక్రవారం ఉదయం చాకలి ఐలమ్మ భారీ విగ్రహాన్ని ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, నగర ప్రముఖులు, బీసీ సంఘాలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొంటారన్నారు.



దీన్‌దయాళ్ జయంతి కార్యక్రమంలో జ్యోతి వెలిగిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

పండిట్ దీన్‌దయాళ్‌కు ఘననివాళి

గుణదల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జనసంఘ్ సమావేశాలు 1965లో విజయవాడలో జరిగిన సమయంలోనే పండిట్ దీనదయాళ్ తన ఆలోచనలను ప్రకటించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. పండిట్ దీన్ దయాళ్ 109వ జయంతి కార్యక్రమం నగరంలోని మెట్రోపాలిటన్ హోటల్లో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాధవ్ మాట్లాడుతూ సంఘ్ శతాబ్ది ఉత్సవాలు ఈ ఏడాది జరగనున్నాయని తెలిపారు. సరళీకృత జీఎస్టీతో ప్రధాని మోదీ ధరలు తగ్గేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. పండిట్ దీన్ దయాళ్ పుట్టుక నుంచి మరణం వరకు సామాన్యంగా ఉంటాయని తెలిపారు.












కాత్యాయనీదేవిగా ధనకొండ అమ్మవారు


లలితాత్రిపురసుందరీ దేవిగా అమ్మవారు


అన్నపూర్ణా దేవిగా రాజరాజేశ్వరి అమ్మవారు


మంగళగౌరీదేవిగా మద్దిరావమ్మతల్లి


అన్నపూర్ణా దేవిగా కాళీమాత


అన్నపూర్ణా దేవిగా సిద్ధేశ్వరి అమ్మవారు

కాత్యాయనీదేవిగా జగన్మాత

విజయవాడ తూర్పు నియోజకవర్గంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాలుగో రోజు గురువారం అమ్మవారు కాత్యాయనీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. పలు ఆలయాల్లో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా, శివకామసుందరీదేవిగా, లలితాత్రిపుర సుందరీదేవిగా, మంగళగౌరీదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ, అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

-కృష్ణలంక, మొగల్రాజపురం,రామలింగేశ్వరనగర్, భారతీనగర్






కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో , దాసాంజనేయ దేవస్థానంలో , పటమట దత్తపీఠంలో .సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో అమ్మవారు, కుంకుమార్చనలు

ఆగివున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ

ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు

గుణదల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆగివున్న ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో ఒకరు చనిపోగా మరొకరికి తీవ్రగాయాలైన ఘటన మహానాడు జంక్షన్ వద్ద గురువారం జరిగింది. ఒంగోలుకు చెందిన అడపా కరుణ(45) పెద్ద కుమార్తె వివాహ విషయమై మంగళగిరిలో ఉన్న తల్లిదండ్రులు, తమ్ముడి వద్దకు వచ్చాడు. అతను పదిరోజుల క్రితమూ వచ్చాడు. అన్న ఊరికి వేళ్లేంత వరకు తనతో పనికి రమ్మని తమ్ముడు ఏలియా చెప్పాడు. ఇద్దరూ కలిసి మంగళగిరి నుంచి ద్విచక్రవాహనంపై మహానాడు జంక్షన్ వద్ద వాటర్ ట్యాంక్ సమీపంలో సిమెంట్ పనికి వస్తున్నారు. ఈ క్రమంలో గురువారం పనికి వస్తుండగా మహానాడు జంక్షన్ వద్ద సిగ్నల్ పడటంతో వాహనం నడుపుతున్న తమ్ముడు బ్రేక్ వేశాడు. ఆగివున్న వీరి వాహనాన్ని వెనుక నుంచి లారీ బలంగా ఢీకొట్టడంతో వీరిద్దరు ముందు ఆగివున్న మరో లారీ కిందకు వెళ్లిపోయారు. ఈ ఘటనలో కరుణ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తమ్ముడు తలకు హెల్మెట్ ధరించి ఉండటంతో చేతికి బలమైన గాయాలయ్యాయి. ఘటన స్థలంలో విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ పోలీసులు కరుణ మృతదేహాన్ని మార్చురీకి తరలించి గాయపడ్డ ఏలియా(35)ను మెరుగైన చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఏలియాకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న మాచవరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పూర్వాపరాలు సేకరించారు. ఏలియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాచవరం పోలీసులు తెలిపారు.


మృతుడు అడపా కరుణ

వెనుకబడిన వారి అభ్యున్నతికి దీన్‌దయాళ్ కృషి

విజయవాడ సీబీసీ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్ చంద్ర


దీన్ దయాళ్ చిత్రపటానికి నివాళుల ర్పిస్తున్న రమేష్ చంద్ర,డా. పద్మలత

ప్రసాదంపాడు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో వెనుకబడిన వారి అభ్యున్నతి కోసం పండిట్ దీన్‌దయాళ్ కృషి చేశారని విజయవాడ సీబీసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.రమేష్ చంద్ర అన్నారు. ఎనికేపాడులోని విజయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఫర్ ఉమెన్‌లో పండిట్ దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా అంత్యోదయ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రమేష్ చంద్ర అంత్యోదయ మిషన్ లక్ష్యాలను విద్యార్థులకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఫార్మాస్యూటికల్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఫార్మాస్యూటికల్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ డా.కె. పద్మలత విద్యార్థులు సామాజిక బాధ్యతతో కూడిన పౌరులుగా ఎదగాలని సూచించారు. ప్రోగ్రాం ఆఫీసర్ ఏ.జయరామిరెడ్డి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫార్మాసిస్ట్ సేవలు ఎనలేనివి

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీ రావు

ప్రభుత్వాసుప్రతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం పది కాలాల పాటు పదిలంగా ఉండాలంటే అందులో ఫార్మాసిస్ట్ పాత్ర అత్యంత ప్రధానమని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీ రావు తెలిపారు. గురువారం కొత్త ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రపంచ ఫార్మా దినోత్సవంలో ఆయన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతున్న కొత్త కొత్త వ్యాధులను, వైరస్‌లను దృష్టిలో పెట్టుకుని దానికి తగినట్టుగా కొత్త మందులను తయారు చేయడం, నివారణ మార్గాలు కనుగొనడంలో ఫార్మాసిస్ట్ పాత్ర కీలకమన్నారు. ప్రపంచ దేశాలకు తీసిపోని విధంగా నూతన ఔషధాల ఆవిష్కరణలో మన దేశ ఫార్మసిస్టులు కృషి శ్లాఘనీయని కొనియాడారు. సీఎస్ఆర్ఎం పద్మావతి మాట్లాడుతూ ఔషధాల తయారీ, వాటి నాణ్యత ప్రమాణాలను పర్యవేక్షించడం, ఔషధాలను నిల్వ చేయడం తదితర విషయాల్లో ఫార్మాసిస్ట్ పాత్ర విస్మరించలేనిదని అన్నారు. ఏడీ లక్ష్మీ కుమారి మాట్లాడుతూ ఔషధాన్ని ఏ మోతాదులో ఎలా వినియోగించుకోవాలో ఫార్మాసిస్టులే అవగాహన కల్పించగలరని తెలిపారు. ఫార్మా ఆఫీసర్లు దుర్గాభవానీ, మాలతి, పలువురు ఫార్మాసిస్టులు పాల్గొన్నారు.


కొత్త ప్రభుత్వాసుపత్రిలో జరిగిన ఫార్మా దినోత్సవంలో పాల్గొన్న ఆసుపత్రి సూపరింటెండెంట్ ఏవీ రావు

ఫార్మాసిస్ట్ పోస్టులు పెంచాలి

విజయవాడ జీజీహెచ్‌లో 1498 పడకల సామర్థ్యానికి కేవలం 23 మంది ఫార్మాసిస్టులు మాత్రమే పని చేస్తున్నారు. స్టోర్ అటెండర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు లేకపోవడంతో వారి పనులు కూడా ఫార్మాసిస్టులే నిర్వహించాల్సి వస్తుంది. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విజయవాడ జీజీహెచ్ లో కూడా 13 మంది అదనపు ఫార్మాసిస్ట్ పోస్టులను కేటాయించి పనిభారం, ఒత్తిడి తగ్గించాలి.


కళాకారులు బ్రహ్మానందం, ఆంజనేయ రాజులను సత్కరిస్తున్న కళా సంస్థల ప్రతినిధులు

అలరించిన సంగీత విభావరి

విజయవాడ కల్చరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) :తెలుగు కళా వాహిని, డాక్టర్ పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీకళాభారతి, రాగలహరి సంయుక్త నిర్వహణలో కౌతా కళావేదికలో బాలు అమరస్వరం పేరుతో వారం రోజులపాటు నిర్వహిస్తున్న సంగీత విభావరి 4వ రోజు పలువురిని అలరించింది. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ తన మధురస్వరంతో కోట్లాది మందిని అలరించిన ఎస్పీ బాలసుబ్రమణ్యం చిరస్మరణీయుడు అంటూ ఆయన వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించారు. సభలో అతిథిగా పాల్గొన్న సీనియర్ రేడియో కళాకారులు మాడుగుల రామకృష్ణ మాట్లాడుతూ తెలుగు సినీ శ్రోతలకు ఎస్పీ బాలసుబ్రమణ్యం ఒక వరం, స్నేహశీలి, నిగర్వి అన్నారు. ప్రముఖ సంగీత విద్వాంసులు కేవీ బ్రహ్మానందం, కళాకారులు బోడి ఆంజనేయరాజులకు ఎస్పీ బాలసుబ్రమణ్యం స్మారక పురస్కారం జరిగింది. సభలో సావిత్రి కళాపీఠం అధ్యక్షురాలు పరుచూరి విజయలక్ష్మి, డ్రీమ్ ఆడియో చావా నరసింహారావు, జ్యోతిష్యరత్న ప్రసూనా రామన్, శింగంశెట్టి చంద్రశేఖర్, కె.డేవిడ్‌రాజు, టీవీ వీరభద్రరావు తదితరులు ప్రసంగించారు. గాయకులు తమ గానంతో అలరించారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం



విజయవాడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): లబ్బీపేట ఎ-కన్వెన్షన్ సెంటర్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో - ఎగ్జిబిషన్ కమ్ సేల్ గురువారం ప్రారంభమైంది. దసరా, దీపావళి సందర్భంగా దేశంలోని దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతులు, వస్త్ర సౌందర్యాలు, మగ్గాల ఉత్పత్తులు ఒకే చోట అందుబాటులో ఉంచామన్నారు. వేలాది రకాల పట్టు, కాటన్ డిజైన్ చీరలు, బ్లౌజులు, కుర్తాలు ఎక్స్‌పోలో ఉన్నాయని, చేనేత కార్మికులే నేరుగా 50 శాతం వరకు తగ్గింపు ధరతో విక్రయిస్తున్నారన్నారు. మహారాష్ట్ర పైఠానీ సిల్క్‌చీరలు, బెంగళూరు సిల్క్, సాఫ్ట్‌సిల్క్, కాషిడా సిల్క్ చీరలు, మధ్యప్రదేశ్ చందేరి అండ్ మహేశ్వరి సిల్క్ హ్యాండ్ పెయింటింగ్ వస్త్రాలు, బలుచారి, జమ్దానీ, తంగైల్, ఢకైమస్లిన్ సిల్క్ చీరలు, పశ్చిమబెంగాల్ లినెన్ చీరలు, వర్క్‌స్టిచ్ చీరలు ఎక్స్‌పోలో ఉంచామన్నారు. తస్సార్, మట్కా, బీహార్ భాగల్పూర్ సిల్క్, గుజరాత్ సంప్రదాయబంధినీ, కచ్ ఎంబ్రాయిడరీ, ఎటోలా, తమిళనాడు కంజీవరం చీరలతో పాటు ఎంబ్రాయిడరీ సిల్క్ చీరలు, జమ్మూ కశ్మీర్ తాబి సిల్క్‌చీరలు, ఉత్తరప్రదేశ్ బనారస్ సిల్క్ చీరలు ఉన్నాయన్నారు. ఈ ప్రదర్శన ఈనెల 29 వరకు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు.

ఉపాధిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలకం

● ఆంధ్రా లయోలా కళాశాల ప్రొఫెసర్ పీవీఎస్ సాయిరాం

కానూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి) : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపాధికి ఎంతగానో దోహదపడుతుందని ఆంధ్రా లయోలా కళాశాల భౌతికశాస్త్ర విభాగం ప్రొఫెసర్ పీవీఎస్ సాయిరాం తెలిపారు. సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యం లో గురువారం ఎలక్ట్రానిక్ పరికరాల ఆవశ్యకత అంశంపై జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సాయిరాం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏఐ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ తదితర వాటిలో భౌతికశాస్త్రం ప్రాధాన్యతను వివరించారు. వర్సిటీ భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కొల్లా నరేంద్ర, పలువురు అధ్యాపకులు సాయిరాంను సత్కరించారు.

పరిశుభ్రతలో లోపం లేకుండా చూడండి

అధికారులకు నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం


లయోలా కళాశాల రోడ్డులో డ్రెయినేజీ పరిశీలిస్తున్న నగర కమిషనర్ ధ్యానచంద్ర

భారతీనగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగర పరిశుభ్రతలో ఎటువంటి లోపం ఉండరాదని నగర కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. గురువారం నగర పర్యటనలో భాగంగా టిక్కిలి రోడ్డు, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, ఎన్టీఆర్ కాలనీ, ఏలూరు రోడ్డు, గులాబీ తోట ప్రాంతాల్లో నగర కమిషనర్ ధ్యానచంద్ర పర్యటించి, పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. దసరా వేడుకలలో అధికారులు నిమగ్నమై ఉన్నప్పటికీ నగర శుభ్రతలో ఎటువంటి లోపం రాకూడదని తెలిపారు.. ప్రతిరోజు వ్యర్థాల సేకరణ ఖచ్చితంగా జరగాలని, వీధుల్లో చెత్తకుప్పలు ఉండరాదని తెలిపారు. భవన నిర్మాణ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తీసేయాలని అధికారులను ఆదేశించారు. రాణిగారి తోట వద్ద అన్నక్యాంటీన్‌ను పరిశీలించారు.

సామాన్య భక్తులకు పెద్దపీట : ఆర్డీవో చైతన్య



రామలింగేశ్వరనగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజోతి): సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వం చేసిన ఏర్పాట్లలో ఎటువంటి లోటుపాట్లు కలగకుండా చూడాలని ఆర్డీవో కావూరి చైతన్య సెక్టార్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని అనంతరం కొండ కింద పలు ప్రాంతాల్లో పర్యటించే సందర్భంలో ఎటువంటి ఇబ్బందులు, అవాంఛనీయ సంఘటనలు కలుగకుండా చూడాలని అధికారులకు సూచనలు చేశారు.



ఉత్సవ్‌లో నేటి ప్రదర్శనలు

విజయవాడ సిటీ, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా ఐదోరోజు శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి మొదలయ్యే కార్యక్రమాల వివరాలు ఇలా ఉన్నాయి.

పున్నమిఘాట్‌లో..

బీట్ గురూస్ లైవ్, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఉన్నాయి.

తుమ్మలపల్లి వేదికగా..

సాయంత్రం 6 గంటలకు గుంటూరుకు చెందిన ఎంటీకే మ్యూజిక్ అండ్ డ్యాన్స్ స్కూల్ స్టూడెంట్స్‌తో కూచిపూడి నృత్య ప్రదర్శన, 6.30 గంటలకు సంగీత వాద్య ప్రదర్శన, సాయంత్రం 7 గంటలకు తెనాలికి చెందిన రామ్ ప్రసాద్ కాళిక వేషాల ప్రదర్శన, 7.30 గంటలకు నర్సారావుపేటకు చెందిన వనపర్తి దుర్గారావు నేతృత్వంలో తోలుబొమ్మలాట, 8 గంటలకు పద్మశ్రీ కల్లూరి సుబ్బారావు లలిత కళాపరిషత్, అనంతపురం వారితో పౌరాణిక పద్య నాటకం శకుని జరుగుతాయి.

ఘంటసాల ప్రభుత్వ కళాశాల వేదికగా..

సాయంత్రం 6 గంటలకు నటరాజ్ డ్యాన్స్, మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ స్కూల్ స్టూడెంట్స్‌తో కూచిపూడి, భరతనాట్యం, కోలాటం, 6.30 గంటలకు జీవీఆర్ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులతో గాత్ర సంగీత ప్రదర్శన, 7 గంటలకు నగరానికి చెందిన సప్పా శివకుమార్ కూచిపూడి ప్రదర్శన, 7.30 గంటకు అమలాపురానికి చెందిన అయ్యప్ప నేతృత్వంలో గంగలు ప్రదర్శన, 8 గంటలకు కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్, గుంటూరు వారి సాంఘిక నాటిక తరమెల్లిపోతున్నదో వంటి ప్రదర్శనలు జరుగుతాయి.

దుర్గమ్మకు సాంస్కృతిక నీరాజనం

దుర్గా స్పెషల్‌గా ఉత్సవ్‌లో శ్రీశక్తి ● పున్నమిలో అయిగిరినందిని.. అలరిస్తున్న ప్రదర్శనలు ● విజయవాడ ఉత్సవ్‌లో స్పీకర్ల సందడి ● అబ్బురపరిచిన మహిళ చేనేత వస్త్రధారణ



తప్పెటగుళ్లు ఆడుతున్న కళాకారులు

వయొలిన్ వాయిద్యంతో సూట్‌కేస్ దరువు

ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ: విజయవాడ ఉత్సవంలో దుర్గమ్మ స్పెషల్‌గా సాంస్కృతిక నీరాజనం జరిగింది. దుర్గమ్మను స్తుతిస్తూ నర్తించటంతో పాటు, భక్తి పాటలకు నృత్యాలతో భక్తిభావం పెంపొందించారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఇద్దరూ పున్నమిఘాట్ ఉత్సవ్‌లో సందడి చేశారు. చేనేత వస్త్రధార ప్రదర్శన, వయొలిన్ సంగీతం, తప్పెటగుళ్ల వంటివి అలరించాయి. అయిగిరినందిని.. దుర్గా స్పెషల్ విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా పున్నమి ఘాట్‌లో ప్రత్యేకంగా మహిళల కోసం 'శ్రీ శక్తి' మహోత్సవం నిర్వహించారు. దుర్గస్తుతి పాటకు సూరపనేని అనన్య సోలో క్లాసికల్ డ్యాన్స్‌ను ప్రదర్శించారు. అనన్య నాట్య విన్యాసం ఆహుతులను కట్టిపడేసింది. దుర్గమ్మను స్తుతిస్తూ



నర్తించిన అనన్య అభినయం రక్తి కట్టించింది. అనూష బృందం చేసిన శాస్త్రీయ నృత్యాలు ఆహుతులను అలరించాయి. అయిగిరి నందిని పాట, పలుకే బంగార మాయేనే పాటలకు అనూష బృందం అద్భుత నాట్యం చేసింది. ఏపీ క్రియేటివ్ అండ్ కల్చరల్ కమిషన్ చైర్ పర్సన్ తేజస్విని తప్పెటగుళ్ల జానపద నృత్యం గురించి ప్రేక్షకులకు పరిచయం చేశారు. తప్పెట గుళ్ల జానపద నృత్యాన్ని ప్రేక్షకులు ఆసక్తిగా తిలకించారు. వయొలిన్ విద్వాంసురాలు కామాక్షి ప్రదర్శన ఆకట్టుకుంది. ఆమె సంగీతానికి తోడు మరొకరు సూట్‌కేసుపై డ్రమ్స్ వాయిద్యం ఆకట్టుకున్నాయి. ప్రేక్షకుల మధ్యకు కూడా వెళ్లి వయొలిన్ సంగీతం వాయిస్తూ అందరినీ ఆహ్లాదపరిచారు.

ఉత్సవ్‌లో స్పీకర్ల సందడి

విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొనేందుకు శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు పున్నమి ఘాట్‌కు చేరుకున్నారు. ఇద్దరికీ ఎంపీ కేశినేని చిన్ని ఘనస్వాగతం పలికారు. పున్నమిఘాట్‌లో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ ఆలయ సెట్టింగ్‌కు తీసుకు వెళ్లారు. అక్కడ అమ్మవారిని అయ్యన్నపాత్రుడు, రఘురామకృష్ణంరాజులు దర్శనం చేసుకున్నారు. తర్వాత ఫుడ్‌స్టాళ్లను సందర్శించారు. విజయా డెయిరీ ఏర్పాటు చేసిన స్టాల్‌లో అయ్యన్నపాత్రుడు, రఘురామ కృష్ణంరాజు ఇద్దరూ మిఠాయిలను రుచి చూశారు. తర్వాత విజయవాడ ఉత్సవ్ సెల్ఫీ పాయింట్ దగ్గర ఫొటోలు దిగారు. జిల్లా సమగ్ర సమాచారంతో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకించారు. మన ఊరు.. మన ఊహలని ఉన్న సైన్‌బోర్డుపై ఇద్దరూ సంతకాలు చేశారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షించారు.

అబ్బురపరిచిన చేనేత ప్రదర్శన

చేనేత వస్త్ర ప్రదర్శన ఆకట్టుకుంది. రాష్ట్ర చేనేత జౌళి శాఖ నేతృత్వంలో 2024లో గోల్డ్ అవార్డు సాధించిన వారితో చేనేత వస్త్రధారణ ప్రదర్శన ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని చేనేత వస్త్రాలకు ప్రతినిధులుగా వాటిని ధరించి ప్రదర్శన చేశారు. కోనేరు శివకాంచనలత నేతృత్వంలో ఐఏఎస్ అధికారిణిలు సుప్రజ, రేఖారాణి, ఎంపీ సతీమణి కేశినేని జానకీ లక్ష్మి, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, ఏపీ కల్చరల్, క్రియేటివ్ కమిషన్ చైర్మన్ తేజస్విని, విష్ణు ప్రియ, డాక్టర్ సింధు, బాలినేని కీర్తి, శిరీష చేనేత వస్త్రాలను ధరించి ప్రదర్శన నిర్వహించారు.

నాన్ స్టాప్ జోష్! ఉత్సవ్ మస్తీ!


నాన్ స్టాప్ మస్తీతో నగర ప్రజలు ఓలలాడారు. బెజవాడ ఉత్సవ్‌కు ఊపొచ్చిం ది. పున్నమిఘాట్, సంగీత కళాశాల, తు మ్మలపల్లి కళాక్షేత్రాల్లో జరుగుతున్న సంగీత, నృత్య, నాటక ప్రదర్శనలు దిగ్విజయంగా జరుగుతున్నాయి. అన్ని వేదికల కు సందర్శకులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఎవరికి ఇష్టమైనవి వారు వీక్షిస్తున్నారు. ఈ అంతులేని ప్రజాదరణ రానున్న కార్యక్రమాలకు మరింత జోష్ నెలకొనబోతోంది. ఇక ఎగ్జిబిషన్ కూడా వస్తే ఆ కిక్కే వేరు. 4వ రోజు ఉత్సవ్‌కు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పా త్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

దేశ నలుమూలలకూ మన సంస్కృతి: ఎంపీ చిన్ని

సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే వేదికగా విజయవాడ ఉత్సవ్ నిలుస్తుంది. మైసూరు తరహా దసరా వేడుకలను ఇంద్రకీలాద్రి అమ్మవారి సన్నిధిలో జరిపించాలనే సంకల్పంతో ప్రారంభించిన ఈ ఉత్సవం విజయవంతమైంది.

మెగా కార్నివాల్.. గిన్నిస్‌కు దరఖాస్తు

దసరా ఉత్సవాల సందర్భంగా విజయవాడ నగరంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్‌కు ప్రపంచ గుర్తింపును తీసుకు వచ్చేందుకు నిర్వాహక కమిటీ సన్నాహకాలు చేస్తోంది. ఈ నెల 28న బందరు రోడ్డులో నిర్వహించే మెగా ఉత్సవ్ కార్నివాల్ ద్వారా గిన్నిస్ రికార్డు నెలకొల్పేందుకు నిర్ణయించింది. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఇప్పటికే గిన్నిస్ బుక్ నిర్వాహకులతో సంప్రదించారు. ప్రపంచవ్యాప్తంగా కార్నివాల్స్ జరుగుతుంటాయి. వాటికెంతో క్రేజు ఉంటుంది. అలాంటిది మొదటిసారిగా నిర్వహిస్తున్న కార్నివాల్ ప్రయత్నంలోనే గిన్నిస్ రికార్డు నెలకొల్పే ప్రయత్నం చేయటం విశేషం. బందరు రోడ్డుపై కంట్రోల్ రూమ్ నుంచి బెంజిసర్కిల్ వరకు మన సంప్రదాయ దసరా వేషాలతో మెగా కార్నివాల్‌ను నిర్వహించాలని ప్లాన్ చేశారు. మన దేశంలోని భిన్న సంస్కృతులు, జానపద కళారూపాలు, సంప్రదాయ వేషధారణలతో భారీగా కార్నివాల్‌ను నిర్వహించబోతున్నారు. ప్రపంచంలో ఇప్పటి వరకు నిర్వహించిన అతి పెద్ద కార్నివాల్స్ కంటే భారీగా నిర్వహించేందుకు వీలుగా అన్ని రాష్ట్రాల నుంచి కళాకారులను రప్పిస్తున్నారు. బందరు రోడ్డుపై వేలాదిమందితో కార్నివాల్ నిర్వహించటం ద్వారా గిన్నిస్ రికార్డు నమోదు చేసి విజయవాడ ఉత్సవ్‌ను ప్రపంచానికి పరిచయం చేయాలని భావిస్తోంది.



అలరించిన డ్రోన్ షో

మహాకనకదుర్గ బ్యాక్ గ్రౌండ్ సాంగ్‌గా మొదలైన డ్రోన్ షో. అమ్మవారి రూపాలతో, విజయవాడ ప్రముఖ స్థలాల నమూనాలతో డ్రోన్ షో ఏర్పాటు చేశారు. డ్రోన్ షోను స్పీకర్లు ఇద్దరూ ఆసక్తిగా తిలకించారు.

రేపటి నుంచి ఎగ్జిబిషన్ రెడీ..!

● 27న బాలకృష్ణ చేతుల మీదుగా ప్రారంభం ● ఏర్పాట్లు పర్యవేక్షించిన ఎంపీ కేశినేని శివనాథ్

ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం: విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా ప్రత్యేక ఆకర్షణగా నిలువబోతున్న ఎగ్జిబిషన్ ఈ నెల 27న అంటే రేపటి నుంచి అందుబాటులోకి వస్తోంది. ఎగ్జిబిషన్‌ను హిందూపూర్ ఎమ్మెల్యే, నటుడు నందమూరి బాలకృష్ణ ప్రారంభించనున్నారు. గొల్లపూడిలోని జక్కంపూడి రోడ్డులో దేవస్థానం మైదానంలో ఎగ్జిబిషన్‌కు ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయి. ఏర్పాట్లను గురువారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పరిశీలించి ఎలాంటి లోపాలు లేకుండా అన్ని విభాగాలను సమన్వయంతో పూర్తి చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఎగ్జిబిషన్ స్టాళ్లు, విద్యుత్, భద్రత, పార్కింగ్, ప్రజా సౌకర్యాలపై నిర్వాహకుల నుంచి ప్రత్యక్షంగా వివరాలు తెలుసుకున్న ఆయన సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా సన్నాహాలు చేయాలని సూచించారు. పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులకు ఆయన ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. కుటుంబాలతో సహా వచ్చే సందర్శకులకు వినోదాత్మకంగా ఆకర్షణీయంగా ఉండేలా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. విజయవాడ ప్రజలకు ఈ ఎగ్జిబిషన్ ఒక విశేష అనుభూతిని కలిగించేలా ప్రతి అంశాన్ని జాగ్రత్తగా అమలు చేయాలని ఆదేశించారు.

దేవదాయ కమిషనర్ లేఖ అమలుకు బ్రేక్

● నారికంపాడులో 1,036 ఎకరాల గుడి భూములపై థర్డ్ పార్టీకి హక్కులు కల్పించవద్దన్న హైకోర్టు ● మధ్యంతర ఉత్తర్వులు జారీ ● విచారణ అక్టోబరు 27కి వాయిదా

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం నారికంపాడు గ్రామం పరిధిలోని వివిధ సర్వే నంబర్లలో శ్రీ జగన్మోహన వేణుగోపాలస్వామి దేవస్థానానికి చెందిన 1036.37 ఎకరాలను నిషేధిత భూముల జాబితా (22ఏ) నుంచి తొలగించాలని జిల్లా రిజిస్ట్రార్‌కు దేవదాయ శాఖ కమిషనర్ రాసిన లేఖ అమలును హైకోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. ఆ భూములపై థర్డ్ పార్టీకి ఎలాంటి హక్కులూ కల్పించవద్దని అధికారులకు స్పష్టం చేసింది. దేవస్థానం భూములను తీసుకునే విషయంలో ప్రభుత్వానికి ఉన్న అధికారంపై లోతైన విచారణ అవసరమని అభిప్రాయపడింది. తదుపరి విచారణను అక్టోబరు 27కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. సదరు ఆలయ భూములను 22ఏ జాబితా నుంచి తొలగించాలని దేవదాయ కమిషనర్ రామచంద్ర మోహన్ గత నెల 13న రాసిన లేఖ/ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ గంపలగూడేనికి చెందిన అన్నవరపు క్రాంతికుమార్, విజయవాడకు చెందిన న్యాయవాది అనంతలక్ష్మి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. దేవస్థానం అధీనంలో ఉన్న 1036.37 ఎకరాల్లో 28.35 ఎకరాలు తమవంటూ మేకా తనూజ్ రంగయ్య మరికొందరు 2022లో హైకోర్టులో పిటిషన్ వేశారని.. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. 28.35 ఎకరాలను 22ఏ నుంచి తొలగించాలంటూ గత ఏడాది అక్టోబరు 18న తీర్పు ఇచ్చారని తెలిపారు. ఈ తీర్పును ఆసరాగా చేసుకుని మొత్తం 1036.37 ఎకరాలనూ నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని కమిషనర్ లేఖ రాశారని.. దానిని రద్దు చేయాలని కోరారు. ప్రత్యేక విధానం ద్వారా రాష్ట్రప్రభుత్వం ఆ భూములను 1991లో తీసుకుందని ప్రభుత్వ న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఆ తర్వాత వాటిని నిషేధిత భూముల జాబితాలో చేర్చారన్నారు. 1991 నుండి 2006 వరకు ప్రభుత్వం టాస్డిక్ అలవెన్స్ కూడా చెల్లించిందని.. ఆ తర్వాత చెల్లించలేదని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. దేవదాయ కమిషనర్ లేఖ అమలును తాత్కాలికంగా నిలుపుదల చేశారు.

కారు డ్రైవర్‌పై దాడి

విద్యాధరపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గొల్లపూడికి చెందిన చాగంటి అభినవ్ బైక్‌పై కృష్ణలంక నుంచి కనకదుర్గమ్మ ఫ్లైఓవర్ మీదుగా గొల్లపూడి వెళుతున్నాడు. చిట్టినగర్‌కు చెందిన మనోహర్ ఫ్లైఓవర్‌పై వేగంగా వెళుతూ అభినవ్ బైక్‌ను ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయాడు. దీంతో అభినవ్ భవానీపురం బ్యాంకు సెంటర్ వద్ద కారును అడ్డగించి ఆపాడు. బైక్‌తో ఢీకొట్టి కనీసం ఆగకుండా వెళ్లిపోతావా? అని ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. అభినవ్ బైక్ తాళంతో మనోహర్‌పై దాడి చేశాడు. ఈ ఘటనలో మనోహర్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని స్థానికులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వివరాలు తెలుసుకుని విచారణ చేపట్టారు.

'నిడుబ్రోలు - అప్పికట్ల' ట్రాక్ పటిష్ఠం

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సౌత్ సెంట్రల్ సర్కిల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి గురువారం విజయవాడ డివిజన్‌లోని అప్పికట్ల - మాచవరం సెక్షన్ (విజయవాడ - గూడూరు మార్గం)ను విస్తృతంగా తనిఖీ చేశారు. విజయవాడ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాకియా, బ్రాంచ్ ఆఫీసర్లు తనిఖీల్లో ఆమె వెంట ఉన్నారు. విజయవాడ - గూడూరు మార్గంలోని నిడుబ్రోలు - అప్పికట్ల సెక్షన్‌లోని యూపీ లైన్ శాశ్వత మళ్లింపులో చివరి 4.918 కి.మీ (కి.మీ. 364.132-369.05) పూర్తయింది. పట్టాలు తప్పే అవకాశం ఉండటంతో పాటు నేలలో పటిష్టత తక్కువగా ఉండడంతో కీలకమైన 10 కి.మీ మేరకు శాశ్వత పటిష్ట చర్యలు తీసుకున్నారు. మూడు దశాబ్దాలకు పైగా, యూపీ లైన్‌లో 32 కి.మీ.లో 75/90 కెఎంపీహెచ్ వేగ పరిమితిని అమలు చేస్తున్నారు. దీంతో కొత్తగా మళ్లింపు ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. పనులు పూర్తి కావడంతో మాధవి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అప్ లైన్‌లో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న 32 కి.మీపీఎస్ఆర్‌లను సడలించడానికి మార్గం సుగమం చేసింది.

పండగల సందర్భంగా ప్రత్యేక రైళ్లు

పండగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని క్లియర్ చేసేందుకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్ఓ ఎ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 07055 కాచిగూడ - అనకాపల్లి గురువారాలలో బయలుదేరుతుంది. అక్టోబరు 2 నుంచి 30వ తేదీ వరకు 5 సర్వీసులు నడుస్తుంది. 07056 అనకాపల్లి - కాచిగూడ శుక్రవారాలలో నడుస్తుంది. అక్టోబరు 3 నుంచి 31వ తేదీ వరకు 5 సర్వీసులు నడుస్తుంది. 07095 చర్లపల్లి - హజరత్ నిజాముద్దీన్ మంగళవారం, గురువారాలలో నడుస్తుంది. అక్టోబరు 7 నుంచి 16వ తేదీ వరకు రెండు సర్వీసులు నడుస్తుంది. 07096 హజరత్ నిజాముద్దీన్ - చర్లపల్లి బుధ, శుక్రవారాలలో నడుస్తుంది.

అక్టోబరు 8 నుంచి 17వ తేదీ వరకు రెండు సర్వీసులు నడుస్తుంది. కాచిగూడ - అనకాపల్లి రైలు మల్కాజ్‌గిరి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి స్టేషన్‌లలో ఆగుతుంది. వన్ ఏసీ, టూ ఏసీ, త్రీ ఏసీ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి. చర్లపల్లి - హజరత్ నిజాముద్దీన్ రైలు కాజీపేట, పెద్దపల్లి, మంచిర్యాల, సిరిపూర్ కాగజ్‌నగర్, బల్లార్ష, చంద్రాపూర్, సేవాగ్రం, నాగపూర్, ఆమ్లా, ఇటార్సీ, భూపాల్, బినా, ఝాన్సీ, ఆగ్రా కంటోన్మెంట్, మధురా స్టేషన్‌లలో ఆగుతుంది. వన్ ఏసీ, టూ ఏసీ, త్రీ ఏసీ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి.

ఎలక్ట్రికల్ గోడౌన్‌లో భారీ చోరీ

● రూ.30లక్షల పైగా విలువైన సరుకు అపహరణ?

విద్యాధరపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గొల్లపూడి వై జంక్షన్ సెంటర్ వద్ద జక్కంపూడి కాలువ రోడ్డులో ఉన్న ఓ ఎలక్ట్రికల్ గోడౌన్‌లో భారీ చోరీ జరిగిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. వన్‌టౌన్‌కు చెందిన ప్రముఖ వ్యాపారివేత్త ఎలక్ట్రికల్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఇతడికి గొల్లపూడి, జక్కంపూడి కాలువ రోడ్డులో గోడౌన్ ఉంది. ఇందులో విలువైన వస్తువులున్నాయి. గోడౌన్‌లో సరుకు చోరీకి గురైనట్టు ఆ పారిశ్రామికవేత్త గుర్తించారు. దీంతో గోడౌన్‌కు వెళ్లి పరిశీలించగా ఎలక్ట్రికల్ సామగ్రి భారీగా చోరీకి గురైనట్టు తెలుసుకున్నాడు. దీంతో బాధితుడు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోడౌన్‌లో ఎంత మంది సిబ్బంది పనిచేస్తున్నారన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే సీసీ టీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. దొంగతనానికి పాల్పడిన వారు ఒకేరోజు కాకుండా, పలు దఫాలుగా సరుకును దొంగిలించి కారులో తరలించినట్టు పోలీసులు గుర్తించారు. ఒక వ్యక్తి కారు నడుపుతుండగా, మరో వ్యక్తి రోడ్డుపై కారు వెనుక ఉన్నట్లు, ఓ వ్యక్తి ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతున్నట్టు పోలీసులు గుర్తించారు. గోడౌన్‌లో పనిచేసే సిబ్బందే దొంగతనానికి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. సరుకు సుమారు రూ.30లక్షలకు పైగా చోరీకి గురైనట్టు బాధితుడు పోలీసు అధికారులకు చెప్పినట్టు సమాచారం. గోడౌన్‌లో సరుకు ఏ మేరకు ఉంది, రికార్డుల ప్రకారం ఉందా లేదా, ఎప్పుడెప్పుడు గోడౌన్‌లో ఎగుమతి, దిగుమతి చేశారనే అంశాలను పోలీసు అధికారులు ఆరా తీస్తున్నారు.



ముద్దాడ రవిచంద్ర దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్, ఈవో శీనానాయక్

దుర్గమ్మ సన్నిధిలో సీఎం కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రటరీ ముద్దాడ రవిచంద్ర

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో జరుగుతున్న దసరా మహోత్సవాల్లో భాగంగా గురువారం కాత్యాయనీ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన కనకదుర్గమ్మను ముఖ్యమంత్రి కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రటరీ ముద్దాడ రవిచంద్ర సతీసమేతంగా దర్శించుకున్నారు. దేవదాయ శాఖ కమిషనర్ కే రామచంద్ర మోహన్, దుర్గగుడి ఈవో శీనానాయక్, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు వేద ఆశీస్సులందజేశారు. కే రామచంద్రమోహన్, ఈవో వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

రాజధాని రైతుల ప్లాట్లకు నేడు ఈ-లాటరీ

కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సీఆర్‌డీఏ) పరిధిలో భూ సమీకరణ పథకంలో భూములను సీఆర్‌డీఏకి అప్పగించిన పెనుమాక (జరీబు, మెట్ట), మల్కాపురం (ప్రత్యామ్నాయ ప్లాట్లు) గ్రామ రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించేందుకు 26న శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి విజయవాడ లెనిన్ సెంటర్‌లోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఈ-లాటరీ జరుగుతుంది. 56 మంది రైతులకు 104 ప్లాట్లను ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా కేటాయిస్తారు. వీటిలో 43 రెసిడెన్సియల్ ప్లాట్లు కాగా 41 కమర్షియల్ ప్లాట్లు, 20 ప్రత్యామ్నాయ ప్లాట్లు. రైతులు ఈ లాటరీకి హాజరుకావాలని అధికారులు కోరారు.

రైతుల భూముల స్వాధీనం సరికాదు

● మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

గాంధీనగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరుతో రాష్ట్రవ్యాప్తంగా బడా కార్పొరేట్ సంస్థలకు రైతుల నుంచి బలవంతంగా వారి భూములను స్వాధీనం చేసుకోవడం సరైంది కాదని ఈ విధానాన్ని మానుకోవాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వానికి హితవు పలికారు. ఈ చర్యలపై అన్ని సంఘాలను కలుపుకుని పోరుబాట పడతామన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా పంటలకు ఉపయోగపడని భూములను మాత్రమే పరిశ్రమలకు కేటాయించాలని సూచించారు. రైతు సంఘం సీనియర్ నేత వై కేశవరావు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు పండించిన ఏ పంటకు మద్దతు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కౌలురైతు సంఘం ప్రధానకార్యదర్శి పీ జమలయ్య మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులను అందించడంలో కూటమి ప్రభుత్వం విలమైందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 970 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్వహణకు పీపీపీ మోడల్‌లో ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించడాన్ని తప్పుబట్టారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

చర్చలకు పిలవకపోవడం దారుణం

● విద్యుత్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ కృష్ణయ్య

విజయవాడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ యాజమాన్యం ఈ నెల 15 నుంచి దశల వారీగా ఉద్యమం చేసినప్పటికీ విద్యుత్ యాజమాన్యం చర్చలకు పిలవకపోవడం దారుణమని జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎస్ కృష్ణయ్య అన్నారు. నగరంలోని భవానీపురంలో హరితా హోటల్‌లో గురువారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 26వేల మంది కాంట్రాక్టు కార్మికులున్నారని, వారు 20ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో వెట్టిచాకిరీ చేస్తున్నారని వారిని సంస్థలో విలీనం చేయాలన్నారు.సంస్థలో చేరిన ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, 7,500 మంది జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2లను సంస్థలో విలీనం చేసి, ప్రమోషన్ కల్పించాలని కోరారు. రాష్ట్ర కన్వీనర్ ఎంవీ రాఘవరెడ్డి, కో-చైర్మన్ శేషారెడ్డి 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం గోపాలరావు, 327 యూనియన్ రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్యా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కేసీపీ చెరకు ధర టన్నుకు రూ.3,690

ఉయ్యూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేసీపీ చక్కెర కర్మాగారం ప్రస్తుత సీజన్‌కు చెరకు సరఫరా చేసిన రైతులకు రూ.400 సబ్సిడీతో కలిపి టన్నుకు రూ.3,690 గా ప్రకటించింది. కర్మాగార ఆవరణలో గురువారం చెరకు రైతుల సంఘం సభ్యులతో యూనిట్ హెడ్ యలమంచిలి సీతారామదాస్ నిర్వహించిన సమావేశంలో చెరకు టన్ను ధర ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాంత్రీకరణకు అనువుగా చెరకు సాగుచేసిన రైతులకు టన్నుకు రూ.400 సబ్సిడీతో కలిపి రూ.3,790 చెల్లించనున్నామని ఈ అవకాశం సద్వినియోగం చేసుకుని ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేసి రైతులతో పాటు కర్మాగార అభివృద్ధి తోడ్పడాలన్నారు. 2026-2027 సీజన్‌కు సంబంధించి 2025 నవంబరు నుంచి 2026 ఫిబ్రవరి వరకు నాటే చెరకు మొక్క తోటలకు ఎకరానికి రూ.10వేలు సబ్సిడీగా ప్రకటించారు. సంప్రదాయ పద్ధతుల్లో నాటిన చెరకు తోటలకు టన్నుకు రూ.400 లేదా యాంత్రీకరణ అనువుగా వేసిన తోటలకు టన్నుకు రూ.500 సబ్సిడీ ఇస్తామన్నారు. మొక్కతోటలకు ఎకరాకు రూ.20వేలు, పిలక తోటలకు రూ. 8వేలు వడ్డీలేని రుణం ఇవ్వనున్నామని, ఎకరానికి రూ.10వేల చెరకు మొక్కలు లేదా విత్తనం వడ్డీలేని రుణంగా ఇస్తామన్నారు. రైతు సంఘం అధ్యక్షుడు ఎస్వీ కృష్ణారావు, జొన్నలగడ్డ మోహన్ రెడ్డి, వీ రత్నగిరిరావు, సీహెచ్ పూర్ణచంద్రరావు, తిమ్మారెడ్డి, పులి శ్రీనివాసరావు కేన్ జీఎం పున్నారావు, డీజీఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జగన్ సినిమాకి గత ఎన్నికలే ఎండ్ కార్డు

● గన్నే ప్రసాద్ (అన్న)

వన్‌టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ అరాచక పాలనతో విసుగు చెందిన ప్రజలు గత ఎన్నికల్లో 'జె గ్యాంగ్' బెండు తీసి ఎండ్ కార్డు వేశారని, ఇచ్ఛాపురం నుంచి కుప్పం వరకు అన్ని సెంటర్లలో జగన్ సినిమా అట్టర్ ఫ్లాప్ అయిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న) గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అట్టర్ ఫ్లాప్ సినిమాలకు రీరిలీజ్ ఉండదని, జగన్‌కి మళ్లీ చాన్స్ ఉండదన్నారు. అదేళ్లు దొంగ హామీలతో మోసం చేసి, చివరికి ఓటమి ఎదుర్కొని ఇప్పుడు 'డిజిటల్ బుక్'లతో మాయ చేయాలని ప్రయత్నిస్తున్నాడన్నారు. ఫోన్ వాడని జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు డిజిటల్ బుక్‌తో సాధించేదేమీ లేదన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సమానత్వం, ప్రజాస్వామ్య పరిరక్షణకు టీడీపీ ఎప్పటికీ ముందుంటుందన్నారు.

హంస వాహనంపై సరస్వతిగా మలయప్ప

తిరుమల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన గురువారం ఉదయం చిన్న శేష, రాత్రి హంస వాహనాలపై జగద్రక్షకుడైన శ్రీవేంకటేశ్వర స్వామి తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయంలో ఉదయం నిత్యపూజలు నిర్వహించిన తరువాత మలయప్ప గురువాయూరు శ్రీకృష్ణుడి అవతారంలో ఐదు పడగల చిన్న శేష వాహనంపై ఆశీనులై భక్తులను అనుగ్రహించారు. కాగా, రాత్రి 7 గంటలకు విశేషమైన శ్వేత వస్త్రాలను ధరించి సరస్వతిదేవి అలంకారంతో జ్ఞానమూర్తిగా పురవీధుల్లో ప్రకాశించారు.



హంస వాహనంపై సరస్వతీ దేవిగా దర్శనమిస్తున్న మలయప్ప

కాత్యాయనీ నమోస్తుతే

విజయవాడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ భక్తులకు గురువారం శ్రీ కాత్యాయని దేవిగా దర్శనమిచ్చారు. ఈ ఏడాది ఉత్సవాల్లో ఇది కొత్త అలంకారం. 2016లో ఈ అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. తర్వాత మళ్లీ ఇప్పుడు ఈ అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. సాయంత్రం ఐదు గంటల సమయానికి 62,669 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. 14,730 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. అమ్మవారు శుక్రవారం శ్రీ మహాలక్ష్మీదేవిగా దర్శనమిస్తారు.



కూష్మాండ దుర్గగా భ్రమరాంబిక

» కైలాస వాహనంపై విహరించిన శివపార్వతులు

శ్రీశైలం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం భ్రమరాంబికా దేవి కూష్మాండ దుర్గగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారికి అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అదేవిధంగా కుమారిపూజను నిర్వహించారు. రెండు నుంచి పదేళ్లలోపు బాలికలకు పూలు, పండ్లు, నూతన వస్త్రాలను సమర్పించారు. సాయంత్రం భ్రమరాంబ మల్లికార్జున స్వామివారు కైలాస వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం భ్రమరాంబికా దేవి స్కందమాతగా భక్తులకు దర్శనమిస్తారు. సాయంత్రం స్వామి, అమ్మవారికి శేష వాహనసేవ నిర్వహిస్తారు.





పోలవరం స్పిల్‌వే వద్ద గోదావరి ఉధృతి

నేడు, రేపు భారీ వర్షాలు

» కొన్ని జిల్లాల్లో అతి భారీగా వానలు

» బంగాళాఖాతంలో అల్పపీడనం...నేడు వాయుగుండంగా మార్పు

» రేపు ఉత్తరాంధ్ర, ఒడిశా మధ్య తీరంపైకి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది శుక్రవారం నాటికి వాయుగుండంగా బలపడి, శనివారం ఉదయం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుందని వాతావరణ శాఖ తెలిపింది. వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఇంకొక ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉంది. వీటి ప్రభావంతో గురువారం కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. శుక్ర, శని, ఆదివారాల్లో రాష్ట్రంలో అనేకచోట్ల గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని వాతావరణశాఖ తెలిపింది. శుక్రవారం కోస్తాలోని అన్ని జిల్లాలు, రాయలసీమలో నంద్యాల, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలో భారీవర్షాలు, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. శనివారం ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, గుంటూరు, నంద్యాల, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని తెలిపింది. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు ఈనెల 29 వరకు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

గోదావరిలో 6 లక్షల క్యూసెక్కుల వరద

ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు గోదావరిలో నీటిమట్టం మళ్లీ పెరుగుతోంది. ఉప నదులు గోదావరిలో కలుస్తున్నాయి. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 36.30 అడుగులకు చేరింది. ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 6,09,380 క్యూసెక్కుల వరదను ప్రాజెక్టు 48 గేట్ల నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. పోలవరం స్పిల్‌వే ఎగువన నీటిమట్టం 30.740 మీటర్లు, దిగువన 21.600 మీటర్లుగా నమోదైంది.

సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణ

» గుంటూరులో యూటీఎఫ్ రణభేరిలో ఏపీ జేఏసీ ప్రకటన



ఉద్యమ కార్యాచరణకు సంఘీభావం ప్రకటిస్తున్న విద్యాసాగర్, ప్రసాద్ తదితరులు

గుంటూరు (విద్య), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం అక్టోబరు చివరి వారంలో రాష్ట్రస్థాయిలో విస్తృత సమావేశం నిర్వహిస్తామని ఆ తర్వాత ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని ఏపీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎ.విద్యాసాగర్ వెల్లడించారు. గురువారం గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రణభేరి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల కోసం అర్థించాల్సిన దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వద్ద ఏపీజీఎల్ఐ సొమ్ము రూ.15 వేల కోట్లు ఉందని, మరోవైపు వాటిని పూర్తిస్థాయిలో మంజూరు చేయకుండా ఏడాదికి రూ.450 కోట్లు మాత్రమే ఇస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించకుండా జాప్యం చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. సమస్యల పరిష్కారం కోసం అక్టోబరు 10వ తేదీ వరకు ప్రభుత్వానికి గడువు ఇస్తున్నామని 10 నుంచి 14 వరకు రాష్ట్ర వ్యాప్తంగా చలో ఎమ్మెల్యే కార్యక్రమానికి శ్రీకారం చుడతామన్నారు. అనంతరం మండల, తాలూకా, జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు, ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం అక్టోబరు 27 నుంచి 31 వరకు రాష్ట్రస్థాయిలో రిలే దీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

మద్యం మత్తులో తల్లిని చంపిన కొడుకు

బాపట్ల రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): డబ్బులివ్వలేదని మద్యం మత్తులో తల్లిని హతమార్చాడో కుమారుడు. బాపట్ల రూరల్ పోలీసుల కథనం ప్రకారం పూండ్ల గ్రామంలో పి.రమణమ్మ(45) అనే మహిళ పంచాయతీ పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తోంది. ఆమె కొడుకు జాలయ్య మద్యం తాగి వచ్చి డబ్బులు అడగ్గా ఇచ్చేందుకు నిరాకరించింది. జాలయ్య కోపంతో ఇంట్లో ఉన్న ఇనుప కడ్డీతో తలపై కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఏయూలో విద్యార్థి మృతి

సకాలంలో చికిత్స అందకపోవడమే కారణమని విద్యార్థి సంఘాల ఆందోళన

» వర్సిటీ ప్రధాన ద్వారం ఎదుట బైఠాయింపు

» వీసీ చాంబర్‌లోకి దూసుకెళ్లిన విద్యార్థులు

» రాజీనామా చేయాలని డిమాండ్, నేడు బంద్‌కు పిలుపు



వింజమూరి వెంకట సాయి మణికంఠ



క్యాంపస్‌లో సమస్యలపై వీసీ రాజశేఖర్‌ను ప్రశ్నిస్తున్న విద్యార్థులు

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం హాస్టల్‌లో ఓ విద్యార్థి సకాలంలో చికిత్స అందక గురువారం ఉదయం మరణించాడు. దీనిపై అధికారులు సరిగ్గా స్పందించకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. తమ సమస్యలు పట్టించుకోని వైస్ చాన్సలర్ రాజశేఖర్ రాజీనామా చేయాలంటూ ఆయన చాంబర్‌లోకి దూసుకువెళ్లారు. ఈ ఆందోళన రాత్రి 7.30 గంటల వరకూ కొనసాగింది. శుక్రవారం యూనివర్సిటీ బంద్‌కు విద్యార్థి సంఘ నాయకులు పిలుపునిచ్చారు. వివరాలు.. విజయనగరానికి చెందిన వింజమూరి వెంకట సాయి మణికంఠ (25) యూనివర్సిటీలో బీఈడీ రెండో సంవత్సరం చదువుతూ క్యాంపస్‌లోని శాతవాహన హాస్టల్‌లో ఉంటున్నాడు. గురువారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో బ్రష్ చేసుకోవడానికి వాష్‌రూమ్‌కు వెళ్లి జారి పడిపోయాడు. గుర్తించిన తోటి విద్యార్థులు వెంటనే యూనివర్సిటీ ఆవరణలో ఉన్న డిస్పెన్సరీకి ఫోన్ చేసి అంబులెన్స్‌ను రప్పించారు. తనకు ఊపిరి అందడం లేదని, ఆక్సిజన్ పెట్టాలని మణికంఠ కోరాడు. అయితే అంబులెన్స్‌లో ఆ ఏర్పాట్లు లేకపోవడంతో అక్కడి నుంచి కింగ్ జార్జి ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే అతను మరణించినట్టు వైద్యులు తెలిపారు. వెంటనే ఆక్సిజన్ పెట్టి ఉంటే చనిపోయేవాడు కాదని తెలిపారు. మణికంఠ ఆక్సిజన్ అందకే చనిపోయాడని వైద్యులు చెప్పడంతో విద్యార్థులు వర్సిటీ ప్రధాన గేటు వద్ద మధ్యాహ్నం మూడు గంటలకు ఆందోళనకు దిగారు. సుమారు 18 సార్లు ఈ సమస్య వీసీ దృష్టికి తీసుకువెళ్లామని, ఆయన పట్టించుకోలేదని, తక్షణమే ఆయన పదవికి రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. మణికంఠ కుటుంబానికి న్యాయం చేయాలని, రూ.కోటి పరిహారం ఇవ్వాలని కోరారు. వీసీ రాజశేఖర్ అక్కడికి వచ్చి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి వెళ్లిపోయారు. విద్యార్థి నాయకులు దీనికి సంతృప్తి చెందకపోవడంతో సుమారు 50 మంది విద్యార్థులు వీసీ చాంబర్‌లోకి దూసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో వారిని ప్రొఫెసర్లు, పోలీసులు అడ్డుకొని వీసీకి రక్షణ కల్పించారు. విద్యార్థులు రాత్రి ఏడు గంటలకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి మణికంఠకు నివాళి అర్పించారు.

కేజీహెచ్‌కు సీబీఐ

బెంగాల్ విద్యార్థిని మృతిపై విచారణ

» వైద్యులను మూడు గంటలు ప్రశ్నించిన అధికారులు



విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు వచ్చిన సీబీఐ అధికారులు

విశాఖపట్నం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్ విద్యార్థిని మృతిపై దర్యాప్తు నిమిత్తం ఢిల్లీ నుంచి సీబీఐ అధికారులు కింగ్‌జార్జి ఆస్పత్రి(కేజీహెచ్)కి వచ్చారు. సీబీఐ అధికారి దినేష్‌తోపాటు మరొకరు గురువారం ఉదయం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణి ఛాంబర్‌కు వెళ్లి..తాము వచ్చిన పనిని వివరించారు. 2023లో నరసింహనగర్‌లోని 'ఆకాష్-బైజూస్' కళాశాలలో పశ్చిమ బెంగాల్ విద్యార్థిని(17) చేరారు. దొండపర్తిలో కళాశాల హాస్టల్‌లో ఉండే ఆమె ఆ ఏడాది ఆగస్టు 14న హాస్టల్ భవనం పైనుంచి కింద పడ్డారు. హాస్టల్ సిబ్బంది రామ్‌నగర్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా 17న మరణించారు. మృతదేహానికి కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించారు. మృతురాలి తండ్రి పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి ఫిర్యాదు చేయడంతో అక్కడి సీఐడీ అధికారులను ఆమె విచారణకు ఆదేశించారు. తర్వాత ఈ కేసును సీబీఐకి అప్పగించారు. దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించిన ఆరుగురు వైద్యుల బృందాన్ని విచారించేందుకు గురువారం వచ్చారు. పోస్టుమార్టం నివేదికపై సంతకాలు చేసిన న్యూరోసర్జరీ, జనరల్ మెడిసిన్, అనస్థీషియా, కార్డియాలజీ, ఫోరెన్సిక్ సైన్స్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్ విభాగాల వైద్యులను విచారించారు. ఆరు విభాగాల వైద్యులకుగానూ మూడు విభాగాల వైద్యులు మాత్రమే అందుబాటులో ఉండడంతో వారినే సుమారు మూడు గంటల పాటు ప్రశ్నించి వెళ్లిపోయారు.

కడప మేయర్ సురేశ్‌బాబు తొలగింపు

» డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగంకు ఇన్‌చార్జి బాధ్యతలు


» ఉత్తర్వులు రద్దుకు హైకోర్టును ఆశ్రయించిన మాజీ మేయర్

» కౌంటర్ దాఖలుకు ఆదేశం, విచారణ 7కి వాయిదా



ముంతాజ్ బేగం

కడప ఎర్రముక్కపల్లె/అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవి నుంచి కె.సురేష్‌బాబును ప్రభుత్వం తొలగించింది. ఈ మేరకు పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. కొత్త మేయర్ బాధ్యతలు చేపట్టే వరకు డిప్యూటీ మేయర్ ఎస్.ముంతాజ్ బేగం ఇన్‌చార్జి మేయర్‌గా వ్యవహరించాలని ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు.. తనను మేయర్ బాధ్యతల నుంచి తొలగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ మాజీ మేయర్ సురేశ్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు గురువారం విచారణ జరిపింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. వ్యాజ్యంపై తదుపరి విచారణను అక్టోబర్ 7వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.



దుర్గా నవరాత్రులు

నేటి అలంకారం

శ్రీ మహాలక్ష్మీ దేవి

ఆశ్వయుజ శుద్ధ చవితి, శుక్రవారం



శరన్నవరాత్రి మహోత్సవాల్లో అయిదో రోజున శ్రీ మహాలక్ష్మీ దేవిగా విజయవాడ కనకదుర్గమ్మ దర్శనమిస్తారు. మంగళప్రదమైన దేవత మహాలక్ష్మీదేవి. మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అనే రూపాల్ని ధరించి, ఆదిపరాశక్తి దుష్ట రాక్షస సంహారం చేసిందనీ, క్షీరాబ్ది పుత్రికగా అవతరించిన లక్ష్మీదేవి డోలాసురుడనే రాక్షసుడ్ని సంహరించిందని పురాణాలు చెబుతున్నాయి. రెండు చేతుల్లో కమలాలు ధరించి, అభయ, వరద హస్త ముద్రలను ప్రదర్శిస్తూ... గజరాజు సేవిస్తుండగా శ్రీమహాలక్ష్మి భక్తులను అనుగ్రహిస్తుందని పెద్దలు చెబుతుంటారు. ఆమెను పూజించడం వల్ల దరిద్రం, దుఃఖాలు తొలగిపోయి సకల శుభాలు కలుగుతాయన్నది భక్తుల నమ్మిక. లోక స్థితికారిణిగా ధన, ధాన్య, ధైర్య, విజయ, విద్య, సౌభాగ్య, సంతాన, గజలక్ష్ములుగా వరాలు ప్రసాదించే అష్టలక్ష్మి సమష్టి రూపమైన అమృత స్వరూపిణి మహాలక్ష్మీదేవిగా దుర్గమ్మను దర్శించుకోవడం సంప్రదాయం. అమ్మవారిని మహాలక్ష్మి రూపంలో అర్చిస్తే ధన, కనక, వస్తు, వాహన ప్రాప్తి కలుగుతుందనీ, సుఖ సంతోషాలు చేకూరుతాయనీ విశ్వాసం.

నైవేద్యం: రవ్వకేసరి, గారెలు, చిత్రాన్నం, పాయసం

అలంకరించే చీర రంగు: ఎరుపు

అర్చించే పూల రంగు: తామర పుష్పాలు

పారాయణ చెయ్యాల్సినవి: లక్ష్మీ స్తోత్రాలు

పర్వదినం

అన్నిటా అమ్మే! అందరూ ఆమే!

మన మాతృమూర్తులు తొమ్మిది నెలలపాటు గర్భాన్ని మోసి, పదవ నెలలో మనల్ని కన్నారు. ఆ తొమ్మిది నెలలూ ఎన్నెన్నో క్రిమి కీటకాలు తమను పీడిస్తూ ఉంటే ఆ బాధను తట్టుకున్నారు. లలితాంబిక ఈ లోకపు అమ్మలా కాకుండా... నెలకు ఒక్క రోజును సంకేత రూపంగా పెట్టుకొని, తొమ్మిది రాత్రుల పాటు రాక్షసులతో పోరాడి, పదవ రోజున విజయ దశమిని చేసుకుంది. అందుకే అవి నవ రాత్రులు. వాటి తరువాతిదైన పదవ రోజే అమ్మ విజయాన్ని సాధించినదైన విజయ దశమి అయింది. ఆ అమ్మ ఏ కష్టాలను ఎవరి ద్వారా తీరుస్తూ... సర్వారాధ్యురాలు ఎలా అయిందో తెలుసుకుందాం.



అక్టోబర్ 2న విజయదశమి

ఎవరైనా రోగి అనారోగ్యంతో వైద్యుడి దగ్గరకు వెళితే... ఆ రోగికి ఉండే లక్షణాలన్నిటినీ విని, ఏ వ్యాధి నివారణకు అది అవసరమో ఆలోచించి, అనుగుణమైన ఔషధాన్ని ఇస్తాడు. అలాగే అమ్మ ఈ ముల్లోకాలలో ఉండే అందరికీ ఎన్ని ఆపదలు వస్తాయో ఆలోచించింది. వేయి సమస్యలు ఉంటాయని ఆమెకు అర్థమయింది. దాంతో ఆ లలితాపరాభట్టారిక (లలితాదేవి) తన వద్ద ఉంటూ, తన ప్రతి కదలికనూ గమనిస్తున్న ఎనిమిది మందిని పిలిచింది (వారిలో మొదటి ఆమె పేరు వశిని. అందుకే ఆ ఎనిమిది మందిని వశిన్యాది వాగ్దేవతలు అంటారు). వేయి ఆపదలకు వేయి నామాలను సిద్ధం చేయాల్సిందిగా వారిని ఆజ్ఞాపించింది. అంతటి గొప్ప అవకాశం తమకు లభించిందన్న మహదానందంతో... అమ్మ రూప సౌందర్యాన్ని, అమ్మ మంత్ర రూపాన్ని, అమ్మ యుద్ధం చేసే విధానాన్ని, అమ్మ తన భర్త అయిన శివుడితో మెలిగే పద్ధతినీ, గర్భంతో ఉన్న మహిళ ఏయే ఆహారాలను ఏయే నెలలో తింటే ఉత్తమ శిశువు కలుగుతుందో ఆ ఆహార నియమాలను... ఇలా ఒక్కో విభాగానికి వందేసి నామాలతో... మొత్తం పది విభాగాలకు వేయి నామాలను ఆ వశిన్యాది వాగ్దేవతలు సిద్ధం చేశారు. దేవతల నిండు సభలో... ఆ వేయి నామాలను చదవాల్సిందిగా ఆదేశించింది. వాటన్నిటినీ తనతోపాటు సకల దేవతాగణం విన్నాక... 'ఇదం నామ సహస్రమ్మే యో మద్భక్తః పఠేత్ సకృత్'... ఈ వేయింటిని మాత్రమే (అంటే మరికొందరు కూడా వేయి నామాలను సిద్ధం చేశారన్నమాట) ఎవరైతే పఠిస్తారో, వారి కోర్కెలన్నిటినీ శ్రద్ధతో తీరుస్తానని ప్రకటించింది. లలితా సహస్ర నామాలు అంతటి గొప్పవి. ఏ తీరు కష్టం ఏ రూపంలో, ఎంత పరిమాణంలో వచ్చినా... ఈ వేయి నామాలే దివ్యౌషధాలని అమ్మే స్వయంగా చెప్పింది. అందుకే మరెవరినో, ఇంకెవరినో ధ్యానించనక్కరలేదు. వాంఛితం నెరవేరడానికి లలితా నామాలు చాలు. ఎందరెందరు దేవతలు ఆ నామాల్లో దాగి ఉన్నారో పరిశీలిద్దాం.

ఇతర దేవతల పూజ ఎలా?

'మా బిడ్డలకు చదువు రావాలి కదా! లలితా సహస్ర నామాలు మాత్రమే చదువుతూ ఉంటే అదెలా సాధ్యం?' అనుకుంటారు ఎంతోమంది. తన వేయి నామాల్లో ఉన్న విషయాన్ని చూపిస్తూ, "ఆ సరస్వతి తన రూపమే" అంటూ 'సరస్వతీ శాస్త్రమయీ గుహాంబా గుహ్యరూపిణీ' అని తన వేయి నామాల్లో (137వ శ్లోకం) ఉందని కాబట్టి తనను ఆరాధిస్తే మరిక సరస్వతిని ఆరాధించనక్కర్లేదని ఆ లలితాంబికే చెప్పింది. ఇక, 'చదువు బాగా వచ్చాక కూడా ఆదాయం లేకపోతే ఈ లలితా నామాలు ఏం రక్షిస్తాయి?' అని బాధ పడనక్కర్లేదు. 'మహేశ్వరీ మహా దేవీ మహాలక్ష్మీ ర్మృడ ప్రియా' (53వ శ్లోకం) ఉంది. "మేము కొన్ని తరాల నుంచి పార్వతీ దేవిని ఆరాధిస్తే తప్ప ఏ కార్యానికీ పసుపు దంచనైనా దంచబోమ"ని ఎవరైనా అడిగితే... 'పార్వతీ పద్మనయనా పద్మరాగ సమప్రభా' అంటూ పార్వతి కూడా తనలో అంతర్లీనంగా ఉన్న రూపమేనని గుర్తించాలని చెబుతోంది లలితమ్మ. "మేము పూర్తిగా విష్ణు భక్తులం. మా పెద్దలు కూడా నారాయణుణ్ణే సేవించండి, పొరపాటున కూడా లలితా నామాలు చదవవద్దని మమ్మల్ని శాసించారు"ని అన్నారనుకోండి... 'గోప్త్రీ గోవింద రూపిణీ' (63వ శ్లోకం) అనే ఆధారం ఉంది... ఆ నారాయణుడు కూడా లలితాంబ రూపమేనని. 'శైవ విధానాన్ని పాటించే మేము ఉమాదేవి ఆరాధకులం, ఆ ఉమా నామాలు ఎక్కడున్నాయి?" అని కంగారు అవసరం లేదు. ఉమాదేవి కూడా లలితా రూపాల్లో ఒకటేనంటూ 'ఉమా శైలేంద్ర తనయా గౌరీ గంధర్వ సేవితా' (126వ శ్లోకం) అనే సాక్ష్యం ఉంది. ఉద్యోగం, ధనాదాయం లేని వారు లలితా దేవిని పూజిస్తే అవి ఎలా లభిస్తాయనే ప్రశ్నకు 'రాజ్యలక్ష్మీ కోశనాథా చతురంగ బలేశ్వరి' (135వ శ్లోకం) అనే ప్రమాణం ఉంది. 'బ్రహ్మోపదేశ సమయంలో చెప్పిన గాయత్రిని పఠించకపోతే ఎలా?' అనుకోనక్కర్లేదు. 'గాయత్రీ వ్యాహృతీ స్సంధ్యా ద్విజ బృంద నిషేవితా' (90వ శ్లోకం) అని అమ్మవారే స్వయంగా చెబుతోంది. లక్ష్మీ, సరస్వతుల్లో ఎవరిని ఎక్కువగా లలితాంబిక పరిగణిస్తోంది? (సచామర రమావాణీ సవ్య దక్షిణ సేవితా...) అమ్మవారికి కుడివైపున సరస్వతి, ఎడమవైపున లక్ష్మి వింజామరలు వీస్తూ కనిపిస్తున్నారు. కుడి ఎడమల్లో కుడికే ప్రాధాన్యం కాబట్టి సరస్వతే గొప్పదని అర్థమవుతోంది. అంటే ధనం కన్నా విద్యకు, జ్ఞానానికే ప్రాధాన్యం.

సర్వదేవతా సమూహ రూపం

"శ్రీ మహా విష్ణువు ప్రసిద్ధంగా దశావతారాలను, మొత్తం మీద 21 అవతారాలను ఎత్తాడు కదా! ఆ రాముణ్ణి, కృష్ణుణ్ణి, లక్ష్మీ నరసింహ స్వామిని... ఇలా వీరెవరినీ పూజించకుండా, లలితా నామాలను చదువుకుంటూ ఎలా కూర్చుంటాం?" అని అడిగితే 'కరాంగుళి నఖోత్పన్న నారాయణ దశాకృతిః' (32వ శ్లోకం) అని అమ్మ స్వయంగా చెబుతోంది. అంటే 'అమ్మ చేతి గోటి నుంచి పుట్టినవే నారాయణావతారాలన్నీ' అని అర్థం. అన్నిటికన్నా... 'శివుణ్ణి పూజించకుండా లలితా నామాల వెంట పడితే ఎలా?' అనుకోనక్కర్లేదు. 'శ్రీ శివా శివ శక్త్యైక్య రూపిణీ' (183వ శ్లోకం) అని కనిపిస్తుంది లలితా సహస్ర నామాల చివరిలో. అంటే ఎందరెందరు స్త్రీ పురుష దేవతలు జగత్తును, దానిలో ఉన్న సర్వప్రాణులను రక్షించడానికి ఉన్నారో... ఆ అందరూ లలితలోనే ఉన్నారు. లలితాంబను ఆరాధిస్తే... మీరు ఎవరిని ఆరాధించదలచుకున్నారో వారందరూ ఆరాధనలు పొందినట్టే. 'లలిత సర్వదేవతా సమూహ రూపం' అని దీని అర్థం. ఈ నవరాత్రుల కాలంలో లలితా నామాలను 108 సార్లు పఠిస్తే వాంఛితాలు నెరవేరుతాయనేది శాస్త్ర వాక్యం.

• డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు
9866700425

హరేకృష్ణ

మనలోని రావణులను సంహరిద్దాం!

భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో విజయదశమి లేదా దసరా పర్వదినం అత్యంత ప్రముఖమైనది. 'దశ' అంటే పది. 'హరా' అంటే సంహరించడం. అంటే పది తలల రావణాసురుణ్ణి శ్రీరామచంద్రుడు సంహరించడం. దుష్ట శక్తులపై దైవ శక్తి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి. అంతేకాదు, ద్వాపర యుగంలో పన్నెండేళ్ళ వనవాసం, ఒక ఏడాది అజ్ఞాతవాసం పూర్తి చేసి, విరాటరాజు కొలువులోకి వెళ్ళేముందు... పాండవులు తమ ఆయుధాలను శమీ వృక్షం (జమ్మి చెట్టు)పై దాచిపెట్టారు. గోవులను అపహరించిన కౌరవులపై యుద్ధానికి మళ్ళీ ఆ అస్త్రాలను చేతపట్టి విజయం సాధించారు. ఆ విధంగా పాండవులు తమ ఆయుధాలను తిరిగి పొందిన రోజు... దసరాకు ముందురోజే కావడంతో... వివిధ వృత్తులవారు తమ వృత్తులకు తోడ్పడుతున్న పనిముట్లను, గృహస్తులు తమ ఇళ్ళలోని సామగ్రిని గుర్తించి, సమీక్షించుకొనే రోజుగా... ఆయుధపూజగా సంప్రదాయంలో అంతర్భాగం అయింది.



శ్రీరాముని సందేశం

దుర్మార్గులను శాస్త్రం ఆరు రకాలుగా పేర్కొంది. వారు: విషం పెట్టేవాడు, ఇంటికి నిప్పు పెట్టేవాడు, మారణాయుధాలతో దాడి చేసేవాడు, ఇతరుల ధనాన్ని దోచేవాడు, ఇతరుల స్థలాన్ని ఆక్రమించేవాడు, పరుల భార్యను చెరపట్టేవాడు. అలాంటి దుర్మార్గులను శ్రీప్రమే తగిన విధంగా శిక్షించడం కూడా రాజు విధులలో భాగం అని శాస్త్రం వివరించింది. కుమారుడిగా, సోదరుడిగా, భర్తగా, ప్రభువుగానే కాదు... మామూలు మనిషిగా తోటివారి పట్ల ఉండాల్సిన మానవీయత, ఉన్నత సంస్కారం కలిగినవాడే శ్రీరాముడు. అందుకే నేటికీ మనందరం మళ్ళీ అటువంటి రామ రాజ్యం కోసం తహతహలాడుతూ ఉంటాం. సీతాదేవిని అపహరించిన రావణుడు... శ్రీరాముని పట్ల దుర్మార్గాన్ని ప్రదర్శించిన కారణంవల్లనే... ప్రపంచ చరిత్రలో అసమానమైన విధంగా అతడికి గుణపాఠం చెప్పవలసి వచ్చింది. రావణుడు సైతం తపోసంపన్నుడు, పరమశివుడికి భక్తుడు అయినప్పటికీ... తన శక్తులను సద్వినియోగపరచుకోలేకపోయాడు. మానవ జీవిత లక్ష్య సాధనకు ధర్మాధర్మాల విచక్షణ, వాటి అవలంబించడం ఎంత ముఖ్యమైనవో రావణ సంహారం ద్వారా లోకానికి సందేశమిచ్చారు శ్రీరామచంద్ర ప్రభువు.

మనమేం చేయాలి?

ప్రస్తుత కాలంలో సమాజం కేవలం రావణుడి దిష్టిబొమ్మ దహనం చేయడంతో సరిపెట్టకుండా... మన మనస్సులోని కామ, క్రోధ, మోహ, లోభాలనే అంతర్గత రావణులను సంహరించడానికి ప్రయత్నించాలి. విజయదశమి జ్ఞాన సంపాదనకు మంచి రోజు. ఈ పండుగ నేపథ్యంలో గొప్ప మార్పును పొందడానికి శ్రీకారం చుట్టాలి. భగవద్గీత బోధించిన విధంగా, ప్రామాణిక గురుశిష్య పరంపరద్వారా... ఆధ్యాత్మిక జ్ఞానాన్ని నిత్యం అభ్యసించడం అనే కొత్త అలవాటును యువతరం ప్రారంభించాలి. మనస్సులోని కల్మషాల కారణంగానే మనస్సు శత్రువు అవుతుంది. పరిశుద్ధమైనప్పుడు మనస్సే ఒక మంచి మిత్రుడు కూడా. కపటం, కల్మషాల నుంచి మనస్సు విముక్తి పొందడానికి కలియుగంలో నిర్దేశించినదే 'హరేకృష్ణ' మహామంత్రం. కల్మష భూయిష్టమైన ఈ యుగానికి శాస్త్రం నిర్దేశించిన 'హరినామం' అనే దివ్యౌషధాన్ని ప్రతి ఒక్కరూ సేవించేలా రూపకల్పన చేసిన మహావదాన్యులు శ్రీ చైతన్య మహాప్రభువులు. ఆనాడు లోకంలో అనర్థాలను సృష్టించిన రావణాదులను రామబాణం దహించివేయగా, నేడు మనలో అనర్థాలను సృష్టించే కామ, క్రోధ, లోభాదులను రామనామమే దహించివేయగలదు.

• శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షులు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9640086664



విశేషం

విశ్వశక్తి బతుకమ్మ

వేదకాలం నుంచి విశ్వాన్ని ఆరాధించే సంప్రదాయం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ఈ విషయాన్ని ఋగ్వేదం 'ఓం తత్ సత్' అని చెబుతోంది. ప్రకృతి, సృష్టి, స్త్రీశక్తి కలిసి 'విశ్వశక్తి' అనే భావన ఏర్పడింది. ఆ భావనే తరువాతి కాలంలో దుర్గ, కాళి, పార్వతి, లక్ష్మి, సరస్వతి రూపాలలో అభివృద్ధి చెందింది. బతుకమ్మ పండుగ 'విశ్వశక్తి' ఆరాధనకు ప్రతీకగా నిలుస్తోంది.

బతుకమ్మ పండుగ శక్తి ఆరాధనకు సంబంధించినది. ఆదిమవాసుల ఆరాధన మూలాల్లోకి వెళితే... ఆదిమ రాతి యుగం నుంచే నాటి ప్రజలు సూర్యుడు, చంద్రుడు, అగ్ని, నీరు లాంటి ప్రకృత శక్తులను ఆరాధించేవారు. ఈ విధంగా విశ్వశక్తిని ఆరాధించడం నాగరికతతో సమానంగా అభివృద్ధి చెందింది. అన్ని నాగరికతలలోనూ విశ్వశక్తి ఆరాధన కనిపిస్తుంది. ప్రకృతి ఆరాధన, అగ్ని ఆరాధన, పూల ఆరాధన దీనిలో భాగంగా ఉండేవి. ఈ క్రమంలో 'జీవశక్తి' (బతుకు అమ్మ) అనే భావన ఏర్పడి, ఆ తరువాత అది బతుకమ్మ పండుగగా మారి ఉండవచ్చు.

ప్రకృతి, ఆరోగ్యం, ఆధ్యాత్మికతకు ప్రతీకలు

శక్తి ఆరాధనలో భాగంగా ఆదివాసులు గౌరమ్మ, గంగమ్మ, మైసమ్మ, పోలేరమ్మ తదితర దేవతలను పూజించేవారు. ఇవన్నీ వాస్తవానికి నేల తల్లికి, ప్రకృతి శక్తికి ప్రతీకలు. జానపదులు తమ ఆచారంలో భాగంగా... పూజ సమయంలో డప్పులు, తాళాలు వాయించడం, చప్పట్లు కొట్టడం లాంటి శబ్దాల ద్వారా శక్తిని కొలిచేవారు. సామూహికంగా గీతాలు పాడుతూ, వలయం వేసి నృత్యం చేస్తూ విశ్వశక్తిని స్తుతించేవారు. బతుకమ్మ పండుగ పూర్తి ఆచారాలను గమనిస్తే ఇవన్నీ కనిపిస్తాయి. బతుకమ్మ పండుగలో ఉపయోగించే పువ్వులు కూడా విశ్వశక్తికి ప్రతీకలే. ఆదిమవాసులు వాటిని కేవలం అందం కోసం కాకుండా ప్రకృతిశక్తి, ఆరోగ్యం, ఆధ్యాత్మికతలకు ప్రతీకలుగా పూజించారు. పసుపు రంగు కలిగిన తంగేడు పువ్వు సూర్యశక్తికి, జీవ ప్రకాశానికి ప్రతీక. గుమ్మడి జీవనాధారమైన ఆహారం కాబట్టి దాని పువ్వు పవిత్రమైనది. ఆహార భద్రత, జీవన స్థిరత్వం, పంటల శక్తికి ప్రతీక. ఇక బతుకమ్మలో ప్రధానంగా ఉపయోగించే బంతి పువ్వు... సృష్టి శక్తికి, పంటల సృష్టికి, దీర్ఘకాలం వాడిపోని పువ్వు కాబట్టి దీర్ఘాయుష్షుకు, స్థిరత్వానికి, శక్తి నిలకడకు ప్రతీక. బతుకమ్మలో ఉపయోగించే పూలలో చాలా వరకూ ఆదిమవాసులు అడవిలో లభించే ఔషధ గుణాలున్న గునుగు, గుమ్మడి, తంగేడు పూలను సేకరించి, దేవతకు సమర్పించేవారు.

బిందు రూపిణి

విశ్వానికి ఆది రూపం బిందువు. బిందువును సృష్టికి మూలంగా పరిగణిస్తారు. బతుకమ్మను పువ్వులతో పొరలుగా పేర్చి, చివరిలో చిన్న పువ్వు లేదా గుమ్మడి పువ్వు లేదా గౌరమ్మను బిందువులా ఉంచుతారు. అది జీవన శక్తి కేంద్రం, విశ్వశక్తికి బిందువు ప్రతీక. అందుకే బతుకమ్మను శ్రీచక్రంతో పోలుస్తారు. శ్రీచక్రంలో ఉన్న బిందువును విశ్వశక్తి కేంద్రంగా భావిస్తారు. విజ్ఞాన దృష్టితో చూస్తే బిందువును శక్తి కేంద్రంగా కూడా భావించవచ్చు. విశ్వంలో శక్తి అంతా ఒకే కేంద్రీకృత బిందువులో ఉందని ఆధునిక సైన్స్ కూడా చెబుతోంది. బతుకమ్మ కూడా శక్తి కేంద్రీకృత బిందు రూపమే. పూలతో అల్లిన రూపం పై నుంచి చూస్తే... బతుకమ్మ గుండ్రని బిందువులా కనిపిస్తుంది. మధ్యలో జీవన శక్తిని సూచించే పూలు ఉంచుతారు. ఒక బిందువు విస్తరించి విశ్వం అవుతుంది. తిరిగి అదే బిందువులో లీనమవుతుంది. బతుకమ్మ పూలను ఒక్కొక్కటీ జోడించి గోపురంలా పేర్చుతారు. చివరకు ఆ పూలన్నీ నీటిలో కలిసిపోయి, రేపటి పునఃసృష్టికి మూలం అవుతాయి. బతుకమ్మ పువ్వుల పుట్టుక, వికాసం, వాడిపోవడం, చివరకు లీనం కావడం... ఇదంతా జీవన చక్రాన్ని సూచిస్తుంది.

ద్రవిడ సంస్కృతి మూలాలు

ద్రవిడ సంస్కృతి దక్షిణ భారతదేశంలో ఏర్పడిన అత్యంత ప్రాచీన సంస్కృతుల్లో ఒకటి. ఇది కేవలం భాష, సంప్రదాయాలనే కాదు, మానవ జీవన విధానాన్ని, ఆచారాలను, ఆరాధనా విధానాలను సూచిస్తుంది. పోచంపల్లి, నాగార్జున కొండ, పిఠాపురం, ధూళికట్ట లాంటి ప్రదేశాల్లో దొరికిన ఆదిమ రాతియుగం, కొత్త రాతియుగం నాటి అవశేషాలు ద్రవిడ సంస్కృతి మూలాలను చూపిస్తున్నాయి. మాతృదేవతా పూజ ద్రవిడుల ప్రధాన ఆరాధన. 'బతుకమ్మ' అంటే 'జీవించి ఉండు తల్లి' అని అర్థం. ఇది మాతృ శక్తి ఆరాధన. ప్రతి గ్రామంలో, ప్రతి ఇంటిలో మాతృదేవత... బతుకమ్మ రూపంలో పూజలు అందుకుంటుంది. బతుకమ్మ పండుగలో... గునుగు, బంతి, చామంతి, తంగేడు, గున్నెమల్లె లాంటి పూలను ఉపయోగిస్తారు. ద్రవిడ సంప్రదాయంలో ఇది ప్రకృతి శక్తి పూజకు ప్రతీక. బతుకమ్మ పండుగ కోసం పూల సేకరణ మొదుకొని బతుకమ్మను సాగనంపేవరకూ ప్రతిదీ ప్రకృతి ఆరాధనతో ముడిపడి ఉంది. అలాగే బతుకమ్మ పాటల్లో అమ్మవారి శక్తిని, ప్రకృతిని వర్ణించడం, గ్రామ సంప్రదాయాలు, పాడి పంటల ఆనందం, బలి అయిన స్త్రీల చరిత్రలు, బతుకమ్మ పుట్టుపూర్వోత్తరాల కథల్లాంటివి ఉంటాయి. గ్రామీణ మహిళలు తమ స్వానుభవంతో మౌఖికంగా ఈ పాటలు అల్లుకొని, చప్పట్లు కొడుతూ, బతుకమ్మ చుట్టూ తిరుగుతూ ఆశువుగా పాడుకుంటారు. ద్రవిడ సంస్కృతిలో సృష్టికి మూలం స్త్రీశక్తి అనే భావన ఉంది. బతుకమ్మ పండుగలో అది కొనసాగుతోంది. బతుకమ్మను స్త్రీశక్తికి ప్రతీకగా,



ముగ్గురమ్మల మూలపుటమ్మగా కొలుస్తారు. ఈ పండుగలో మహిళల భాగస్వామ్యమే ఎక్కువ. కాలక్రమేణా ఎన్ని మార్పులు చోటు చేసుకున్నప్పటికీ, బతుకమ్మ పండుగకు మూలమైన విశ్వశక్తి ఆరాధన, ద్రవిడ సంస్కృతి మూలాలు బలంగా నిలిచే ఉన్నాయి. ఇంతటి ఘనమైన ఈ వేడుకలపై ఆధునిక పోకడలు రుద్దకుండా... ప్రాచీన సంస్కృతి మూలాలను కాపాడుకుందాం.

• డాక్టర్ శారదా హన్మాండ్లు, 9912275801

ఆ చిక్కుల్లోంచి బయట పడదాం!

మన అంతర్గత సూక్ష్మ నాడీ వ్యవస్థలో... ఆరోగ్యాన్ని సంరక్షించే ఇడా, పింగళ, సుషుమ్న నాడులు, వాటికి అనుసంధానమై ఉండే బ్రహ్మ, విష్ణు, రుద్ర గ్రంధుల పాత్ర చాలా కీలకం. అవి శారీరకంగా, ఆధ్యాత్మికంగా అనేక విధులు నిర్వహిస్తాయి. శ్రీ లలితా సహస్రనామాలలో వీటి ప్రస్తావన ఉంది. వాటిలో లలితాదేవిని 'బ్రహ్మ గ్రంధి విభేదిని', 'విష్ణు గ్రంధి విభేదిని', 'రుద్ర గ్రంధి విభేదిని' అని స్తుతించడం జరిగింది. మానవులు వారి స్వభావాన్ని బట్టి, తీరును బట్టి మూడు విధాల చిక్కు సమస్యల్లో ఉంటాయి. వారు పుట్టినప్పటి నుంచే ఈ చిక్కు ముడులు ప్రారంభమవుతాయి. వాటి నుంచి బయట పడాలంటే ఆ ముడులను ఛేదించాలి. వాటిని సంస్కృతంలో గ్రంథులు అంటారు. అవి మనలో అసంబద్ధమైన, అసత్యమైన భ్రమలను కలిగిస్తాయి. శరీరపరంగా చూస్తే... మన సూక్ష్మ శరీర వ్యవస్థలో దాదాపు అన్ని చక్రాలకు లేదా శక్తి కేంద్రాలకు ఏదో ఒక గ్రంధి అనుసంధానమై ఉంటుంది. బ్రహ్మ, విష్ణు, రుద్ర గ్రంధులు ఏయే నాడులకు అనుసంధానమై ఉన్నాయో, వాటిని ఏవి నియంత్రిస్తున్నాయో తెలుసుకుందాం.



సహజయోగ

అది భగవంతుడికే సాధ్యం

బ్రహ్మ గ్రంధి ఇడా నాడికి అనుసంధానమై ఉంటుంది. ఈ నాడి లక్షణం తమోగుణం. గతాన్ని పట్టుకొని వేలాడడం. ఆత్మ సాక్షాత్కారం పొందిన తరువాత... మీ చిత్తాన్ని ఆత్మపై లగ్నం చేస్తే... మీ పాత అలవాట్లన్నీ క్రమంగా తొలగిపోతాయి. అప్పుడు మీలో కలిగే ఆధ్యాత్మిక ఉన్నతి ద్వారా బంధరాహిత్యాన్ని పొందుతారు. దీన్ని 'బ్రహ్మ గ్రంధి' అనడానికి కారణం... బ్రహ్మ అంటే చైతన్య శక్తి. అదే 'ఓం'. మన ఆత్మ ప్రాపంచిక విషయాల పైనా, వస్తు వ్యామోహాల్లో చిక్కుకున్నప్పుడు... మన చిత్తాన్ని భౌతిక అంశాలు కప్పేస్తాయి. అది ఒక స్థాయికి పెరిగి... ఒక ముడి ఏర్పడుతుంది. దీనివల్ల మీరు కేవలం వస్తు ప్రపంచాన్నే చూస్తారు తప్ప ఆత్మను కాదు. ఈ ముడి పృథ్వీ తత్త్వంతో ఏర్పడుతుంది. సహజయోగ ద్వారా ఆ ముడి నుంచి బయటపడవచ్చు. అది విడిపోగానే కుండలినీ ఉత్థానం ప్రారంభమవుతుంది. ఈ మొదటి ముడి చాలా ముఖ్యమైనది. ఇక... రెండోది విష్ణు గ్రంధి. అంతా మనమే, మన శక్తితో చేస్తున్నామనే అపోహలో ఉంటాం. దాన్ని 'రజోగుణం' అంటారు. కుడి పార్శ్వపు పింగళా నాడి లక్షణం రజో గుణం. దానివల్లే మీరు అహంకారంతో పనులు చేస్తారు. ఈ రెండో ముడిని ఛేదించడం భగవంతుడి ద్వారానే సాధ్యపడుతుంది. కాబట్టి మనం చేసిన పనిని భగవంతుడికి సమర్పించాలి.

మధ్య మార్గం

మూడోది రుద్ర గ్రంధి. దీనిది సత్వ గుణం, అది సుషుమ్నా నాడి లక్షణం. దాని ద్వారానే మనం భగవంతుణ్ణి తెలుసుకుంటాం. దానివల్లనే ఏది మంచో, ఏది చెడ్డో గ్రహిస్తాం. కాబట్టి రజో, తమో గుణాలను విడిచిపెట్టి, సత్వ గుణాన్ని అనుసరించాలి. ఈ ముడి విడిపోయేవరకూ మనకు వివేకం రాదు. ఇది మధ్య మార్గం. ఆ మార్గంలోనే... అంతా భగవంతుడి వల్లనే సాధ్యమవుతుందనే సూక్ష్మమైన విషయాన్ని మనిషి తెలుసుకుంటాడు. సత్యాన్వేషణలో మధ్య మార్గం చాలా విశిష్టమైనది. మూలాధార చక్రంలోని కుండలినీ శక్తి జాగృతమై... సూక్ష్మ శరీరంలోని చక్రాల ద్వారా ప్రయాణిస్తూ, బ్రహ్మరంధ్రాన్ని ఛేదించుకొని, సహస్రారం దగ్గర సర్వ వ్యాపకుడైన భగవంతుడి శక్తితో ఏకమైనప్పుడు... ఆ స్థితిని 'ఆత్మ సాక్షాత్కారం' అంటారు. సహజయోగ ధ్యాన సాధనలో కుండలినీ శక్తి జాగృతమైనప్పుడు... ఈ మూడు గ్రంధులూ వికసిస్తాయి. తద్వారా వాటిలో ఉన్న సమస్యలు తొలగిపోతాయి.

డాక్టర్ పి. రాకేష్, 9097097777
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



తెలుసుకుందాం

గోపురం అంటే..

'గో'పురం' అనే పదానికి ఎన్నో అర్థాలు ఉన్నాయి. 'గో' అంటే వేదాలు, 'పురం' అంటే పాలనలో ఉండేది. అంటే స్వర్గానికి ప్రతీకగా చెప్పవచ్చు. 'గో' అంటే గోవు అని అర్థం. సకల దేవతా స్వరూపమైన గోవుకు నమస్కరిస్తే ఎలాంటి పుణ్యాలు కలుగుతాయో... సకల దేవతా స్వరూపాలను కలిగి ఉన్న గోపురానికి నమస్కరిస్తే అంతే పుణ్య ఫలాలు కలుగుతాయి. 'గో' అంటే దిక్కు. పురానికి దిక్కులాంటిది గోపురం. పూర్వం కాలినడకన వెళ్ళే బాటసారులకు గోపురాలు దిక్సూచిగా ఉపయోగపడేవి. 'గో' అంటే వజ్రాయుధం. పురాన్ని వజ్రాయుధంలా రక్షించేది గోపురం. సాధారణంగా పట్టణాల్లో, నగరాల్లో అత్యంత ఎత్తుగా గోపురమే ఉంటుంది. ఆ గోపురం పైన ఉండే రాగి స్థూపం (స్థూపి) ఆకాశంలోంచి వచ్చే పిడుగుల తీవ్రతను తగ్గిస్తుంది. పురాన్ని వజ్రాయుధంలా రక్షిస్తుంది. జన, ఆస్తి నష్టాన్ని నివారిస్తుంది.

గోపురాలు ఎక్కడ ఉండాలి?

దేవాలయ ముఖద్వారం దగ్గర, పట్టణ ముఖద్వారాల



దగ్గర (పూర్వం దేవాలయ పరిధిలోనే పట్టణాలు ఉండేవి, ఉదాహరణకు... శ్రీరంగం, తిరువణ్ణామలై) గోపురాలను నిర్మించాలి. ప్రాకారం నలు దిక్కుల్లో, ప్రతి ప్రాకారానికి గోపురాలు నిర్మించవచ్చు. న్యాయశాల, నాటకశాల, రంగశాల, హస్తిశాల తదితర ప్రదేశాల్లో కూడా గోపురాలు ఏర్పాటు చేయవచ్చని 'విశ్వకర్మ వాస్తుశాస్త్రం' తెలిపింది. ఇవేకాకుండా... రాజులు, చక్రవర్తులు ఏదైనా దండయాత్రలో విజయం సాధించినప్పుడు... తమ విజయ చిహ్నంగా గోపురాల్ని నిర్మించడం కూడా కనిపిస్తుంది. ఉదాహరణకు.. శ్రీకాళహస్తిలో పూర్వం ఉన్న విజయ గోపురం. అలాగే పర్వత ప్రాంతంలో ఉన్న దేవాలయాలకు చేరుకొనే కాలిబాటలలో కూడా గోపుర నిర్మాణాలు కనిపిస్తాయి. రాజులు, చక్రవర్తులు తమకు భగవంతునిపై ఉన్న భక్తిభావాన్ని ఎత్తయిన గోపుర నిర్మాణాల ద్వారా చాటుకొనేవారు. దేవాలయాలలో గోపురాలను దేవాలయం ప్రాకారం మధ్యలో... అంటే గర్భాలయ ద్వారానికి ఎదురుగా నిర్మించాలి. దేవాలయం నలువైపులా... ప్రాకారాల మధ్యలో గోపురాలను కట్టవచ్చు. గోపురాన్ని ధ్వజస్తంభం నుంచి కాస్త ఎక్కువ దూరంలో నిర్మించాలి. శ్రీరంగం, మధురై, తిరువణ్ణామలై తదితర ఆలయాలు ఎత్తయిన అనేక గోపురాలతో విరాజిల్లుతున్నాయి. గోపురాల సంఖ్యను ప్రాకారాలను అనుసరించి నిర్ణయించడం జరుగుతుంది.

గర్భాలయంలో ఉండే భాగాలనే గోపుర నిర్మాణంలో కూడా అనుసరిస్తారు. కానీ ఈ రెండిటి నిర్మాణానికి కాస్త వ్యత్యాసం ఉంటుంది. గోపురంలో ప్రధానంగా చిత్రవానం, ఉపపీఠం, అధిష్ఠానం, పాదవర్గం, ప్రస్తరం, కర్ణకూడం, వేదిక, కంఠం, శిఖరం, స్థూపి అనే భాగాలు ఉంటాయి చిత్రవానం నుంచి పాదవర్గం వరకూ రాతితో నిర్మించి, ప్రస్తరం నుంచి శిఖరం వరకూ ఇటుకలతో నిర్మించే పద్ధతి ఉంది. ఆధునిక కాలంలో చిత్రవానం నుంచి శిఖరం వరకూ ఇటుకలతో నిర్మించడం జరుగుతోంది. అలాగే ఆర్.సి.సి.తో స్ట్రక్చర్‌తో కట్టి, ఇటుకలతో అలంకారాలు చేస్తూ గోపురాలు నిర్మిస్తున్నారు.

• దగ్గుపాటి నాగవరప్రసాద్ స్థపతి
9440525788

తిన్నదానికి బిల్లు కట్టమన్నందుకు.. లారీ ఎక్కించి చంపేశాడు!

- మద్యం మత్తులో లారీ డ్రైవర్ ఘాతుకం
- దాబా యజమాని సహా మరో వ్యక్తి మృతి
- శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలంలో ఘటన


అయూబ్


దండాసి

కంచిలి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిన్నదానికి బిల్లు కట్టమన్నందుకు ఓ డ్రైవర్ తన లారీని పైకి ఎక్కించి ఇద్దరిని చంపేశాడు! ఈ దారుణ ఘటన శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం జలంత్రకోట సమీపంలోని దాబా హోటల్ వద్ద బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కంచిలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఝార్ఖండ్‌కు చెందిన లారీ డ్రైవర్ ఇబ్రార్ ఖాన్ బుధవారం రాత్రి భోజనం చేసేందుకు దాబా హోటల్‌కు వచ్చాడు. అర్ధరాత్రి 12 గంటలకు భోజనం చేసి బిల్లు ఇవ్వకుండా వెళ్లిపోతుండగా.. దాబా యజమాని అయూబ్ (55) అడ్డుకున్నారు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అప్పటికే డ్రైవరు మద్యం మత్తులో ఉన్నాడు. ఆ తర్వాత లారీ ఎక్కి నడుపుకుని వెళ్తుండగా.. ఆపేందుకు అయూబ్ ప్రయత్నించారు. అయితే డ్రైవర్ వాహనాన్ని మీదుగా నడిపించడంతో అయూబ్ అక్కడికక్కడే చనిపోయారు. ఇది గమనించిన మధుపురం గ్రామానికి చెందిన డొక్కరి దండాసి (65) లారీని ఆపేందుకు ప్రయత్నించే క్రమంలో దాని కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. అతడిని సోంపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. అక్కడున్న వారు లారీని వెంబడించి బురగాం సమీపంలో పట్టుకున్నారు. పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకు కేసు నమోదు చేశారు.

జల, థర్మల్ విద్యుదుత్పత్తికి ప్రాధాన్యం

- జెన్కో ట్రాన్స్‌కో అధికారులతో సీఎస్ సమీక్ష

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాను సమర్థవంతంగా నిర్వహించేందుకు జల, థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధికారులను కోరారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితిపై ఆయన గురువారం సచివాలయంలో ట్రాన్స్‌కో, జెన్కో యాజమాన్యాలతో సమీక్ష నిర్వహించారు. వాతావరణ మార్పుల కారణంగా సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిపై ఎక్కువ ఆధారపడకూడదని, వాటికి ప్రత్యామ్నాయంగా జల, థర్మల్ విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించాలని సూచించారు. ఈ ఏడాది జూలై నుంచి సగటున రోజుకి 15.5 మిలియన్ యూనిట్ల జల విద్యుదుత్పత్తి జరుగుతోందని, విద్యుత్ డిమాండ్‌ను అందుకోవడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. అక్టోబరు నెలలో పండుగలు, వ్యవసాయానికి అనువైన కాలం కావడంతో, విద్యుత్ డిమాండ్‌ను అందుకోవడానికి సంసిద్ధంగా ఉండాలని సీఎస్ కోరారు. వినియోగదారులకు 24/7 నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. సమావేశంలో జెన్కో ఎండీ నాగలక్ష్మి, ట్రాన్స్‌కో ఇన్‌చార్జి జేఎండీ పృథ్వీతేజతో పాటు ట్రాన్స్‌కో డైరెక్టర్లు ఏకేవీ భాస్కర్, జేవీరావు, ఎస్‌వీ రమణమూర్తి, జెన్కో డైరెక్టర్లు సుజయ్‌కుమార్, అశోక్‌కుమార్ రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సభలో ‘సినీ’ రగడ

కామినేని వ్యాఖ్యలకు బాలకృష్ణ కౌంటర్

జగన్‌పై ధ్వజం... చిరంజీవి ప్రస్తావన

బాలయ్య మాటలపై చిరు తీవ్ర స్పందన

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శాసన సభ వేదికగా ‘సినీ’ రగడ రాజుకుంది. బీజేపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలపై టీడీపీ ఎమ్మెల్యే, నటుడు బాలకృష్ణ తీవ్రంగా స్పందించారు. దీనికి ప్రతిస్పందనగా చిరంజీవి సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. జగన్ సీఎంగా ఉండగా సినీ ప్రముఖులను అవమానించారని... ఆయన వైఖరికి ఇదొక ఉదాహరణ అని కామినేని శ్రీనివాస్ గురువారం సభలో పేర్కొన్నారు. దీనిపై వారి వ్యాఖ్యలు, స్పందన, ప్రతిస్పందనలు ఇవి...

చిరంజీవి గట్టిగా అడిగితే...: కామినేని



‘జగన్మోహన్‌రెడ్డిది ఎంత సైకో మనస్తత్వమంటే.. చిరంజీవిని, ఆయన భార్య సురేఖను ఒకసారి రమ్మంటే వెళ్లినప్పుడు కారు పోర్టికోలోకి వెళ్లగానే జగన్ దంపతులు వచ్చి లోపలకు తీసుకెళ్లారు. తర్వాత సినిమా వాళ్ల సమస్యలపై చర్చించాలని అడిగితే ఆయనే (జగన్) జాబితా పంపారు. ఆ జాబితాలో బాలకృష్ణ, ఇతరులెవరూ లేరు. రాజకీయాలతో సంబంధం లేకుండా ఉంటున్న ప్రభాస్, మహేశ్, రాజమౌళిని రమ్మన్నారు.. వాళ్లు రాబోమన్నా చిరంజీవి గారే రమ్మని అడగడంతో మొహమాటంతో వస్తే.. ఫస్ట్ షాక్. గేటు దగ్గరే కార్లు ఆపేశారు. అందరినీ కార్లు దిగి రమ్మన్నారు. అదేంటనుకుని కార్లు దిగి లోపలకు వెళ్లారు. లోపల సెకండ్ షాక్. ఇంత పెద్దవారిని పిలిచి అక్కడ పోసాని కృష్ణమురళి లాంటి వారిని కూర్చోబెట్టారు. తర్వాత మూడో షాక్. సీఎం గారు మిమ్మల్ని కలవట్లేదు.. సినిమాటోగ్రఫీ మంత్రి వచ్చి మాట్లాడతారని అన్నారు అప్పుడు చిరంజీవి గారు కొద్దిగా గట్టిగానే.. అదేంటండి.. మీరు పిలిచారని నేను వీరందరినీ తీసుకొస్తే ఆయన రానంటారా.. అని అడిగారు. అప్పుడు జగన్ వచ్చారు. మీరొక తండ్రిలా సినిమా పరిశ్రమను జాగ్రత్తగా చూసుకోండని చిరంజీవి మంచిఉద్దేశంతో రిక్వెస్ట్ చేస్తే.. ఆ వీడియో బయటకు రిలీజ్ చేశారు. ఎంత అవమానం? శాడిస్ట్ మెంటాలిటీకి ఇంతకన్నా ఉదాహరణ ఏమి కావాలి?’

గట్టిగా ఎవరడిగారు: బాలకృష్ణ



‘అప్పుడు ఇండస్ట్రీ వాళ్లందరూ సైకో గాడిని కలవడానికి వెళ్లినప్పుడు చిరంజీవి గారు గట్టిగా అడిగితే అప్పుడు ఈయన (జగన్) వచ్చాడు అన్నది అబద్ధం. అక్కడ గట్టిగా ఎవ్వడూ అడగలేదు.. సినిమాటోగ్రఫీ మంత్రిని కలవమన్నారు.. ఆ వీడియో పెట్టడం, అవమానించడం నిజం. ఆయన (చిరు) ఏదో పెద్దగా చెబితే ఈయన (జగన్) దిగొచ్చాడంటా.. మొన్న కూడా నాకు ఇన్విటేషన్ వచ్చింది. ఇక్కడ ఫిల్మ్ డెవలప్మెంట్ జాబితా తయారు చేయమని! అందులో నాది తొమ్మిదో పేరు! మంత్రి కందుల దుర్గేశ్ గారిని అడిగా.. ఎవడు వాడు వేసిందని! మర్యాద ఇవ్వడం మానవత్వం. (కామినేని వైపు చూస్తూ..) అదేదో గట్టిగా.. ఎవడడిగాడు? గట్టిగా అడిగితే పంపించారా లోపలికి! ఆ రోజు గట్టిగా అడిగిన వారెవరూ లేరు. మీరు తెలీకుండా మాట్లాడుతున్నారు. అయితే ఆయన(చిరంజీవి)కు అవమానం జరిగింది వాస్తవమే. (స్పీకర్ వైపు చూస్తూ..) సారీ.. వివరణ ఇవ్వడమే నా ఉద్దేశం!’

బాలకృష్ణ అందుబాటులో లేరు: చిరంజీవి



‘ఏపీలో జగన్ ప్రభుత్వం ఉన్నప్పుడు తెలుగు చిత్రపరిశ్రమలోని కొందరు నిర్మాతలు, దర్శకులు, ఫిల్మ్ చాంబర్ ప్రతినిధులు నా దగ్గరకు వచ్చి, నిర్మాణ వ్యయం పెరుగుతున్న దృష్ట్యా టికెట్ల ధరల పెంపుదల గురించి ప్రభుత్వంతో మాట్లాడమని నన్ను కోరారు. వారిలో దర్శకులు రాజమౌళి, కొరటాల శివ, త్రివిక్రమ్ శ్రీనివాస్, హీరోలు మహేశ్, ఎన్టీఆర్, నిర్మాత డీవీవీ దానయ్య తదితరులు ఉన్నారు. వారి సూచనల మేరకు అప్పటి సినిమాటోగ్రఫీ మంత్రి పేర్ని నానితో ఫోన్‌లో మాట్లాడాను. సీఎంతో చర్చించి చెబుతానని ఆయన చెప్పారు. ఆ తర్వాత మంత్రి నాకు ఫోను చేసి... జగన్ వన్ టు వన్ కలుస్తారని చెప్పి, లంచ్‌కి ఆహ్వానించారు. నేను సీఎం నివాసానికి వెళ్లగా ఆయన నన్ను సాదరంగా ఆహ్వానించారు. జగన్‌కు సినీ పరిశ్రమ ఇబ్బందుల్ని వివరించాను. సమయం ఇస్తే అందరం కలిసి వస్తామని తెలిపాను. కొన్ని రోజుల తర్వాత మంత్రి పేర్ని నాని ఫోన్ చేసి కొవిడ్ రెండో దశ కొనసాగుతున్నందు వల్ల ఐదుగురు మాత్రమే వస్తే బాగుంటుందని చెప్పారు. నేనప్పుడు ఓ పది మందిమి వస్తామని చెబితే సరేనన్నారు. ఆ సమయంలో బాలకృష్ణను ఫోన్ ద్వారా సంప్రదించడానికి ప్రయత్నించాను. ఆయన అందుబాటులోకి రాలేదు. బాలకృష్ణను కలవమని జెమిని కిరణ్‌ను పంపించాను. ఆయన మూడు సార్లు ప్రయత్నించినా బాలకృష్ణను కలవలేకపోయారు. దాంతో నేను ఓ విమానం ఏర్పాటు చేసి ఆర్. నారాయణమూర్తితో సహా మరికొందరితో వెళ్లి సీఎంను కలిశాం. సినీ పరిశ్రమ ఇబ్బందుల్ని వివరించి, ప్రభుత్వ సహకారం కోరాను. నేను చొరవ తీసుకోవడం వల్లే అప్పుడు ప్రభుత్వం టికెట్ ధరల పెంపునకు అంగీకరించింది. ఆ నిర్ణయం వల్లే ‘వాల్తేరు వీరయ్య’, బాలకృష్ణ నటించిన ‘వీరసింహా రెడ్డి’ వంటి సినిమాలకు టికెట్ రేట్లు పెంచడానికి కారణమైంది. నేను సీఎంతోనైనా, సామాన్యుడితో అయినా నా సహజ ధోరణిలోనే మాట్లాడుతాను.’

పత్తి క్వింటా రూ.8,110

- వచ్చే నెల నుంచి సీసీఐ ద్వారా కొనుగోళ్లు
- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2025-26 సీజన్‌లో గుర్తించిన మార్కెట్ యార్డులు, జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోలుకు ప్రభుత్వం గురువారం మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్రంలో ఈ ఏడాది 4.02 లక్షల హెక్టార్లలో పత్తి పండించగా, 7.12 లక్షల టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. సీఎం యాప్ ద్వారా కనీస మద్దతు ధరకు వచ్చే నెల నుంచి పత్తి కొనుగోలును సీసీఐ ప్రారంభిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. పొడవు పింజ పత్తి క్వింటా రూ.8,110, మధ్యస్థ పింజ పత్తి క్వింటా రూ.7,710 చొప్పున కొననున్నట్టు పేర్కొంది. సీసీఐ కొత్త నిబంధనల మేరకు ఎంపిక చేసిన మార్కెట్ యార్డులతో పాటు నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లుల్లో పత్తి సేకరణకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఆధార్ ఆధారిత ఈ-పంట డేటా ప్రకారం పత్తి రైతులను గ్రామ వ్యవసాయ సహాయకులు గుర్తించి, రైతు సేవా కేంద్రంలో నమోదు చేయనున్నారు. కాపాస్ కిసాన్ యాప్‌తో డేటా అనుసంధానం చేసి, స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయనున్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. స్లాట్ బుకింగ్ నేపథ్యంలో మండలాల వారీగా పంట దిగుబడి, కోత సమయాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. యార్డులు, మిల్లుల్లో పత్తి నిల్వలకు బీమా ఉండాలని నిర్దేశించింది. ప్లాస్టిక్, గన్నీ బ్యాగులను నివారించేందుకు రైతులు లూజు పత్తిని కొనుగోలు కేంద్రాలకు తేవాలని సూచించింది. పత్తి రైతుల కుటుంబ సభ్యులను గుర్తించేందుకు రేషన్‌కార్డులోని డేటాను సీఎంయాప్‌కు అనుసంధానం చేయాలని పౌర సరఫరాలశాఖను ఆదేశించింది. రైతుల ఆధార్ లింక్డ్ బ్యాంక్ అకౌంట్‌కు సీసీఐ నగదు చెల్లింపులు జరపాలని నిర్దేశించింది. పత్తి అమ్మకం కోసం వివరాల నమోదు సమయంలో ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం ఫొటో కాపీలను రైతులు తీసుకు రావాలని స్పష్టం చేసింది. సాగు విస్తీర్ణం, దిగుబడి, పత్తితీతల మేరకు మండలాల వారీగా అమ్మకానికి రైతులను అనుమతించనున్నారు. పత్తి నాణ్యతాప్రమాణాలను రైతులకు వివరించాలని, అగ్ని నిరోధక, తేమ శాతం గుర్తింపు పరికరాలు, టార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ తూనికలు, సీసీ కెమేరాలు మార్కెట్ యార్డుల్లో ఏర్పాటు చేయాలని మార్కెటింగ్‌శాఖను ఆదేశించింది. జిన్నింగ్ మిల్లుల్లో సీసీ కెమేరాల ఏర్పాటుపై హైకోర్టు ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవాలని సీసీఐకి సూచించింది. పత్తి రవాణా వివరాలూ యాప్‌లో నమోదు చేసి, రవాణాదారులకు చెల్లింపులు జరపాలని పేర్కొంది. జిల్లా స్థాయిలో పత్తి కొనుగోలు కార్యకలాపాల పర్యవేక్షణకు జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన కమిటీలు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

రైతు సమస్యలపై నేడు సీఎంకు షర్మిల వినతిపత్రం

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి వినతిపత్రం అందజేస్తానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటనను ఆమె విడుదల చేశారు. శుక్రవారం మధ్యాహ్నం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో ‘రైతన్నకు అండగా కాంగ్రెస్’ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. అన్నదాతల ఆక్రందనలపై కూటమి ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యల గురించి కాంగ్రెస్ నేతలతో చర్చించాక .. సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళతామని తెలిపారు.

వరద జలాలపై మాకే సంపూర్ణ హక్కులు

- కృష్ణా ట్రిబ్యునల్ ముందు ఏపీ స్పష్టీకరణ
- వచ్చే నెల 29, 30, 31 తేదీల్లో కొనసాగనున్న వాదనలు

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదీ జలాల వివాద ట్రిబ్యునల్ కేటాయించిన నికర జలాలతో పాటు వరద జలాలపైనా దిగువ రాష్ట్రంగా తమకే సంపూర్ణ హక్కులు ఉంటాయని ఆంధ్రప్రదేశ్ స్పష్టంచేసింది. గురువారం బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్-2 ముందు రాష్ట్రప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదనలు ప్రారంభించారు. ఎగువన ఉన్న తెలంగాణ నుంచి దిగువన ఉన్న తమ ప్రాజెక్టుల్లోకి కృష్ణా జలాలు వచ్చేశాక.. వాటిపై పూర్తి హక్కు తమకే ఉంటుందన్నారు. తమ భూభాగంలోకి వచ్చిన జలాలపై తెలంగాణకు ఎలాంటి హక్కులూ ఉండబోవని తెలిపారు. సోమ, మంగళ, బుధవారాల్లో తెలంగాణ వాదనలు వినిపించగా.. గురువారం ఏపీ వాదనలు ప్రారంభమయ్యాయి. తదుపరి విచారణ వచ్చే నెలాఖరుకు వాయిదాపడింది. అక్టోబరు 29, 30, 31 తేదీల్లో ఏపీ వాదనలు కొనసాగుతాయని ట్రిబ్యునల్ పేర్కొంది. కాగా.. ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన కృష్ణా జలాల్లో తమకు 70% వాటా ఇవ్వాలని తెలంగాణ డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే.



ముగిసిన ‘జల ప్రహార్’ విన్యాసాలు

భారత ఆర్మీతో కలిసి నౌకాదళం ఏడాదికి రెండుసార్లు నిర్వహించే ‘జల ప్రహార్’ విన్యాసాలు విశాఖలో బుధవారం ముగిశాయి. వీటిని సముద్రంలోను, తీర ప్రాంతంలోనూ నిర్వహించారు. ఇందులో ఐఎన్ఎస్ ఘరియల్ పాల్గొందని నేవీ వర్గాలు తెలిపాయి.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

ఇక ‘రెవెన్యూ’ కష్టాలకు చెల్లు!

- వచ్చే నెలంతా ప్రణాళికా శాఖ ఇంటింటి సర్వే
- ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు నిక్షిప్తం
- నవంబరు నుంచి ఆర్టీజీఎస్‌కు అందజేత
- వాట్సప్ గవర్నెన్స్ నుంచి ప్రజలు నేరుగా పత్రాలు డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆదాయ, నివాస, కుల, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాల విషయంలో రెవెన్యూ శాఖ చుక్కలు చూపిస్తోందని.. ప్రతి వారం రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్) నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణలో తేలింది. ప్రజలను ఇబ్బందులకు గురి చేయడంలో రెవెన్యూ, పోలీసు శాఖలు తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. ప్రధానంగా రెవెన్యూ శాఖలో ప్రతి సర్టిఫికెట్‌కు లంచం ఇస్తేనే పని చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. వాట్సప్ గవర్నెన్స్ అమల్లోకి వచ్చాక మండల తహసీల్దారు కార్యాలయాలకు లబ్ధిదారులు, దరఖాస్తుదారులను రప్పించవద్దంటూ ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ శాఖను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అయినా కూడా రెవెన్యూ శాఖలో మార్పు రాలేదు. వారాంతపు సమీక్షా వివరాలను ఆర్టీజీఎస్, ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. కుటుంబానికి సంబంధించిన సమస్త సమాచారం ఆర్టీజీఎస్ వద్ద ఉన్నందున వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేయాలని సీఎం ఆదేశించారు. అదేవిధంగా పుట్టుకతో వచ్చిన కులం మధ్యలో మారిపోదు కదా అని సీఎం పేర్కొన్నారు. ఆదాయానికీ ఇదే విధానం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పత్రాలను నేరుగా వాట్సప్ గవర్నెన్స్ ద్వారా జారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ఇంటింటికీ వెళ్లి మౌఖికంగా సర్వే నిర్వహించిన ప్రణాళికా శాఖ అక్టోబరులో మరోసారి సర్వేకు సిద్ధమవుతోంది. నెల రోజుల పాటు ఇంటింటి సర్వే చేసి ప్రధానమైన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను నిక్షిప్తం చేయనుంది. నవంబరు నుంచి వాటిని ఆర్టీజీఎస్‌కు అందజేస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల డేటాను క్రోడీకరించుకుని వారికి అవసరమైనప్పుడు ధ్రువీకరణ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని వాట్సప్ గవర్నెన్స్ కల్పిస్తుందని ‘ఆంధ్రజ్యోతి’కి కాటంనేని భాస్కర్ వివరించారు.

వేలకోట్లు వెచ్చిస్తున్నా

ఉద్దేశం నెరవేరట్లేదు!

- కేజీబీవీల్లో శాశ్వత సిబ్బందిని నియమించకపోవడంపై హైకోర్టు ఆగ్రహం
- అర్హులైన బోధన సిబ్బంది లేకుండా నాణ్యమైన విద్య ఎలా సాధ్యమని ప్రశ్న
- 14న కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని కేంద్ర మానవ వనరుల కార్యదర్శికి ఆదేశం
- రాష్ట్ర పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శికి కూడా

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 21 ఏళ్లుగా ఏటా వేల కోట్లు ఖర్చు చేస్తున్నా కేజీబీవీల ఏర్పాటు ఉద్దేశం నెరవేరట్లేదని హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. సర్వశిక్షా అభియాన్ పథకం కింద ఏర్పాటు చేసిన కేజీబీవీలలో శాశ్వత ప్రాతిపదికన అర్హులైన బోధనా సిబ్బందిని నియమించకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించింది. శాశ్వత సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్, మైనార్టీ, అణగారినవర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో 2004లో ఈ పథకాన్ని తీసుకొచ్చారని గుర్తుచేసింది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పాలసీలో శాశ్వత ప్రాతిపదికన సిబ్బంది నియామకం గురించి ప్రస్తావించారని, మరోవైపు ప్రతి ఏడాది కాంట్రాక్ట్ పద్ధతిలో సిబ్బందిని నియమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేశారని పేర్కొంది. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో స్థిరమైన వైఖరి కనిపించడంలేదంది. ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటున్నారని తెలిపింది. తగినన్ని అవకాశాలు ఇచ్చినప్పటికీ సరైన వివరాలు అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయంది. వివరణ ఇచ్చేందుకు అక్టోబరు 14న తమ ముందు హాజరుకావాలని కేంద్ర మానవనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ కార్యదర్శిని, రాష్ట్ర పాఠశాల విద్యశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. విచారణను వచ్చేనెల 14వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టుదేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు(కేజీబీవీ)ల్లో పనిచేస్తున్న తమను అర్ధంతరంగా తొలగించడాన్ని సవాల్ చేస్తూ పార్ట్‌టైం పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు(పీజీటీలు) 2023లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు పిటిషనర్లను ఉద్యోగాలలో నుంచి తొలగించడాన్ని తప్పుపట్టారు. వారిని కొనసాగించాలని అధికారులను ఆదేశిస్తూ 2023 డిసెంబరు 5న తీర్పు ఇచ్చారు. ఆ తీర్పును సవాల్ చేస్తూ అధికారులు 2024 జనవరిలో ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. ఈ అప్పీల్ గురువారం మరోసారి విచారణకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ వాదిస్తూ.. శాశ్వత ప్రాతిపదికన బోధన సిబ్బందిని నియామించుకొనే వెసులుబాటు కేంద్రం రూపొందించిన పాలసీలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ...బోధన సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలో ఏర్పాటు చేసుకోవాలని కేంద్రం రాష్ట్రానికి సూచనలు చేసిందన్నారు. సర్వశిక్షా అభియాన్‌లో నడిచే విద్యాసంస్థలకు అయ్యే ఖర్చులో 60 శాతాన్ని కేంద్ర ప్రభుత్వం ఇస్తోందని, కేంద్రం చెప్పినట్లు నడుచుకోకుంటే ఆ సొమ్మును విడుదల చేయరని తెలిపారు. ఇరువైపుల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఈ వ్యవహారంపై వివరణ ఇచ్చేందుకు తమ ముందు హాజరుకావాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ కార్యదర్శి, రాష్ట్ర పాఠశాల విద్యశాఖ ముఖ్యకార్యదర్శిలను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

పోరాట ఘట్టాలు ప్రత్యేకాకర్షణగా



మలయాళ దర్శకుడు డాక్టర్ ప్రగబల్ తెరకెక్కిస్తున్న చిత్రం ‘జాకీ’. యువన్ కృష్ణ, రిధాన్ కృష్ణన్, అమ్ము అభిరామి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ప్రేమకృష్ణ దాస్, సీ ప్రేమదాస్ నిర్మిస్తున్నారు. మధురైలో సంప్రదాయంగా కొనసాగుతున్న పొట్టేలు పందేల చుట్టూ సాగే ఆసక్తికర కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. చిత్రబృందం గురువారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా ప్రగబల్ మాట్లాడుతూ ‘ఆసక్తికరమైన కథాంశంతో ‘జాకీ’ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నా. ప్రేక్షకులను థ్రిల్ చేసేలా ఉంటుంది. పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే చిత్రం ఇది. పొట్టేలు పందేలు, పాత్రల భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. రియల్ లొకేషన్లలో సినిమాను చిత్రీకరించాం’ అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: శక్తి బాలాజీ, సినిమాటోగ్రఫీ: ఉదయ్ కుమార్.

పవన్‌తో సినిమా ఆనందంగా ఉంది

- సుజీత్



‘దాదాపు మూడేళ్ల ప్రయాణం. మొదటి రోజు నుంచి మమ్మల్ని సపోర్ట్ చేస్తూ, మా పక్కనే ఉంటూ మాకు కావాల్సినవన్నీ ఏర్పాటు చేసిన నిర్మాతలు డీవీవీ దానయ్య, కల్యాణ్ గారికి కృతజ్ఞతలు. అలాగే ‘ఓజీ’ కథకి ఇంతటి భారీతనం రావడానికి కారణమైన పవన్ కల్యాణ్‌కి కృతజ్ఞతలు. నేను ఆయన వీరాభిమానిని. ‘జానీ’ సినిమా సమయం నుంచి పవన్‌గారిని కలిస్తే చాలు అనుకునేవాడిని. అలాంటిది ఇప్పుడు ఆయనతో సినిమా చేయడం, దానికి బ్లాక్ బస్టర్ టాక్ రావడం చాలా ఆనందంగా ఉంది’ అని అన్నారు దర్శకుడు సుజీత్. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా ఆయన తెరకెక్కించిన ‘ఓజీ’ సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ ‘విడుదలకు ముందు సినిమా పట్ల చాలా నమ్మకంగా ఉన్నాము. మా నమ్మకం నిజమైంది, విజయం సాధించిన తర్వాత భయం, బాధ్యత పెరిగాయి. ‘ఓజీ’ సినిమా మాది కాదు. దీన్ని ప్రేక్షకులు తమదిగా భావిస్తున్నారు. ఎక్కడ చూసినా ‘ఓజీ’ సందడే కనిపిస్తోంది. పవన్ కల్యాణ్ గారికి ఉండే పవర్ అది. ‘వకీల్ సాబ్, భీమ్లా నాయక్, బ్రో, ఓజీ’ ఇలా వరుసగా పవన్ కల్యాణ్ గారి సినిమాలకు పనిచేసే అవకాశం రావడం చిన్న విషయం కాదు’ అని అన్నారు. డీవీవీ దానయ్య మాట్లాడుతూ ‘పవన్ కల్యాణ్ గారి అభిమానులకు నచ్చే సినిమా అందించాలనే ఉద్దేశంతో ఎంతో శ్రద్ధతో ఈ సినిమా చేశాం. తమన్, నవీన్ నూలి, రవి చంద్రన్ ముగ్గురూ ఈ సినిమాకు మూడు స్థంభాల్లాంటి వారు. అభిమానుల స్పందన చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది’ అని అన్నారు.

ఏఐతో నా ఫొటోలు మార్ఫింగ్ చేస్తున్నారు

- ఢిల్లీ హైకోర్టులో నాగార్జున పిటిషన్
- వ్యక్తిగత హక్కులను కాపాడుతామన్న న్యాయస్థానం



కొన్ని వెబ్‌సైట్‌లు, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు తన అనుమతి లేకుండా ఫొటోలు, వీడియోలు వాడుతూ దుర్వినియోగం చేస్తున్నాయని, పబ్లిసిటీ, పర్సనాలిటీ హక్కులకు రక్షణ కల్పించాలని కోరుతూ అక్కినేని నాగార్జున ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. కొందరు తన ఫొటోలను మార్ఫింగ్ చేసి, అసభ్యకరమైన కంటెంట్, లింక్‌లు సృష్టిస్తున్నారని, ఇది తన వ్యక్తిగత ప్రతిష్ఠకు తీవ్ర భంగం కలిగిస్తోందని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. గురువారం ఆ పిటిషన్ జస్టిస్ తేజస్ కరియా సింగ్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. నాగార్జున తరఫున న్యాయవాది ప్రవీణ్ ఆనంద్ వాదనలు వినిపించారు. దీనికి సంబంధించి 14 యూఆర్ఎస్ (యూనిఫాం రిసోర్స్ లొకేటరీ)లు కోర్టుకు సమర్పించారు. జస్టిస్ కరియా స్పందిస్తూ... ‘మీ దగ్గర యూఆర్ఎల్ ఉన్నాయి కదా? ఆ లింక్‌లను తొలగించమని వారికే చెప్పవచ్చు కదా?’ అని ప్రశ్నించారు. తామిచ్చే ఆదేశాలతో ఎంత కాలం ఇలాంటివి ఆపగలమని వ్యాఖ్యానించారు. అలాగని, తామేమీ చూస్తూ ఊరుకోమని తెలిపారు. ప్రస్తుతం ఏఐ ఇంటర్నెట్‌లో భాగమైన తర్వాత పెద్ద సమస్యగా తయారైందని వ్యాఖ్యానించారు. నాగార్జున వ్యక్తిగత హక్కులకు భంగం కలగకుండా చూస్తామన్నారు. తక్షణమే ఆ లింకులను తొలగించాలని ఆయా యూట్యూబర్లు, కంటెంట్ క్రియేటర్లకు ఆదేశాలు జారీ చేశారు.

-న్యూఢిల్లీ, ఆంధ్రజ్యోతి

జటాధర తొలి గీతం




సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రధారులుగా వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న పాన్ ఇండియా చిత్రం ‘జటాధర’. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేశ్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింగ్‌హల్, నిఖిల్ నందా నిర్మిస్తున్నారు. నవంబరు 7న తెలుగు, హిందీ భాషల్లో విడుదలకు సిద్ధమవుతోంది. తాజాగా మేకర్స్ ఈ చిత్రం నుంచి ‘ఓం నమఃశివాయ..’ అంటే సాగే తొలి పాట సోల్ ఆఫ్ జటాధర ట్రాక్ ప్రోమోను విడుదల చేశారు. కాగా, ఈ సినిమాలో శిల్పా శిరోద్కర్ కీలక పాత్ర పోషిస్తున్నారు.


ఆసక్తిగా ‘గోదారి గట్టు పైన’



సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్, జగపతి బాబు ప్రధాన పాత్రధారులుగా నూతన దర్శకుడు సుభాష్ చంద్ర దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం ‘గోదారి గట్టుపైన’. రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ పతాకంపై అభినవ్ రావు నిర్మిస్తున్నారు. తాజాగా యూనిట్ ఈ చిత్రం నుంచి ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్ చేసింది. లైట్ హౌస్ పైకి తన ప్రేమికురాలిని తీసుకెళ్లిన హీరో, గోదావరి సముద్రంలో కలసిపోయే అద్భుత దృశ్యం చూపించే సన్నివేశంతో వీడియో ప్రారంభమవుతుంది. ‘మనుషులు కూడా భేదాభిప్రాయాలు లేకుండా ఒకటిగా కలిసిపోతే ఈ మత భేదాలు అనేవి ఉండవు కదా’ అని సుమంత్ ప్రభాస్ పలికే సంభాషణలు ఆసక్తిగా ఉన్నాయి. కాగా, నిధి ప్రదీప్ ఈ చిత్రం ద్వారా కథానాయికగా పరిచయం అవుతున్నారు.



సీఐ శంకరయ్యకు ఎంత ధైర్యం: చంద్రబాబు



"మాజీ మంత్రి వివేకానంద రెడ్డి తలలో నుంచి మెదడు బయటికి వచ్చేలా గొడ్డలితో నరికి హత్య చేశారు. అలాంటి ఘటనలో కళ్లముందు సాక్ష్యాలు చెరిపేస్తున్న వారిని అడ్డుకోని అప్పటి పులివెందుల సీఐ శంకరయ్యను నేను సస్పెండ్ చేయించాను. వివేకా గుండెపోటుతో చనిపోయినట్లు నాకు ముందుగా చెప్పారు. వివేకా కుమార్తె సునీత పోస్టుమార్టం కోరుతున్నారని తెలిసి ఆరా తీయగా.. ఆయన హత్య జరిగినట్లు తెలిసింది. ఆనాడు కనీస బాధ్యతగా కూడా నడుచుకోని పోలీసు అధికారిని సస్పెండ్ చేస్తే, ఆ తర్వాత నేరస్థులతో మిలాఖత్ అయి సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో సీఐ శంకరయ్య మాట మార్చారు. ఇప్పుడు ముఖ్యమంత్రినైన నాకే లీగల్ నోటీసు ఇచ్చాడంటే ఆయనకు ఎంత ధైర్యం?"

- సీఎం చంద్రబాబు



శాసనసభ ప్రాంగణంలో చీఫ్‌విప్, విప్‌ల కోసం నిర్మించిన భవనాన్ని ప్రారంభించిన స్పీకర్ అయ్యన్న, పక్కన మంత్రులు నారాయణ, కేశవ్, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

'అసెంబ్లీ'లో అనుబంధ భవనం ప్రారంభం

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ప్రాంగణంలో నిర్మించిన అనుబంధ భవనాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు గురువారం ప్రారంభించారు. ఇందులో ప్రభుత్వ చీఫ్ విప్, ఇతర ప్రభుత్వ విప్‌ల కోసం 16 చాంబర్లు, డైనింగ్ హాల్, మీడియా పాయింట్‌లను ఏర్పాటు చేశారు. భవనాన్ని ప్రారంభించిన అనంతరం మంత్రులు పయ్యావుల కేశవ్, పి.నారాయణలతో కలిసి అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద అయ్యన్న మాట్లాడారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన ఈ భవనాన్ని అన్ని హంగులతో పునరుద్ధరించేందుకు రూ.5 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారని, ఈ-టెండరింగ్ విధానం ద్వారా రూ. 3.57 కోట్లకే నిర్మించినట్లు తెలిపారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో మీడియా సమావేశాలకు వీలుగా సుమారు 100 మంది మీడియా ప్రతినిధులు కూర్చునే విధంగా హాల్, దీన్ని ఆనుకుని డైనింగ్ హాలు, కిచెన్ నిర్మించామన్నారు. మొదటి అంతస్తులో ప్రభుత్వ చీఫ్ విప్ సహా 16 మంది ప్రభుత్వ విప్‌ల చాంబర్లను, ఒక వెయిటింగ్ హాలును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసేందుకు మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ, ఆర్థిక, శాసనసభా వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ ఎంతో సహకరించారని తెలిపారు. నిరంతరం పర్యవేక్షించిన అసెంబ్లీ కార్యదర్శి సూర్యదేవర ప్రసన్నకుమార్, సీఆర్‌డీఏ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు, అసెంబ్లీ కార్యదర్శి ప్రసన్నకుమార్, ప్రభుత్వ విప్‌లు దాట్ల సుబ్బరాజు, రెడ్డప్పగారి మాధవి, కాల్వ శ్రీనివాసులు, బెందాళం అశోక్, శ్రీనివాస్, తంగిరాల సౌమ్య, పీజీవీఆర్ నాయుడు, యార్లగడ్డ వెంకట్రావు, థామస్, అరవ శ్రీధర్, తోట జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అగ్రి వర్సిటీ భవనాలను వైసీపీ పట్టించుకోలేదు

- వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యంత ముఖ్యమైన ఎన్జీ రంగా వర్సిటీకి పరిపాలన భవనం లేదని, తాము 80 శాతం పూర్తి చేసిన భవనాన్ని వైసీపీ హయాంలో కన్నెత్తి చూడలేదని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల్లో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. అవనిగడ్డ నియోజకవర్గంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని, దీనికి శాశ్వత భవనాలు నిర్మించాలనే ఆలోచనలో ఉన్నామని మంత్రి తెలిపారు. లేదంటే ప్రస్తుతం కాలేజీ నడుస్తున్న గిరిజన సంక్షేమ శాఖ భవనానికైనా మరమ్మత్తులు చేయిస్తామన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, జగన్ విధ్వంస పాలన ప్రభావం పాలిటెక్నిక్ కాలేజీపై కూడా పడిందన్నారు. తక్కువ నిధులతోనే కాలేజీ అద్భుతంగా మారుతుందని చెప్పారు. అలానే రాజమండ్రిలో కూడా వ్యవసాయ కళాశాలకు భూమిని కేటాయించాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కోరారు.

భారీ పరిశ్రమలకు తక్కువ ధరలకే భూములు

- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెద్ద పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చే కంపెనీలతో లోతుగా చర్చించి, తక్కువ ధరలకే వారికి భూ కేటాయింపులు చేస్తామని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. గురువారం అసెంబ్లీలో బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కె.కె. రంగారావు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. తొలుత మాట్లాడిన ఎమ్మెల్యే.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్న ఉద్దేశంతో బొబ్బిలిలో ఏపీఐఐసీ ఏర్పాటు చేసిన గ్రోత్ సెంటర్ కోసం 5 గ్రామాల ప్రజలు భూములు ఇచ్చారని, కొన్ని కంపెనీలు ఇప్పటికి ప్లాంట్స్ ఏర్పాటు చేయలేదని చెప్పారు. కొన్ని కంపెనీలైతే రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేస్తున్నాయన్నారు. అలానే దర్జీలకు ఉపాధి అవకాశాలపై ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అడిగిన ప్రశ్నలకు మంత్రి సవిత సమాధానం చెప్పారు. మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వడంతో పాటు కుట్టుమిషన్లు కూడా ఉచితంగా అందిస్తున్నామని, త్వరలో ఎంబ్రాయిడరీ, ఇతర అనుబంధ పనులపై కూడా శిక్షణ ఇచ్చే ఆలోచన ఉందని మంత్రి చెప్పారు.

5 మున్సిపల్ సవరణ బిల్లులకు అసెంబ్లీ ఆమోదం

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ శాఖకు సంబంధించి ఐదు సవరణ బిల్లులను మంత్రి నారాయణ శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లులకు సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. నాలా చట్టం రద్దుతో పాటు మున్సిపాలిటీల్లో అభివృద్ధి చార్జీలను విధించే బిల్లులను సభ ఆమోదించింది. అలానే అర్బన్ ప్రాంతాల్లో బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీమ్‌కు సంబంధించి భవనాల ఎత్తును 18 మీటర్ల నుంచి 24 మీటర్లు పెంచే బిల్లుకు, వైఎస్ఆర్ తాడిగడప మున్సిపాలిటీ పేరును తాడిగడప మున్సిపాలిటీగా మార్పు చేసే బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లులపై ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, భవనాల రెగ్యులరైజ్‌కు ప్రభుత్వం అవకాశం కల్పించడం మంచి నిర్ణయమన్నారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, మున్సిపాలిటీల ఎక్స్‌టర్నల్ అభివృద్ధి చార్జీలను తిరిగి స్థానిక సంస్థలకే ఇవ్వడం గొప్ప నిర్ణయమన్నారు.

నిబంధనలకు లోబడే పరికరాల కొనుగోళ్లు

- ఈ-ప్రొక్యూర్మెంట్, కాంపిటీటివ్ బిడ్డింగ్ ద్వారానే కొంటున్నాం: మంత్రి గొట్టిపాటి

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఈ-ప్రొక్యూర్మెంట్, కాంపిటీటివ్ బిడ్డింగ్ ద్వారానే విద్యుత్ పరికరాలను కొంటున్నామని రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. విద్యుత్ పరికరాల కొనుగోళ్లు, ధరల సమాచారంపై ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, పేరాబత్తుల రాజశేఖరం గురువారం శాసనమండలిలో అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ కొనుగోళ్లన్నీ విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ) నిబంధనలకు లోబడే చేస్తున్నామని చెప్పారు. రూ.5 కోట్లకు పై బడిన కొనుగోళ్లకు ఈఆర్సీ అనుమతులు తీసుకుంటున్నామని, అలాగే పరికరాల కొనుగోళ్లలో నాణ్యతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో వ్యవసాయ, పారిశ్రామిక, ప్రజా అవసరాలకు 5 స్టార్ రేటింగ్ ట్రాన్స్‌ఫార్మర్లను వినియోగిస్తున్నట్లు తెలిపారు. జగన్ కాలనీల కోసం రూ.220 కోట్లతో కొనుగోలు చేసిన విద్యుత్ పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయని వాటి వల్ల ఉపయోగం కూడా లేదని చెబుతున్నారని మంత్రి చెప్పారు.

ఐటీడీఏల్లో ఖాళీలను భర్తీ చేస్తాం

- ఏపీపీఎస్సీ, డీఎస్సీ ద్వారా నియామకాలు: మంత్రి సంధ్యారాణి

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లోని పలు ఐటీడీఏల్లో మొత్తం 127 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ప్రత్యక్ష నియామక పోస్టులను ఏపీపీఎస్సీ డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తామని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి సంధ్యారాణి తెలిపారు. గురువారం శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. గిరిజన సంక్షేమ శాఖలో 2 వేల టీచర్ పోస్టులను డీఎస్సీ ద్వారా ప్రభుత్వం భర్తీ చేసిందని మంత్రి వివరించారు. గత ఐదేళ్లలో ఒక్కరికీ పదోన్నతి కల్పించలేదన్నారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే 19 మందికి పదోన్నతి ఇచ్చామన్నారు. ఐటీడీఏల్లో ఐఏఎస్ అధికారులను నియమించామన్నారు. కొత్తగా నియమించిన ఉపాధ్యాయ పోస్టుల కారణంగా ఎప్పటి నుంచో విద్యాబుద్ధులు నేర్పుతున్న కాంట్రాక్టు టీచర్లను తొలగించే ప్రతిపాదన ఏదీలేదని మంత్రి స్పష్టం చేశారు.

తప్పు చేసినవారిని వదలను



నాది కక్ష రాజకీయమైతే అధికారంలోకి రాగానే జైల్లో వేసేవాడిని

- ప్రజాస్వామ్యంపైనే నాడు వైసీపీ దాడి
- స్పీకర్, డిప్యూటీ స్పీకర్, సీఎం, డిప్యూటీ సీఎం.. అంతా బాధితులమే
- ఏ తప్పూ చేయని నాపై 17 కేసులు
- జైల్లోనూ డ్రోన్లతో నిరంతర నిఘా పెట్టారు
- రాజధాని మహిళల నుంచి నేతలదాకా కేసులు
- ఆ అరాచకాలు ఇప్పటికీ జీర్ణం కావట్లేదు
- అవన్నీ ప్రజలకు వివరించి చట్టపరంగా శిక్షిద్దాం: సీఎం చంద్రబాబు

శాంతిభద్రతలపై చర్చ సందర్భంగా సీఎం వెల్లడి

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): "అసెంబ్లీ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, సీఎం, డిప్యూటీ సీఎం.. ఇక్కడున్న చాలా మందిమి గత ప్రభుత్వ బాధితులమే. ఎప్పుడూ తప్పు చేయని నాపై 17 కేసులు పెట్టారు. జైల్లో బంధించి నా కదలికలపై నిఘాకోసం డ్రోన్లు ఎగురవేశారు. నేను కక్షపూరిత రాజకీయాలు చేస్తే అధికారంలోకి వచ్చిన మొదటి రోజే అరెస్టులు చేయించేవాళ్లం. నాకు ప్రజలు, రాష్ట్రం పట్ల బాధ్యత ఉంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గురువారం అసెంబ్లీలో రాష్ట్ర శాంతి భద్రతలపై చర్చలో ఆయన మాట్లాడారు. "నాగరిక ప్రపంచంలో శాంతి భద్రతలే కీలకం. గత ఐదేళ్ల అరాచకాలు ఇప్పటికీ జీర్ణం కావట్లేదు. అన్నీ చర్చించి ఆధారాలతో సహా చట్టపరంగా చర్యలు తీసుకుందాం. వాళ్లు (వైసీపీ నేతలు) చేసిన తప్పు మనం చేస్తే రాష్ట్రానికి న్యాయం జరగదు. తప్పు చేసిన ఎవరినీ వదిలిపెట్టను" అని ముఖ్యమంత్రి తెలిపారు. ఆనాటి వైసీపీ అరాచకాలను ఆయన గుర్తుచేశారు. "ప్రాజెక్టుల పరిశీలనలో ఉంటే వచ్చి.. అరెస్టు చేస్తున్నామన్నారు. కేసు ఏంటని అడిగితే చెప్పరు. ముందు జీపు ఎక్కండి అంటారు. అంగళ్లలో నాతో పాటు రామ్‌ప్రసాద్‌రెడ్డి, కిశోర్ కుమార్ అనే ఇద్దరు టీడీపీ కార్యకర్తలపై దాడి చేసి ఎదురు కేసులు పెట్టారు. ఈ వయసులో అయ్యన్నపాత్రుడిపై అత్యాచారం కేసు పెట్టారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి, చింతమనేని ప్రభాకర్, దేవినేని ఉమా, కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి, పులివర్తి నాని.. ఆఖరికి ఎంతో సౌమ్యుడైన నిమ్మల రామానాయుడుపైనా పదుల సంఖ్యలో కేసులు పెట్టారు. విశాఖలో పవన్ కల్యాణ్, యువగళంలో లోకేశ్... ఎవ్వరినీ వదలకుండా వేధించారు. మిమ్మల్ని కాపాడుకోవడానికి ఆ రోజు (రఘురామ కృష్ణంరాజు అరెస్టు) రాత్రంతా నిద్ర లేకుండా అన్ని కోర్టుల్లోని లాయర్లతో సమన్వయం చేసుకొంటూ గడిపాం. అమరావతికి భూములిచ్చిన రైతులను వేధించి కేసులు పెట్టారు. న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు.. అనే కార్యక్రమానికి వెళుతున్న మహిళలు కన్నీళ్లు పెట్టుకుని రోడ్లపైనే భోజనాలు చేసే దారుణ స్థితి కల్పించారు. అప్పటి అరాచకాలన్నీ చెప్పాలంటే రోజులు సరిపోవు. మీ ఆవేశంలో అర్థముంది.. మీ ఆవేదన పట్ల సానుభూతి ఉంది. నేనూ బాధితుడినే. కాకపోతే నాది కక్ష రాజకీయం కాదు. అందుకే 23 క్లైమోర్‌లతో పేల్చినా.. బయటపడి 23వసారి తిరుమలేశుడికి పట్టువస్త్రాలు సమర్పించాను" అని చంద్రబాబు వివరించారు. మావోయిస్టుల హింసకు తాను వ్యతిరేకం తప్ప వారితో ఎలాంటి ఇబ్బందీ లేదన్న చంద్రబాబు, తనకు రాష్ట్ర భవిష్యత్తు తప్ప ప్రాణాలు ముఖ్యం కాదని వ్యాఖ్యానించారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే..

నేర ప్రవృత్తిని కట్టడి చేద్దాం.

"రాష్ట్రంలో నేర ప్రవృత్తి ఉన్న ప్రతి ఒక్కరినీ కట్టడి చేసి వీలైనంత మేరకు నేరాలు తగ్గించేందుకు అందరం కృషి చేద్దాం. హింసకు పాల్పడితే సొంత మనుషులైనా ఉపేక్షించబోను. గతంలో భూమా నాగిరెడ్డి, బైరెడ్డి రాజశేఖర్ రెడ్డిని కూడా ఫ్యాక్షన్ గొడవల్లో అరెస్టు చేయించాను. అప్పట్లో పోలీసు వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసేది. గత ఐదేళ్లలో భ్రష్టు పట్టించారు. నేరస్థులకు అండగా ఉండే రాజకీయ నాయకుల్ని చూశాను తప్ప నేరస్థులే రాజకీయ ముసుగు వేసుకుని అరాచకాలకు పాల్పడం వైసీపీ హయాంలోనే చూశాను."

చట్టాన్ని బలోపేతం చేస్తాం..

"మారుతున్న కాలానికి అనుగుణంగా సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలు పెరుగుతున్నాయి. వాటి కట్టడికి పోలీసుశాఖ సైబర్ కమెండోలను సిద్ధం చేస్తోంది. డిజిటల్ అరెస్టులు, ఈడీ, సీబీఐ అనగానే విద్యావంతులే కోట్ల రూపాయలు సైబర్ నేరగాళ్లకు సమర్పించుకొంటున్నారు. ఇది బాధాకరం. ఫేక్ ప్రచారాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. ఇతర దేశాల్లో టీమ్‌లు ఏర్పాటు చేసుకుని తప్పుడువార్తలు సృష్టించి సోషల్ మీడియాలో వదులుతున్నారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ పైశాచికానందం పొందుతున్నారు. త్వరలో చట్టాన్ని మరింత బలోపేతం చేసి ఇలాంటి వారిని శిక్షిస్తాం. రాజధానికి భూములిచ్చిన ఆడబిడ్డల్ని వ్యభిచారులనడం కన్నా దారుణం ఏముంటుంది? మా ప్రభుత్వం అధికారంలోకొచ్చే నాటికి రాష్ట్రమంతా గంజాయి, మత్తు విస్తరించింది. ఈగల్ వింగ్ ఏర్పాటు చేసి గంజాయి జీరో సాగులోకి తీసుకొచ్చే క్రమంలో దాదాపు విజయం సాధించాం."

బాధితులకు న్యాయం చేస్తాం..

"వైసీపీ అరాచకాలకు బలైన వారి కుటుంబసభ్యులకు న్యాయం చేస్తాం. టీడీపీ కార్యకర్త తోట చంద్రయ్య, సోదరిని రక్షించుకునే క్రమంలో ఆహుతైన అమరేంద్ర గౌడ్, వైసీపీ ఎమ్మెల్సీ డ్రైవర్ సుబ్రమణ్యం, దళిత డాక్టర్ సుధాకర్, పల్నాడులో జల్లయ్య హత్య కేసు, వైసీపీ నేత అదే జిల్లాలో గిరిజన మహిళను ట్రాక్టర్‌తో తొక్కించిన ఘటన, కడపలో వెటర్నరీ డాక్టర్ హత్య తదితర కేసులపై సీబీఐ దర్యాప్తు చేస్తోంది. బాధ్యులకు కోర్టుల్లో శిక్షలు పడేలా ఆధారాలు సేకరిస్తోంది" అని చంద్రబాబు తెలిపారు.

వర్గీకరణ బిల్లుకు.. మండలి ఏకగ్రీవ ఆమోదం

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉప వర్గీకరణ బిల్లును శాసనమండలి ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ బిల్లును గురువారం సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి ప్రవేశపెట్టారు. వర్గీకరణ బిల్లు ఉద్దేశాన్ని వివరించారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగానే బిల్లు రూపొందించామని.. సామాజిక అసమానతలు తొలగించి, ఎస్సీల అభ్యున్నతే లక్ష్యంగా దీనిని తెచ్చామని తెలిపారు. చర్చ సందర్భంగా వైసీపీ ఎమ్మెల్సీ పి.రవీంద్రబాబు మాట్లాడుతూ.. కులాలను విడగొట్టి, రిజర్వేషన్లు కల్పించడం సరికాదని.. వర్గీకరణతో మాల, మాదిగలు విడిపోవడం ఎస్సీల ఐక్యతకు మంచిది కాదని వ్యాఖ్యానించారు. వర్గీకరణతో అంబేడ్కర్ హృదయం బాధపడుతుందన్నారు. కులగణన చేసి, రిజర్వేషన్లు నిర్ణయిస్తే బాగుంటుందని చెప్పారు. వైసీపీ తరఫున బిల్లుకు మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు. వైసీపీ ఎమ్మెల్సీ ఎం.అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. వర్గీకరణలో రోస్టర్ పాయింట్స్ ఎలా ఉన్నా.. సామాజిక న్యాయం కోసం బిల్లుకు మద్దతిస్తున్నట్లు చెప్పారు. మండలి ఛైర్మన్ మోషేన్‌రాజు మాట్లాడుతూ.. 'చాలా పోరాటాల తర్వాత సుప్రీం కోర్టు తీర్పు, ఏకసభ్య కమిషన్ సిఫారసుతో వర్గీకరణ బిల్లు తేవడం హర్షణీయం. ఒక వర్గం ఎక్కువ లబ్ధి పొందడం, ఇంకో వర్గం వెనుకబాటుకు గురికావడం కరెక్టు కాదు. అయితే వెనుకబాటుతనం ఎందుకు వచ్చింది.. మాల, మాదిగల మధ్య వ్యత్యాసం ఎందుకు వచ్చిందని ఆలోచన చేయాలి. వాటా పంచడం వల్ల ఆర్థికంగా, సామాజికంగా మార్పు వస్తుందనుకోలేం. ఆర్థికంగా, సామాజికంగా ఈ వర్గాలు ముందుకెళ్లాలంటే అందరితో పాటు వారికీ సౌకర్యాలు అందాలి. ముఖ్యంగా విద్య అందించాలి. చదువు లేకుండా వాటా పంచినంత మాత్రాన ప్రయోజనం ఉండదు. చదువుకునేవారు లేనప్పుడు ప్రభుత్వం ఇచ్చే లబ్ధికి ఉపయోగం ఉండదు. వారు సమాజంలో కలిసే వెసులుబాటు కల్పించాలి. మూడో కేటగిరీలో మాల, మాల అయ్యవార్లను చేర్చడం వల్ల వీరి మధ్య పోటీ ఏర్పడుతుంది. రెండో కేటగిరీలో మాదిగలకు మాదిరిగానే మాలలకూ ప్రత్యేకంగా రోస్టర్ పెట్టాలి' అని సూచించారు. ఎస్సీ, ఎస్టీల విషయంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రత్యేక చట్టం తెచ్చి, వారి అభ్యున్నతికి అనేక రకాలుగా కృషి చేశారని తెలిపారు. దీనిని ఏ పార్టీ రాజకీయాల కోసం వాడుకోవద్దని కోరారు. మంత్రి స్వామి వివరణ ఇస్తూ.. ఏక సభ్య కమిషన్ సిఫారసు మేరకు మొత్తం 59 కులాలకు 15 శాతం రిజర్వేషన్‌లో.. గ్రూపు-1లోని 12 కులాలకు ఒక శాతం, గ్రూపు 2లోని 18 గుర్తించిన కులాలకు 6.5 శాతం, గ్రూపు-3లో 29 కులాలకు 7.5 శాతం కోటా కల్పించినట్లు చెప్పారు. వర్గీకరణ అంశం చాలా సున్నితమైందని, ఎస్సీలు కలిసిమెలిసి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విపక్ష నేత బొత్స సత్యనారాయణ సూచించారు. దీనిని ఏ పార్టీ కూడా రాజకీయాలకు వాడుకోకూడదన్నారు. ఈ బిల్లును వైసీపీ పూర్తిగా సమర్థిస్తోందని చెప్పారు.

మండలిలో 'ఎమ్మెల్యే' దుమారం

- కుప్పం ఎమ్మెల్యే అంటూ సీఎం చంద్రబాబును ఏకవచన సంబోధన చేసిన వైసీపీ సభ్యుడు
- తీవ్ర అభ్యంతరం తెలిపిన కూటమి సభ్యులు

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును కుప్పం ఎమ్మెల్యే అంటూ వైసీపీ ఎమ్మెల్సీ రమేశ్‌యాదవ్ సంబోధించడం గురువారం శాసనమండలిలో పెద్ద దుమారం రేపింది. సభానాయకుడిని ఎమ్మెల్యే అంటూ ఏకవచనంతో మాట్లాడతారా.... అంటూ కూటమి మంత్రులు, ఎమ్మెల్సీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. సీఎంను అగౌరవపర్చినందుకు వైసీపీ సభ్యుడితో సభకు క్షమాపణ చెప్పించాలని మండలి ఛైర్మన్‌ను అధికార పక్షం పట్టుబట్టగా, వైసీపీ సభ్యులు నిలబడి వాదనకు దిగారు. విపక్ష నేత బొత్స సత్యనారాయణ స్పందిస్తూ.. నాటి కుప్పం ఎమ్మెల్యే అని తమ సభ్యుడు సంబోధించారంటూ సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయితే ఉద్దేశపూర్వకంగానే చంద్రబాబును అగౌరవపర్చారంటూ టీడీపీ సభ్యులు ఛైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. వైసీపీ సభ్యుడి వ్యాఖ్యలను పరిశీలించి, రికార్డుల నుంచి అభ్యంతరకర వ్యాఖ్యలను తొలగించాలని మంత్రులు, అధికార పక్ష సభ్యులు డిమాండ్ చేశారు. జగన్‌ను మాఫియా డాన్ అంటే వైసీపీ సభ్యులు ఒప్పుకొంటారా... అని టీడీపీ సభ్యులు ప్రశ్నించారు. దీనిపై అధికార పక్ష, విపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం సాగింది. అంతకుముందు...ప్రభుత్వ 'సూపర్‌సిక్స్' పథకాలపై శాసనమండలిలో లఘు చర్చ జరిగింది. వైసీపీ సభ్యుడు రమేశ్‌యాదవ్ మాట్లాడుతూ, "సూపర్‌సిక్స్ అమలు చేస్తామని ఎన్నికల ముందు ఇంటింటికీ తిరిగి బాండ్లు ఇచ్చారు. బీటెక్, ఎంటెక్‌లు చదివి, తెలంగాణలో ఉన్న ఏపీ విద్యార్థులకు కూటమి అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లో ఉద్యోగాలిస్తామంటే.. వాళ్లు వచ్చి ఇక్కడ ఓట్లు వేశారు. కానీ, ఉద్యోగాలు లేవు.. నిరుద్యోగ భృతి ఇవ్వట్లేదు" అని విమర్శించారు. ఇదే సందర్భంలో..." జగన్ ఒక్క సంతకంతో ఆనాడు లక్షా 32వేల సచివాలయ ఉద్యోగాలిచ్చారు. కావాలంటే కుప్పం ఎమ్మెల్యే పరిశీలించుకోవచ్చు" అని వ్యాఖ్యానించారు.

సభ్యుడు క్షమాపణ చెప్పాలి

రమేశ్ యాదవ్ వ్యాఖ్యలపై మంత్రులు, అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఛైర్మన్ పోడియం వద్దకు వెళ్లి అభ్యంతరకర వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని, సభ్యుడిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సీఎంను అగౌరవపర్చినందుకు క్షమాపణలు చెప్పాలని మంత్రి కొల్లు రవీంద్ర డిమాండ్ చేయగా, సీఎం సభా నాయకుడన్న విషయం మరిచిపోయి ఎమ్మెల్యే అని ఎలా సంబోధించారని మంత్రి మనోహర్ నిలదీశారు. "మెగా డీఎస్సీ నిర్వహించి, టీచర్ అభ్యర్థులకు నియామక పత్రాలు పంపిణీ చేస్తుంటే ప్రతిపక్ష సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. కడుపు మంటగా ఉంటే జల్‌సిల్ మాత్రలు పంపుతాం.. వేసుకోని, కడుపు మంట తగ్గించుకోండి" అంటూ మంత్రి కేశవ్ ఎద్దేవా చేశారు. విపక్ష నేత బొత్స మాట్లాడుతూ.. సూపర్‌సిక్స్‌పై చర్చ జరగాలని ప్రభుత్వమే బీఏసీలో పెట్టిందన్నారు. "మంత్రుల వద్ద సమాచారం ఉంటే చెప్పాలి. అంతేగానీ సభ్యులు మాట్లాడొద్దనడం సరికాదు. మా సభ్యుడు తప్పు మాట్లాడితే అభ్యంతరం తెలపొచ్చు. ఆయన చెప్పింది అవాస్తవమైతే.. రూలింగ్ ఇవ్వాలి." అని తెలిపారు. ఆనాటి కుప్పం ఎమ్మెల్యే అంటే కోపం ఎందుకని అన్నారు. అయితే... వైసీపీ సభ్యుడు ఆనాడు.. అనే పదం వాడలేదని అధికారపక్ష సభ్యులు చెప్పారు. రికార్డులు చూద్దాం... అభ్యంతరకర మాటలుంటే ఏం చెప్తారంటూ వైసీపీ సభ్యులను సవాల్ చేశారు. అదే అంశంపై మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, బీజేపీ సభ్యుడు సోము వీర్రాజు, మంత్రి సవిత, టీడీపీ సభ్యులు శ్రీకాంత్, రాంగోపాల్‌రెడ్డి, అనురాధ, శ్రీకాంత్ తమ అభ్యంతరం తెలియజేశారు. ఈ గందరగోళ పరిస్థితుల్లోనే రికార్డుల పరిశీలన కోసం సభను ఛైర్మన్ కొద్దిసేపు వాయిదా వేశారు. రికార్డులు చూశాక సభ్యుని మాటలు అభ్యంతరకరంగానే ఉన్నాయని, మరోసారి పూర్తిగా పరిశీలించి, రికార్డుల నుంచి తొలగిస్తామని తిరిగి సభ ప్రారంభం కాగానే ఛైర్మన్ ప్రకటించారు. ఇంతటితో ఈ అంశాన్ని ముగిద్దాం అన్నారు. అనంతరం మంత్రి కేశవ్ చొరవతో మండలిలో సభ్యుల సత్ప్రవర్తన గురించిన చర్చ కొంతసేపు జరిగింది.

365 కోట్లతో 6 ఫిషింగ్ హార్బర్లు: జనార్దనరెడ్డి



అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆరు ఫిషింగ్ హార్బర్లను ఫేజ్-2లో నిర్మిస్తామని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 365 కోట్లు వరకూ ఇస్తుందని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన రెడ్డి చెప్పారు. గురువారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్రంలో నౌకా నిర్మాణ పరిశ్రమలకు సంబంధించి ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో షిప్ బిల్డింగ్, షిప్ బ్రేకింగ్ పరిశ్రమలను ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ప్రతి 50 కిలోమీటర్లకు ఒకచోట షిప్ బిల్డింగ్ ఏర్పాట్లు చేయాలనే ఆలోచనలో ఉన్నామన్నారు. తొలుత బుడగట్లపాలెంలో రూ. 186 కోట్లలో షిప్ హార్బర్ నిర్మించాలని అంచనాల సిద్ధం చేశామన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే ఈశ్వరరావు మాట్లాడుతూ, నౌక నిర్మాణం, రిపేరు, బ్రేకింగ్ యూనిట్లు ఏపీలో ఒక్కటి కూడా లేదన్నారు. గతంలో ఏపీలో నౌకా నిర్మాణ పరిశ్రమ ఉండేదన్నారు. ఆ పరిశ్రమలతో కోట్ల ఆదాయం వస్తుందన్నారు. రాయితీలు ప్రకటిస్తే మంచి సంస్థలు రాష్ట్రానికి వస్తాయని చెప్పారు. అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ, నౌకలకు సంబంధించి ఏపీలో విశాఖపట్నానికి కీలక స్థానం ఉందన్నారు. గతంలో ఇక్కడ ఉన్న నౌకా నిర్మాణ పరిశ్రమను నేవీలో కలిపేశారని చెప్పారు.

మీరా పీఆర్సీ గురించి మాట్లాడేది?

- ఉద్యోగుల పట్ల దుర్మార్గంగా వ్యవహరించారు: పయ్యావుల

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల పట్ల గత వైసీపీ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించిందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. వారు దాచుకున్న జీపీఎఫ్ సొమ్మును సైతం ఇతర అవసరాలకు వాడేసిందని ఆరోపించారు. ఇప్పుడు ఉద్యోగుల విషయంలో వైసీపీ సభ్యులు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా మాట్లాడుతున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఆర్సీ పునర్నిర్మాణం, బకాయిల చెల్లింపు అంశాలపై శాసనమండలిలో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో వైసీపీ సభ్యులు వేసిన ప్రశ్నలకు పయ్యావుల సమాధానం ఇచ్చారు. 'గత వైసీపీ ప్రభుత్వం రూ.21వేల కోట్ల ఉద్యోగుల సొమ్మును వాడేసింది. ఇప్పుడు ఆ పార్టీ సభ్యులు బకాయిలు అంటున్నారు. వాటిని వారసత్వంగా ఇచ్చింది ఎవరు?' అని మంత్రి నిలదీశారు. 'ఉద్యోగులకు జగన్ సర్కారు రివర్స్ పీఆర్సీ ఇచ్చింది. ఐఆర్ కంటే తక్కువగా 23శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి అన్యాయం చేసింది. కరోనా వంక చెప్పి కేంద్రం నుంచి రెండేళ్లుగా రావాల్సిన రెవెన్యూ లోటు మొత్తం రూ.40వేల కోట్లు ముందే తీసుకుంది' అని పయ్యావుల మండిపడ్డారు. ఉద్యోగుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం కూటమి అన్ని చర్యలు తీసుకున్నామని, తమది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమన్నారు. గతంలో తెలంగాణ కంటే ఒక శాతం ఎక్కువ అంటే 43శాతం ఫిట్‌మెంట్ ఇచ్చామని గుర్తుచేశారు. ఉద్యోగులకు జగన్ ప్రభుత్వం పెట్టిన బకాయిల చెల్లింపునకు దశల వారీగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 2024-25లో ఉద్యోగులకు సంబంధించి రూ.11,496కోట్లు, 2025-26లో రూ.3,549 కోట్ల బకాయిలు తమ ప్రభుత్వం చెల్లించిందని వివరించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రాధాన్యతా క్రమంలో చెల్లిస్తామన్నారు. పీఆర్సీ కమిషన్ నియామకంపై సీఎం చంద్రబాబు సరైన సమయంలో చర్యలు తీసుకుంటారని మంత్రి ప్రకటించారు.

అసెంబ్లీలో ఏఐ ఆధారిత హాజరు!

- ఫేస్ రికగ్నిషన్ ద్వారా సభ్యుల గుర్తింపు
- శీతాకాల సమావేశాల నుంచి అమలు

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆధారిత హాజరు నమోదుకు కసరత్తు జరుగుతోంది. రెండు రోజులుగా ప్రయోగాత్మకంగా ఏఐ ఆధారిత హాజరు నమోదు చేస్తున్నారు. డిసెంబరులో జరగనున్న శీతాకాల సమావేశాల్లో పూర్తిస్థాయిలో ఏఐ ఆధారిత హాజరు విధానాన్ని అమలు చేయనున్నారు. ప్రస్తుతం శాసనసభ, శాసనమండలిలోకి వెళ్లే ముందు సభ్యులు బయట హాజరు పట్టికలో సంతకం చేసి లోపలికి వెళుతున్నారు. ఇకపై హాజరు పట్టికతో అవసరం ఉండదు. కానీ హాజరు పట్టికను ఉంచాలా తీసివేయాలా అన్నదానిపై స్పీకర్, శాసనమండలి ఛైర్మన్ నిర్ణయిస్తారు. సభలు ప్రారంభమయ్యే సమయంలో హాజరు తీయడంతో పాటు నిర్ణీత సమయాల్లో సభలో ఎంతమంది సభ్యులు ఉన్నారో తెలుసుకునేందుకూ ఈ ఏఐ ఆధారిత హాజరు ఉపయోగపడుతుంది. ఇప్పటి వరకు ఈ బాధ్యతను ఆయా పార్టీల విప్‌లు చూసుకునేవారు. అలాగే వైసీపీ ఎమ్మెల్యేలు శాసనసభకు రాకుండానే బయట రిజిస్టర్‌లో సంతకాలు పెట్టి జీతభత్యాలు తీసుకుంటున్నారన్న అంశం ప్రస్తుతం వివాదాస్పదమవుతోంది. ఏఐ ఆధారిత హాజరుతో దానికి చెక్ పెట్టవచ్చని భావిస్తున్నారు.

పనిచేసే విధానం ఇదీ...

ప్రస్తుతం ట్రాఫిక్ నియంత్రణకు వాడే కెమెరాలు కేవలం వీడియోను రికార్డు చేస్తాయి. వ్యక్తులను గుర్తించే సాఫ్ట్‌వేర్ ఈ కెమెరాలకు లేదు. కానీ ఏఐ ఆధారిత హాజరు విధానంలో సాధారణ కెమెరాకు వ్యక్తులను గుర్తించే ఏఐ సాఫ్ట్‌వేర్‌ను యాడ్ చేస్తారు. తద్వారా సభలో ఫలాన సభ్యుడు ఈ రోజు సభకు వచ్చారు. ఫలాన సభ్యుడు సభకు రాలేదని గుర్తించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తుంది. ఏఐ ఆధారిత హాజరు విధానంలో శాసనసభ, శాసనమండలిలోని సభ్యుల ఫొటోలను ముందుగా వెక్టరైజేషన్ చేస్తారు. ఒక్కో ఫొటోను 175 వెక్టర్ పాయింట్స్‌గా తీసుకుని కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేస్తారు. ఆ తర్వాత శాసనసభ, శాసనమండలిలో పీటీజెడ్(పాన్.. టిల్ట్.. జూమ్) కెమెరాలను ఏర్పాటు చేసి వాటికి ఏఐ సాఫ్ట్‌వేర్‌ను అనుసంధానిస్తారు. ఈ కెమెరా రూ.50వేల వరకు ఉంటుందని అంచనా. ఏఐ ఆధారిత హాజరు విధానంలో ఎక్కడా మానవ ప్రమేయం లేకుండా డ్యాష్‌బోర్డుకు సమాచారం చేరిపోతోంది.

సభ్యుల గైర్హాజరుపై సీఎం సీరియస్

అసెంబ్లీకి ఆలస్యంగా వచ్చి సమావేశాలు ప్రారంభం కాకముందే వెళ్లిపోతున్న ఎమ్మెల్యేలపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. సభకు గైర్హాజరయ్యే వారిని ఒకటికి రెండుసార్లు హెచ్చరించి, తర్వాత కూడా మారకుంటే వారిపై చర్యలకు ఉపక్రమించాలని చీఫ్ విప్‌లను ఆదేశించారు. సభ ప్రారంభ సమయాన్ని ఉదయం 9గంటల నుంచి 10గంటలకు మార్చినా ఇంకా గైర్హాజరుకావడం ఏమిటని సీఎం ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం అసెంబ్లీ ప్రారంభమయ్యే సమయానికి సభలో 30మంది ఎమ్మెల్యేలే ఉన్నారు. వెంటనే చీఫ్ విప్, విప్‌లు అప్రమత్తమై క్యాంటీన్ వద్ద లాబీల్లో ఉన్న 17 మంది ఎమ్మెల్యేలను పిలిపించారు.



సభా ప్రాంగణం వద్ద ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల విజయ సంకేతం



- మెగా డీఎస్సీ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో వేదికపై నుంచి సీఎం చంద్రబాబు అభివాదం, పక్కన మంత్రి లోకేశ్, బీజేపీ ఏపీ చీఫ్ మాధవ్



థ్యాంక్యూ సీఎం సార్ ప్లకార్డులతో కొత్త టీచర్ల ఆనందోత్సాహం

ఇక ఏటా డీఎస్సీ

(మొదటి పేజీ తరువాయి)

ఒక్క అభ్యర్థి కూడా ఎవ్వరికీ డబ్బులు ఇచ్చే అవసరం లేకుండా నియామక ప్రక్రియను లోకేశ్, ఆయన బృందం పారదర్శకంగా చేపట్టారు. మంత్రుల దగ్గర నుంచి దీన్నే మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. వచ్చిన అవకాశాన్ని బాగా పనిచేసి నిరూపించుకున్నారు. 'బాబు ష్యూరిటీ- జాబు గ్యారంటీ' నెరవేరింది. మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉద్యోగాలు భర్తీచేశాం. 15 ఏళ్లలో 14సార్లు డీఎస్సీ నిర్వహించి, 1,96,619 మందికి ఉద్యోగాలిచ్చాం. రాష్ట్రంలో చేతగాని ప్రతిపక్షం ఉంది. మంచి చేయలేరు. మంచి జరిగితే చూస్తూ సహకరించలేరు. డీఎస్సీని అడ్డుకోవాలని 106 కేసులు వేశారు. ఇవి ప్రైవేటు వారు వేసిన కేసులు కాదు. రాజకీయ ప్రయోజనాల కోసం వేశారు. ఒక్క కేసు కూడా నిలవకుండా సజావుగా డీఎస్సీ నిర్వహించిన లోకేశ్‌ను అభినందిస్తున్నా. 1998లో టీచర్ ఉద్యోగాలకు కౌన్సిలింగ్ విధానం తీసుకొచ్చాను. పోస్టింగుల కోసం రాజకీయ నాయకుల దగ్గరకు వెళ్లి పైరవీలు చేసేవాళ్లు. ఈ రోజు ప్రతిభ ఆధారంగా కౌన్సిలింగ్ చేస్తున్నాం. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. కుటుంబ వ్యవస్థను గౌరవించడం మన సంప్రదాయం. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచడం కోసం చాగంటి కోటేశ్వరరావును సలహాదారుగా నియమించాం. ఆయన రాసిన పుస్తకాలు మీరు ఉపయోగించుకోవాలి. పిల్లలకు విలువలతో కూడిన విద్య నేర్పాలి' అని సీఎం సూచించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

విద్యావ్యవస్థను నాశనం చేశారు

'గత ప్రభుత్వ నిర్లక్ష్యం విద్యావ్యవస్థకు శాపంగా మారింది. 10 లక్షల మంది పిల్లలు ప్రైవేటు బడులకు వెళ్లిపోయారు. డ్రాపవుట్లు పెరిగాయి. ప్రాథమిక విద్యను మాతృభాషలోనే చదువుకోవాలి. ఇంగ్లీషు మీడియం అన్నారు. నేను పల్లెటూరిలో ప్రభుత్వ పాఠశాలలో తెలుగులో చదివాను. తెలుగు మీడియం చదివి ప్రపంచవ్యాప్తంగా సంపాదిస్తున్నారు. లేనిపోని సమస్యలు తెచ్చి విద్యావ్యవస్థను నాశనం చేశారు. నాడు-నేడులో రూ.7,876 కోట్ల విలువైన పనులు పూర్తికాలేదు. 21,151 స్కూళ్లలో బెంచీలు లేవు. వారి హయాంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థుల సంఖ్య 8శాతం పడిపోయింది. కానీ ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల ముందు 'నో అడ్మిషన్' బోర్డులు పెట్టే పరిస్థితి వచ్చినందుకు గర్వంగా ఉంది. 'తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం కోసం మెగా టీచర్స్ పేరెంట్స్ మీటింగ్ నిర్వహించాం. 'మన బడి-మన భవిష్యత్' కింద బడుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాం. 'వన్ క్లాస్- వన్ టీచర్' విధానాన్ని 9,625 పాఠశాలల్లో ప్రారంభించాం. బదిలీ చట్టం తీసుకొచ్చి 72,886 బదిలీలు, 4,477 ప్రమోషన్లు పారదర్శకంగా చేశారు. ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. దీనికి విద్యాశాఖను అభినందిస్తున్నాను. తల్లికి వందనం పథకం ద్వారా ఎంత మంది పిల్లలుంటే అంత మందికి రూ.15,000 చొప్పున ఇచ్చాం. ప్రతి శనివారం నో బ్యాగ్ డే పెట్టి పుస్తకాల భారం తప్పించారు. పుస్తకాలు, యూనిఫాంలు, బ్యాగులు సరైన సమయంలో ఇచ్చారు ప్రైవేటు కంటే ప్రభుత్వ స్కూళ్లలో మంచి సౌకర్యాలు ఉన్నాయి. మంచి టీచర్లు ఉన్నారు. ఈ రెండూ ఉన్నా కూడా నాయకత్వం లోపంతో వెనకబడుతున్నాం. కానీ, ఇప్పుడు లోకేశ్ రూపంలో మంచి నాయకత్వం వచ్చింది' అని చంద్రబాబు పేర్కొన్నారు. అనంతరం కొత్త టీచర్లంతా వారి కర్తవ్య నిష్ఠ ప్రతిజ్ఞ చేశారు. కాగా, అనారోగ్యం కారణంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సభకు హాజరు కాలేకపోయారు. ఉద్యోగ విధుల్లో చేరుతున్న కొత్త ఉపాధ్యాయులకు ఆయన ఓ ప్రకటన ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.



వేదికపై చంద్రబాబు వద్ద కూర్చుని మాట్లాడుతున్న లోకేశ్

> భవిష్యత్తులో విద్యారంగంలో ఎలాంటి మార్పులొస్తాయో ఇప్పటినుంచే టీచర్లు ఆలోచించాలి. ఈ రోజు ప్రైవేట్ రంగం నుంచి శాటిలైట్లు ప్రయోగిస్తున్నారు. రక్షణకు, రోజువారీ పనులకు డ్రోన్లను వాడుతున్నారు. వాట్సాప్ ద్వారా 750 సేవలు అందిస్తున్న ఏకైక రాష్ట్రం మనది.
>
> నేను నిత్య విద్యార్థిని. కొత్త విషయాలు నేర్చుకొని ప్రజలకు పనికొచ్చే వాటిని అమలు చేస్తున్నా.
>
> - సీఎం చంద్రబాబు

భారత్ విశ్వగురు కావాలి: మాధవ్

ప్రపంచంలో భారతదేశం విశ్వగురుగా మారాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆకాంక్షించారు. దానికి టీచర్లంతా సహకరించాలని కోరారు. కొత్త టీచర్లను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. 150 రోజుల్లోనే భర్తీ ప్రక్రియ పూర్తిచేసిన లోకేశ్‌కు అభినందనలు తెలియజేశారు.

మెగా డీఎస్సీ.. మెగా హిట్

- 15,941 మందికి నియామక పత్రాలు అందజేత
- అమరావతిలో వైవిధ్యంగా సభా వేదిక
- నాలుగు వైపులా తిరిగేలా ర్యాంప్ ఏర్పాటు
- జిల్లాల వారీగా టీచర్లకు గ్యాలరీలు
- అందరినీ పలకరించిన సీఎం, లోకేశ్, మాధవ్
- టీచర్ల ప్రశ్నలకు నాయకుల సమాధానాలు
- నా టీచర్‌ను ఇప్పటికీ మర్చిపోలేదన్న బాబు

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ మెగా హిట్ అయింది. ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం ఎదురుచూసిన 15,941 మంది కల నెరవేరింది. గురువారం అమరావతిలో నిర్వహించిన సభలో సీఎం చంద్రబాబు, అధికారుల చేతుల మీదుగా నియామక పత్రాలు అందడంతో వారి ఆనందం రెట్టింపైంది. రాష్ట్రం నలుమూలల నుంచీ తరలివచ్చిన కొత్త టీచర్లు ఎంతో ఉత్సాహంతో నియామక పత్రాలు అందుకున్నారు. పాఠశాల విద్యాశాఖ ఈ సభను నిర్వహించిన తీరు కూడా జోష్ పెంచింది. రొటీన్‌కు భిన్నంగా ప్లస్ ఆకారంలో సభా ప్రాంగణం మధ్యలో వేదిక ఏర్పాటుచేశారు. అక్కడి నుంచి నాలుగు వైపులా ప్రాంగణం చివరి వరకూ నడిచేలా ర్యాంపులు నిర్మించారు. సభలోకి అడుగుపెట్టగానే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ టీచర్ల మధ్యలో నుంచే నడుచుకుంటూ సభ నలువైపులా తిరిగి అందరినీ పలకరించారు. అందరితో కరచాలనం చేస్తూ తిరగడానికే అరగంట సమయం పట్టింది. అనంతరం వేదికపై కూడా ఈ ముగ్గురే ఉన్నారు. వారు కూర్చున్న సీట్లు అన్నివైపులా తిరిగేలా ఏర్పాటుచేయడంతో అన్ని వైపులా ఉన్నవారిని చూస్తూ ప్రసంగించారు. మరో వైపు జిల్లాల వారీగా టీచర్లకు గ్యాలరీలు ఏర్పాటుచేశారు. ఆయా జిల్లాల ఎమ్మెల్యేలు ఆ గ్యాలరీల్లోనే కూర్చున్నారు. అంతకుముందు అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రభుత్వం ఏర్పాటుచేసిన బస్సుల్లోనే సభా ప్రాంగణానికి చేరుకున్నారు. 15,941 మంది కొత్త టీచర్లు, వారి కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు అంతా కలిపి 34 వేల మందితో భారీఎత్తున సభ జరిగింది.

ఆకట్టుకున్న సక్సెస్ స్టోరీలు

మొత్తం 22మంది టీచర్లకు సీఎం, లోకేశ్, మాధవ్ నియామక పత్రాలు అందజేశారు. వారిలో 16 మంది వివిధ సబ్జెక్టుల్లో టాపర్లు. మరో ఆరుగురు అనేక కష్టాలను అధిగమించి ఉద్యోగాలు సాధించినవారు. వారి సక్సెస్ స్టోరీలను పాఠశాల విద్యాశాఖ వీడియోల రూపంలో ప్రదర్శించింది. స్కూల్ అసిస్టెంట్- సోషల్ ఉద్యోగం సాధించిన శ్రీకాకుళం జిల్లాకు చెందిన లక్ష్మణరావు, అల్లూరి జిల్లాకు చెందిన నాగవిజయ, క్రీడా కోటాలో ఉద్యోగం పొందిన జీవనజ్యోతి, పోలియో బాధితుడైనా 42ఏళ్ల వయసులో టీచర్ ఉద్యోగం సాధించిన రామారావు, వ్యవసాయం చేసుకుంటూ టీచర్ అయిన కళ్యాణదుర్గానికి చెందిన ఎం.నవీన్, కడప జిల్లాలో ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించిన షేక్ ముంతరీన్ వీడియోలు ఆకట్టుకున్నాయి.

అధికారులకు ప్రత్యేక అభినందన

మెగా డీఎస్సీ ప్రక్రియలో కీలకంగా వ్యవహించిన విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ వి.విజయరామరాజు, సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, మంత్రి ఓఎస్డీ ఆకుల వెంకటరమణను లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. ఇంత పెద్ద టాస్క్‌ను వారు కష్టపడి ముందుకు తీసుకెళ్లారని కొనియాడారు.

> జెండర్ ఈక్వాలిటీకి ఏం చర్యలు తీసుకుంటున్నారు?
>
> - బోకం అనిత, విశాఖపట్నం
>
> **లోకేశ్:** సమాజంలో మార్పు రావాలంటే ముందు మన ఇంట్లో రావాలి. మా ఇంట్లో తాత, చంద్రబాబు గారి నుంచి మహిళలను గౌరవించడం నేర్చుకున్నా. విద్యా మంత్రినయ్యాక పాఠ్యాంశాల్లో మార్పులు చేశాం. పాఠ్య పుస్తకాల్లో మహిళలు మాత్రమే ఇంటి పనులు చేస్తున్నట్లుగా ఉన్న ఫొటోలు తీసేశాం. ఇంటి పనులు పురుషులు కూడా చేయాలి. కేజీ నుంచి పీజీ వరకు జెండర్ సెన్సిటివిటీ తరగతులు తేవాలి. నాలుగేళ్లలో జెండర్ సెన్సిటివిటీ తరగతులు బోధిస్తాం. సినిమాలు, టీవీ షోల్లోనూ మహిళలను అగౌరవపర్చే డైలాగులు లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎంను కోరుతున్నా.
>
> మీ జీవితంపై టీచర్ ప్రభావం ఎలా ఉంది?
>
> - తేజసాయి, తూర్పుగోదావరి జిల్లా
>
> **పీవీఎన్ మాధవ్:** నేను గుడిలోవలో చదువుకున్నాను. మా ప్రిన్సిపాల్‌ను చూసి చాలా నేర్చుకున్నాను. ఆయనలో అహంకారం కనిపించేది కాదు. మాతో కలిసి భోజనం చేసేవారు. చిన్న విషయాలపై ఎక్కువ శ్రద్ధ చూపితే గొప్ప విషయాలు సాధించలేం అనేది ఆయన నుంచే నేర్చుకున్నా. మన అందరి దిశ మార్చేది టీచరే.

ప్రశ్నలు- సమాధానాలు

తొలి సంతకం డీఎస్సీ ఫైలుపైనే ఎందుకు పెట్టారు?

- ఆర్. ప్రవీణ, చిత్తూరు జిల్లా

చంద్రబాబు: మిమ్మల్ని చూస్తుంటే మీకంటే నాకే ఎక్కువ ఆనందంగా ఉంది. నేను సీఎం అయిన తొలి సారి నుంచీ విద్యకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ వచ్చాను. సూపర్ సిక్స్ మేనిఫెస్టోలో భాగంగానే మెగా డీఎస్సీని మెగా హిట్ చేశాం. గత ప్రభుత్వం ఒక్క టీచర్ ఉద్యోగం కూడా భర్తీ చేయలేదు. ఈ నేపథ్యంలోనే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశాను. ఎన్ని అడ్డంకులు వచ్చినా అధిగమించి 150 రోజుల్లోనే పూర్తిచేసిన లోకేశ్, అధికారులను అభినందిస్తున్నా. నాకు చిన్నప్పుడు పాఠాలు చెప్పిన భక్తవత్సలం టీచర్ ఇప్పటికీ గుర్తే. అలా గుర్తుంచుకునేది గురువులనే.

మా నాన్న కూడా టీచర్. ఇప్పుడు నేనూ అయ్యాను. మీ జీవితంలో బాగా గుర్తుంచుకున్న టీచర్ ఎవరు?

- జంధ్యాల అంజలి, ప్రకాశం జిల్లా

చంద్రబాబు: నేను ఎస్వీ యూనివర్సిటీలో చదువుకున్నాను. ఎకనమిక్స్‌లో ఎంఏ చేశాను. తర్వాత ఏం కావాలి అని అప్పట్లో ఆలోచిస్తూ ఉండేవాడిని. రకరకాల ఆలోచనల తర్వాత రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్నా. అప్పుడు నన్ను ప్రోత్సహించిన వ్యక్తి ప్రొఫెసర్ డీఎల్ నారాయణ. ఆ తర్వాత ఎమ్మెల్యేను, మంత్రిని, ముఖ్యమంత్రినయ్యా. ఒక్కోసారి ప్రోత్సాహం అనేది గొప్ప మార్పునకు దారితీస్తుంది.

రాష్ట్ర యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అందుకు ప్రణాళిక ఏంటి?

- సుమన్ నలుకుర్తి, గుంటూరు

లోకేశ్: యువగళం పాదయాత్రలో గంగాధర నెల్లూరులో ఓ గ్రామానికి వెళ్లాను. అక్కడ ఒక తల్లిని 'మా ప్రభుత్వం వచ్చాక మీకేం చేయాలి?' అని అడిగా. అప్పుడా తల్లి.. 'నా భర్త చనిపోయాడు, పిల్లల్ని కష్టపడి చదివించా. వారికి ఉద్యోగాలివ్వండి' అని అడిగింది. ఆరోజే ఉద్యోగాల కల్పనపై నిర్ణయం తీసుకున్నా. 20లక్షల ఉద్యోగాల హామీ ఇచ్చా. రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రాబోతున్నాయి. తద్వారా 10 లక్షల ఉద్యోగాలొస్తాయి. ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం.

150 కేసులు వేసినా...150 రోజుల్లోనే మెగా డీఎస్సీ పూర్తి

- డీఎస్సీ ఫైల్ పైనే తొలి సంతకమని అప్పుడే చెప్పా
- ఏపీ మోడల్ ఎడ్యుకేషన్‌ను ప్రపంచానికి చూపిద్దాం
- నాన్న చంద్రబాబే నా లైఫ్ టైం గురువు
- నవంబరులో మళ్లీ టెట్ నిర్వహిస్తాం: మంత్రి లోకేశ్

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): 150 కేసులు పెట్టినా కూడా 150 రోజుల్లో మెగా డీఎస్సీ పూర్తి చేయడం ఒక చరిత్ర అని విద్యాశాఖ మంత్రి లోకేశ్ అన్నారు. మెగా డీఎస్సీ విజేతలకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. "యువగళం పాదయాత్రలో నిరుద్యోగ యువతతో మాట్లాడేవాడిని. అప్పుడే మెగా డీఎస్సీ ఆలోచన మొదలైంది. సీఎం చంద్రబాబు తొలి సంతకం డీఎస్సీపైన పెడతారని అప్పుడే చెప్పాను" అని మంత్రి తెలిపారు. "దేశానికి అధినేత అయినా ఒక గురువు దగ్గర చదువుకున్న విద్యార్థే. నాకు లైఫ్ టైం గురువు మా నాన్న సీఎం చంద్రబాబు. మిమ్మల్ని చూస్తుంటే నా టీచర్లు గుర్తొచ్చారు. స్కూల్లో మంజులా మేడం కొట్టిన దెబ్బలు, రమాదేవి మేడం నేర్పిన డిసిప్లిన్, ఇంటర్‌లో నారాయణ మాస్టారు బ్రిడ్జ్ కోర్సు పాఠాలు, అమెరికాలో ప్రొఫెసర్ రాజిరెడ్డి మార్గదర్శకత్వం ఎప్పటికీ మర్చిపోలేను. ప్రపంచంలో ఏ రంగంలో ఉన్నవారైనా, ఎంత గొప్పవారైనా తమ టీచర్లను గౌరవిస్తూనే ఉంటారు" అని లోకేశ్ చెప్పారు. "సీఎం చంద్రబాబు చెప్పిన విధంగా ఇకపై ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం. నవంబరులో టెట్ చేపడతాం. వచ్చే ఏడాది మళ్లీ పారదర్శకంగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తాం" అని ఆయన ప్రకటించారు. 'రాష్ట్ర ప్రజలందరి ఆశీస్సులతో మాకు మూడు తరాలు డీఎస్సీ ప్రకటించే అవకాశం వచ్చింది. ఎన్టీఆర్, చంద్రబాబు తర్వాత నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు చేతులెత్తి నమస్కరిస్తున్నా. విద్యారంగాన్ని రాజకీయాలకు అతీతంగా ఉంచేందుకు పలు కీలకమైన సంస్కరణలు తెచ్చాం. సర్వేపల్లి రాధాకృష్ణ పేరుతో విద్యార్థి మిత్ర, డొక్కా సీతమ్మ గారి పేరిట మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నాం. ప్రాథమిక విద్యలో నాణ్యత పెంచేందుకు 9,600 స్కూళ్లలో వన్ క్లాస్- వన్ టీచర్ విధానాన్ని తెచ్చాం. విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త చాగంటి కోటేశ్వరరావును క్యాబినెట్ ర్యాంకుతో సలహాదారుగా నియమించాం. విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గించాం.. శనివారం నో బ్యాగ్ డే అమలు చేస్తున్నాం" అని లోకేశ్ తెలిపారు. "టీడీపీ విద్యకు ఎప్పుడూ తొలి ప్రాధాన్యం ఇస్తుంది. సీబీఎన్ అంటే డీఎస్సీ. ఇప్పటివరకూ 14 డీఎస్సీలు నిర్వహించి 2 లక్షల టీచరు పోస్టులు భర్తీ చేశాం. ఎస్సీ వర్గీకరణ జరిగిన తర్వాత నిర్వహించిన మొదటి డీఎస్సీ లోనే అమలు చేశాం. గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి అత్యధికంగా డీఎస్సీలో 49.9% పోస్టులను మహిళలు దక్కించుకోవడం చాలా సంతోషంగా ఉంది. నూతన ఉపాధ్యాయులంతా పట్టుదల, నిబద్ధతతో పనిచేసి విద్యావ్యవస్థలో మార్పుతేవాలి. సమష్టి కృషితో ప్రభుత్వ విద్యావ్యవస్థను దేశానికే దిక్సూచిగా మారుద్దాం. ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కోసం కలసికట్టుగా కృషిచేద్దాం. విద్య అంటే ఫిన్ ల్యాండ్, ఢిల్లీ మాత్రమే కాదు. ప్రపంచానికి ఆంధ్రా మోడల్ చూపిద్దాం" అని లోకేశ్ పిలుపునిచ్చారు. ఉత్తమ ఉపాధ్యాయులను ఫిన్‌ల్యాండ్, సింగపూర్ అధ్యయనానికి పంపించాలని సీఎంకు లోకేశ్ విన్నవించారు.

చిరస్థాయిగా నిలిచే శుభసమయం

- ఉద్యోగార్థుల ఏళ్ల నిరీక్షణకు తెరపడింది
- కొత్త ఉపాధ్యాయులకు డిప్యూటీ సీఎం పవన్ శుభాకాంక్షలు



అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏకకాలంలో 15,941 మంది ఉపాధ్యాయులను నియమించిన ఈ శుభ సమయం విద్యారంగంలో చిరస్థాయిగా నిలిచిపోతుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఉద్యోగార్థులు ఎన్నో ఏళ్లు డీఎస్సీ కోసం నిరీక్షించారని చెప్పారు. ఈమేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో యువతకు ఇచ్చిన మాటకు కట్టుబడి మెగా డీఎస్సీ ద్వారా వారికి దారి చూపిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. డీఎస్సీ నియామకాల ఫైలుపై సీఎం చంద్రబాబు తొలి సంతకం చేశారని గుర్తుచేశారు. సీఎం మార్గదర్శకత్వంలో విద్యాశాఖ మంత్రి, సోదరుడు లోకేశ్ ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియను విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లారని కొనియాడారు. ఈ ప్రక్రియలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. ఆరోగ్యం సహకరించని కారణంగా డీఎస్సీ నియామక పత్రాల ప్రధాన కార్యక్రమానికి తాను వ్యక్తిగతంగా హాజరు కాలేకపోయానని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను తీర్చిదిద్ది వారి భవితకు బాటలు వేసే బృహత్తర బాధ్యత ఈ రోజు నియామక పత్రాలు అందుకుంటున్న ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఆ దిశగా విధులు నిర్వర్తించాలని ఆకాంక్షించారు. ఉద్యోగ విధుల్లో చేరుతున్న ఉపాధ్యాయులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

వైసీపీ 'సోషల్' సైకోలపై కొరడా

- సీఎం 'యూరియా' వ్యాఖ్యలపై మార్ఫింగ్ వీడియోలు
- ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన సీఐడీ
- వీరిలో ప్రతాప్‌రెడ్డికి రిమాండ్ విధించిన ప్రత్యేక కోర్టు
- పోలీసులు తనను కొట్టారన్న సాయిభార్గవ్‌కు వైద్య పరీక్షలు
- వంటిపై గాయాలేవీ లేవని నిర్ధారణ
- నెల్లూరుకు చెందిన ప్రధాన నిందితుడు భరత్ పరార్

గుంటూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును, కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాల్జేసేందుకు ప్రయత్నించిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై సీఐడీ కన్నెర్రచేసింది. యూరియా వాడకానికి సంబంధించి చంద్రబాబు రైతుల పట్ల అనుచితంగా మాట్లాడినట్లుగా మార్ఫింగ్ వీడియోలు సృష్టించి సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేస్తున్నవారిపై మంగళగిరిలోని సీఐడీ కేంద్ర కార్యాలయంలో కేసు నమోదు చేశారు. ఈ వీడియోలను నెల్లూరుకు చెందిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త భరత్ సృష్టించాడు. వాటిని పాత గుంటూరు రెడ్ల బజారుకు చెందిన వజ్రాల తారక్ ప్రతాపరెడ్డికి, అదేవిధంగా అనంతపురం జిల్లా రాప్తాడు మండలం హంపాపురానికి చెందిన బాలకొండ సాయి భార్గవ్ సహా మరికొందరికి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పంపి వైరల్ చేశాడు. దీనిపై సీఐడీ అధికారులు బీఎన్ఎస్ 196, 353, 111(3)(4)(5), 143 రెడ్ విత్ 61(2) సెక్షన్లు, ఐటీ చట్టం 666కింద కేసు నమోదు చేశారు. నిందితుల కోసం సీఐడీ బృందాలు రంగంలోకి దిగడంతో ప్రధాన నిందితుడైన భరత్ పరారయ్యాడు. కేసులో ఏ-5 ప్రతాపరెడ్డి, ఏ-6 సాయి భార్గవ్‌లను సీఐ మధుబాబు ఆధ్వర్యంలో సీఐడీ పోలీసులు అరెస్టు చేసి గురువారం గుంటూరులోని ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. ప్రతాప్‌రెడ్డికి మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. ఏ-6 సాయి భార్గవ్.. పోలీసులు తనను కొట్టారని మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో న్యాయాధికారి ఎండీ గౌస్ అతడి స్టేట్‌మెంట్ రికార్డు చేసి వైద్య పరీక్షల నిమిత్తం జీజీహెచ్‌కు పంపారు. అయితే వైద్య పరీక్షల్లో సాయి భార్గవ్ శరీరంపై ఎటువంటి దెబ్బలు లేవని, ఎక్స్‌రేలో కూడా నార్మల్‌గా ఉన్నట్లు తేలింది. కోర్టులో ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ సుకుమార్ వాదనలు వినిపించారు.

ప్రతాపరెడ్డి ఖాతాకు భరత్ నుంచి నగదు బదిలీ

చంద్రబాబు మార్ఫింగ్ వీడియోలను పబ్లిక్ మైక్ అనే యాప్ ద్వారా మార్ఫింగ్ చేసి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వైరల్ చేస్తున్నారు. ఆ వీడియోలు సృష్టించిన భరత్ ఖాతా నుంచి.. నిందితుడు ప్రతాపరెడ్డి ఖాతాకు ఫోన్ పే ద్వారా నగదు బదిలీ జరిగినట్లు సీఐడీ అధికారులు ఆధారాలు సేకరించారు. నిందితులు మహిళల అక్రమ రవాణాలోనూ పాల్గొన్నట్లు సీఐడీ దర్యాప్తులో తేలింది. దీంతో సీఐడీ అధికారులు ఆయా సెక్షన్లను కూడా జోడించారు.

సైకోల అణచివేతకు చట్టాలు

- రాష్ట్రంలో నేరాలు తగ్గుముఖం
- అసెంబ్లీలో హోం మంత్రి అనిత వెల్లడి

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నేరాలు తగ్గుముఖం పట్టాయని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. శాసనసభలో గురువారం శాంతిభద్రతలపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా ఆమె మాట్లాడారు. "వైసీపీ హయాంలో శాంతిభద్రతలు లేవు. మద్యం ధరల భయంతో యువత గంజాయి వైపు మొగ్గుచూపింది. సీఎం చంద్రబాబు కఠినంగా వ్యవహరించడంతో పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చింది" అని పేర్కొన్నారు. గంజాయి మాఫియాను అరికట్టేందుకు ఇప్పటివరకు 40 వేలకు పైగా ఈగల్ క్లబ్స్‌ను ఏర్పాటుచేశామన్నారు. జాతీయ స్థాయి నివేదిక ప్రకారం రాష్ట్రంలో నేరాలు 60 శాతం మేరకు తగ్గాయని మంత్రి తెలిపారు. మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా శక్తి మొబైల్ యాప్ తీసుకొచ్చామన్నారు. అలాగే న్యాయవ్యవస్థను పటిష్ఠం చేయడం వల్ల కేసుల్లో నిందితులకు శిక్షలు పడుతున్నాయని చెప్పారు. రాజకీయ ముసుగులో ఉన్న నేరగాళ్లు సోషల్ మీడియాలో రెచ్చిపోతున్నారని, వారి ఉన్మాదం రాష్ట్రంలో పరిశ్రమల విస్తరణకు అడ్డంకిగా మారిందని అనిత మండిపడ్డారు. ఆర్థిక నేరాలు, డిజిటల్ నేరాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల అధ్యయనం కోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ చర్చలో భాగంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ.. వైసీపీ నేతల దుశ్చర్యలను ఉపేక్షించకుండా తగు చర్యలు తీసుకోవాలని హోంమంత్రికి సూచించారు. బీజేపీ పక్షనేత విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ, వీఆర్‌లో



ఉన్నప్పుడు పోలీసు అధికారులకు జీతాలు ఇవ్వడంలేదని మంత్రి దృష్టికి తెచ్చారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే వైసీపీ సైకోల విషయంలో జాప్యమెందుకంటూ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ప్రశ్నించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు తమపై కేసులు పెట్టి కొట్టి వేధించిన పోలీసులు ఇప్పటికీ నియోజకవర్గంలో ఉన్నారని.. వారిని బదిలీ చేయాలని హోంమంత్రికి లేఖలిచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. కత్తులతో తమ ఇంటి పైకి దాడికి వచ్చిన వారిపై ఇప్పటికి కేసులు పెట్టలేదని ఎమ్మెల్యే అస్మితరెడ్డి తెలిపారు.

సహనానికి హద్దు ఉంటుంది.. వైసీపీపై యరపతినేని ఫైర్

వైసీపీ హయాంలో రాష్ట్రంలో అప్రజాస్వామ్య పాలన సాగిందని టీడీపీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శాంతి భద్రతలపై చర్చలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. పల్నాడులో టీడీపీ కార్యకర్తలు గ్రామాల్లో ఉండలేని పరిస్థితిని అప్పటి జగన్ ప్రభుత్వం కల్పించిందన్నారు. 2019-24 మధ్య కాలంలో రాష్ట్రంలో దాదాపు 80మంది టీడీపీ కార్యకర్తలు హత్యలకు గురయ్యారన్నారు. "సహనానికి కూడా హద్దు ఉంటుంది. మేమే ఏమైనా చేయగలుగుతాం... అని వైసీపీ వాళ్లు అనుకుంటున్నారు. వాళ్లు ఒకటి చేస్తే మేం పది చేయగలుగుతాం. మాకు ఇక్కడ లక్ష్మణరేఖ ఉంది. సీఎంచంద్రబాబుకే నోటీసు ఇవ్వడానికి సీఐ శంకరయ్యకు ఎంత ధైర్యం" అంటూ యరపతినేని మండిపడ్డారు. ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, గంటా శ్రీనివాసరావు ఇదే అంశంపై మాట్లాడారు. అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పందిస్తూ, యరపతినేని మాటలు తనను కూడా ఆవేదనలోకి నెట్టాయన్నారు. "సభకు రారు. ఎమ్మెల్యేలను రానివ్వరు. ప్రశ్నలు మాత్రం రోజూ రెండు పంపుతున్నారు. ప్రజలు దీన్ని ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిపక్ష నేత హోదా కోసం నాపై కోర్టుకు వెళ్లారు" అని స్పీకర్ తెలిపారు.

> **'పదకొండు'పై చలోక్తులు..**
>
> ఏపీలో కార్యకర్తలకు తెలంగాణ ఫోన్ నంబర్ ఇచ్చి కర్ణాటకలో జగన్ నివాసముంటున్నారని హోంమంత్రి అనిత అనగా, ఆ ఫోన్ నంబర్‌లోని డిజిట్స్ కూడితే 11 వస్తుందని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు చమత్కరించారు. జగన్ గురించి ఈ చర్చ జరిగే సమయం 2:27 నిమిషాలని మరో సభ్యుడు అనగా, ఆ నంబర్లు కూడితే కూడా 11 వస్తుందని... దేవుడి స్క్రిప్టు అంటూ హోంమంత్రి, డిప్యూటీ స్పీకర్ వ్యాఖ్యానించారు. సభలో ఎక్కువ మంది ఆనాడు జగన్ బాధితులేనని, వారి ఫిర్యాదులపై విచారణ చేపడతామని అనిత అనగా, తన కేసును కూడా త్వరితగతిన తేల్చాలని డిప్యూటీ స్పీకర్ కోరారు.

రాష్ట్రంలో పెట్టుబడులకు గరుడ ఏరోస్పేస్ ఆసక్తి

- 250 కోట్లతో యూనిట్ ఏర్పాటు చేస్తామన్న సంస్థ
- మంత్రి బీసీ జనార్దనరెడ్డితో కంపెనీ ప్రతినిధి భేటీ

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఏవియేషన్ సంస్థలు ముందుకు వస్తున్నాయి. రాష్ట్ర సచివాలయంలో గురువారం మౌలిక సదుపాయాలు, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డితో చెన్నైకు చెందిన గరుడ ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధి శ్యామ్‌కుమార్ భేటీ అయ్యారు. డ్రోన్ తయారీలో తమ సంస్థకు విశేషానుభవం ఉందని ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. రాష్ట్రంలో రూ. 250 కోట్ల పెట్టుబడితో గరుడ ఏవియేషన్ ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు సంసిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్‌లో గరుడ సంస్థ 500 డ్రోన్‌లతో రక్షణ శాఖకు సహకారాన్ని అందించిందని మంత్రికి శ్యామ్‌కుమార్ వివరించారు. తమ సంస్థకు భారత క్రికెట్ మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని చెప్పారు. గరుడ సంస్థ ప్రతిపాదనలను పరిశీలించిన మంత్రి జనార్దనరెడ్డి సమగ్ర ప్రాజెక్టు నివేదికతో రావాల్సిందిగా ఆ సంస్థను ఆహ్వానించారు.

సీఐ శంకరయ్య వెనుక తాడేపల్లి ప్యాలెస్!

- టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

సీఎం చంద్రబాబుకు లీగల్ నోటీసు పంపిన సీఐ శంకరయ్యను ఎవరో వెనకుండి నడిపిస్తున్నారని టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. ఆయనకు తాడేపల్లి ప్యాలెస్ నుంచి సహకారం అందుతోందన్నారు. వివేకానందరెడ్డి హత్యను పూర్తిగా రూపుమాపాలని చూస్తున్నారని పేర్కొన్నారు. రాంగోపాల్‌రెడ్డి గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. సీఎం తనకు అసెంబ్లీలో బహిరంగ క్షమాపణ చెప్పాలని లేదా తన పరువుకు భంగం కలిగించినందుకు రూ.1.65 కోట్లకు పరువు నష్టం దావా వేస్తానంటూ శంకరయ్య సీఎంకు లీగల్ నోటీసు పంపడాన్ని తీవ్రంగా ఖండించారు. రక్తపు మడుగులో పడి ఉన్న వివేకా మృతదేహాన్ని ఉన్నతాధికారులు వచ్చే వరకు తీయవద్దని చెప్పకుండా, సాక్ష్యాధారాలను ధ్వంసం చేస్తున్నా చోద్యం చూసిన సీఐ శంకరయ్య.. తర్వాత ఆ హత్యను యాక్సిడెంటల్ డెత్‌గా చిత్రీకరించే కుట్రకు పాల్పడ్డారన్నారు. 2019లో సస్పెండైన ఆయనకు వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రమోషన్ ఇచ్చింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. 'ప్రభుత్వ అధికారిగా జీతం తీసుకుంటూ సీఎంపై దావా వేయడం ఏంటి? వివేకా హత్య గురించి మాట్లాడిన వారందరిపై దావా వేస్తారా?' అని ప్రశ్నించారు. ఏడేళ్ల క్రితం పోని పరువు ఆయనకు ఇప్పుడు గుర్తొచ్చిందా? అని ఎద్దేవా చేశారు. 'గోరంట్ల మాధవ్ ఎలా ఎంపీ అయ్యారో అందరికీ తెలుసు.. మరి ఆయనేమన్నా శంకరయ్యను గైడ్ చేసి, ఎంపీ టిక్కెట్టో, ఎమ్మెల్యే టిక్కెట్టో ఇస్తున్నారేమో'నని అనుమానం వ్యక్తం చేశారు. శంకరయ్య తక్షణమే నోటీసులు వెనక్కి తీసుకుని, సీఎంకు క్షమాపణలు చెప్పాలన్నారు. ఆయన ప్రవర్తన సభా హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని, సీనియర్ ఎమ్మెల్యేలు పరిశీలిస్తున్నారని చెప్పారు.

వైసీపీ వీరవిధేయుడికి ఆర్థిక శాఖలో అందలం?

- కీలకమైన విజయవాడలో వర్క్స్ అకౌంట్ పీఏవోగా నియమించేందుకు ఓ ఉన్నతాధికారి, మంత్రి ప్రయత్నాలు

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వైసీపీకి వీరవిధేయుడైన ఒక అధికారిని ఆర్థిక శాఖలో అందలం ఎక్కించేందుకు ఆగమేఘాలపై ఫైళ్లు కదిలిస్తున్నారు. అందులోనూ రాష్ట్రంలో అతి కీలకమైన విజయవాడకు వర్క్స్ అకౌంట్ పీఏవోగా నియమించేందుకు తహతహలాడుతున్నారు. గత ప్రభుత్వంలో సచివాలయంలో సెక్షన్ అధికారిగా పనిచేస్తున్న ఆ వ్యక్తికి నిబంధనలు సహకరించకపోయినా కడప జిల్లా వాసి కావడం, అప్పటి ఆర్థిక మంత్రి బుగ్గన సామాజిక వర్గం అన్న కోణంలో ఏపీఏవోగా పదోన్నతి కల్పించారు. ఇందుకోసం గత వైసీపీ ప్రభుత్వం ప్రత్యేకంగా నిబంధనలు సడలించి ఏకంగా ధవళేశ్వరం ఏపీఏవోగా పోస్టింగ్ ఇచ్చింది. అక్కడ పనిచేసిన ఐదేళ్లూ వైసీపీ పెద్దల పేరుతో బిల్లుల చెల్లింపుల్లో భారీగా వసూళ్లు చేశారు. తన మాట వినని కాంట్రాక్టర్ల బిల్లులను కొర్రీలు వేసి వెనక్కి పంపేవారు. గడువు తీరిన కాంట్రాక్టర్ల డిపాజిట్ సొమ్ము చెల్లించకుండా వీలైనంత కాలం సాగదీసేవారు. అయినా గత ప్రభుత్వంలో ఆయనకు మళ్లీ పదోన్నతిపై పీఏవోగా పోస్టింగ్ వచ్చింది.

కూటమి ప్రభుత్వం వచ్చాక జూన్ నెలలో చేపట్టిన సాధారణ బదిలీల్లో ఆర్థిక శాఖలో తనకున్న పలుకుబడితో నంద్యాలలో పోస్టింగ్ తెచ్చుకున్నారు. ఇప్పుడు ప్రమోషన్‌పై విజయవాడకు వర్క్స్ అకౌంట్ పీఏవోగా ఆయన్ను నియమించేందుకు ఆర్థిక శాఖ పావులు కదుపుతోంది. జీవో ఇచ్చేందుకు నిరంతరాయంగా శ్రమిస్తున్నారు. వైసీపీ సానుభూతిపరుడు విజయవాడకు వర్క్స్ అకౌంట్ పీఏవోగా వస్తే ప్రతిష్ఠాత్మక సీఆర్‌డీఏ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లోని కీలక డాక్యుమెంట్లు బయటకు వచ్చే ప్రమాదం కూడా ఉంది.

జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో.. దాల్మియా సిమెంట్స్ ఆస్తుల జప్తునకు ఓకే

- ఈడీ అడ్జుకేటింగ్ అథారిటీ సమర్థన
- ఈ ఏడాది మార్చి 31న రూ.793 కోట్ల ఆస్తులు జప్తు చేసిన డైరెక్టరేట్

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అక్రమాస్తుల కేసులో దాల్మియా సిమెంట్స్ (భారత్) సంస్థ ఆస్తులను జప్తు చేయడాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అడ్జుకేటింగ్ అథారిటీ సమర్థించింది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రభుత్వపరంగా పలు ప్రైవేటు కంపెనీలు, సంస్థలకు 'మేళ్లు' జరగడం.. లబ్ధిపొందిన ఆయా సంస్థలు జగన్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా క్విడ్ ప్రోకు పాల్పడ్డాయని సీబీఐ చార్జిషీట్లు కూడా నమోదు చేయడం తెలిసిందే. ముఖ్యమంత్రిగా వైఎస్ పలు సంస్థలకు అందించిన లబ్ధి.. ఆయన కుటుంబసభ్యులకు ప్రయోజనం కలిగించిందని, జగన్ కంపెనీల్లో పెట్టుబడులు ప్రవహించాయని కేంద్ర దర్యాప్తు సంస్థ తేల్చింది.

ఇలా లబ్ధిపొందిన కంపెనీల్లో దాల్మియా సిమెంట్స్ కూడా ఉంది. వైఎస్ జమానాలో కడప జిల్లాలో 407 హెక్టార్ల సున్నపురాయి నిక్షేపాలను ఆ సంస్థ లీజుకు దక్కించుకుంది. ఇందుకు ప్రతిఫలంగా జగన్మోహనరెడ్డికి చెందిన సంస్థల్లో పెట్టుబడులు పెట్టింది. మనీలాండరింగ్ కూడా జరిగిందన్న ఆరోపణలతో ఈడీ కూడా రంగంలోకి దిగింది. ఈ ఏడాది మార్చి 31న ఆ కంపెనీకి చెందిన రూ.793 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. ఇందులో రూ.377.26 కోట్ల విలువైన భూములు కూడా ఉన్నాయి. ఈడీ చర్యను దాల్మియా.. అడ్జుకేటింగ్ అథారిటీలో సవాల్ చేయగా.. లోతుగా పరిశీలించిన అథారిటీ.. జప్తును సమర్థిస్తూ మంగళవారం నిర్ణయం వెలువరించింది. అయితే జప్తు నిర్ణయాన్ని అడ్జుకేటింగ్ అథారిటీ సమర్థించినా.. తమ సంస్థ ఆర్థిక లావాదేవీలకు, వ్యాపార కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకమూ ఉండబోదని స్టాక్ ఎక్స్ఛేంజీకి దాల్మియా (భారత్) వివరణ ఇచ్చింది.



వసతి కష్టాలకు చెక్.. పీఏసీ5లో 4వేల మందికి బస

ప్రస్తుతం తిరుమలలో ఉన్న గదులు, లాకర్లతో కూడిన యాత్రికుల వసతి సముదాయాల ద్వారా 45 వేలనుంచి 50 వేల మందికి మాత్రమే టీటీడీ వసతి కల్పించగలదు. నిత్యం...తిరుమలకు చేరుకునేవారి సంఖ్య దాదాపు లక్షకుపైగా ఉంటోంది. ఈక్రమంలో యాత్రికుల వసతి కష్టాలను తగ్గించేందుకు రూ.102 కోట్లతో లాకర్లతో కూడిన వేంకటాద్రి యాత్రికుల వసతి సముదాయం-5 (పీఏసీ-5)ను నిర్మించింది. ఇందులో 4వేలమందికి వసతి కల్పించవచ్చు. 2,400 లాకర్లతోపాటు మరుగుదొడ్లు, 16 డార్మిటరీలు, స్నానపు గదులు, ఒకేసారి 80మంది తలనీలాలు సమర్పించేలా కల్యాణకట్ట, 1,400మంది అన్నప్రసాదాలు స్వీకరించేలా రెండు డైనింగ్ హాళ్లతో ఈ పిలిగ్రిమ్స్ అమెనిటీస్ సెంటర్ (పీఏసీ)ను భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

గంటకు 5,500 మందికి శ్రీవారి దర్శనం

- డిజిటల్ కంటెంట్‌లో శ్రీవారి చరిత్ర: సీఎం
- చంద్రబాబుతో కలసి పీఏసీ-5ను ప్రారంభించిన రాధాకృష్ణన్

తిరుమల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1లో ఏర్పాటు చేసిన ఏఐ ఇటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ గురువారం ప్రారంభించారు. ఐసీసీ సెంటర్ పనితీరును అధికారులు, సిబ్బంది వారికి వివరించారు. ఫేషియల్ రికగ్నిషన్, బిహేవియర్ అనాలసిస్ అమలులో ఉందని, గంటకు 4,500 మంది శ్రీవారిని దర్శించుకుంటున్నారని తెలిపారు ఏఐ, క్వాంటమ్ రెడీ అనలిటిక్స్, మెషీన్ లెర్నింగ్ సాయంతో దర్శనం కోసం ఎంతమంది వేచిఉన్నారో గుర్తించి అందుకు అనుగుణంగా క్యూలైన్ నిర్వహణ కోసం చర్యలు చేపడుతున్నామని వివరించారు. దీనిపై సీఎం స్పందిస్తూ గంటకు 5 వేల నుంచి 5,500 మంది దర్శనం చేసుకునే అవకాశాలపై దృష్టి సారించడం ద్వారా వేచి ఉండే సమయాన్ని తగ్గించాలని సూచించారు. డిజిటల్ కంటెంట్‌లో శ్రీవారి చరిత్ర, కథలు, వైభవం వంటివి ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఏడు కొండలపై 95శాతానికిపైగా గ్రీనరీ ఉండాలన్నారు.



ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌తో సీఎం చంద్రబాబు దంపతులు, లోకేశ్, దేవాన్ష్

శ్రీవారిని దర్శించుకున్న ఉపరాష్ట్రపతి, సీఎం

తిరుమల శ్రీవారిని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు గురువారం ఉదయం దర్శించుకున్నారు. మహద్వారం వద్ద ఆలయ అర్చక బృందం, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ వీరికి ఇస్తికాఫల్ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోకి వెళ్లిన వీరు ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. రంగనాయకమండపంలో రాధాకృష్ణన్, చంద్రబాబును వేదపండితులు ఆశీర్వదించగా, శ్రీవారి తీర్థప్రసాదాలు, డైరీ, క్యాలెండర్లు, చిత్రపటాన్ని చైర్మన్, ఈవో అందజేశారు. అనంతరం తిరుమలలో నూతనంగా రూ.105కోట్లతో నిర్మించిన వేంకటాద్రి యాత్రికుల వసతి సముదాయం(పీఏసీ-5)ను సీఎం చంద్రబాబుతో కలసి ఉపరాష్ట్రపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓ భక్తురాలికి ఉపరాష్ట్రపతి స్వయంగా లాకర్ కేటాయించారు. ఆలయ పోటులో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రసాదం తయారీ సార్టింగ్ యంత్రాన్ని రిమోట్ మోడ్‌లో ప్రారంభించారు.

వ్యర్థాలు వేస్తే రూ.5 బహుమతి

తిరుమలలో పర్యావరణ పరిరక్షణకు టీటీడీ కొత్త పంథాను ఎంచుకుంది. కొత్తగా ఏర్పాటు చేసిన పీఏసీ5లో తొలిసారిగా'రెక్లెయిమ్ ఏస్' ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ మిషన్‌లో కనిపించే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన తర్వాత యంత్రంలో కనిపించే రింగ్‌లో టెట్రా ప్యాకెట్లు,స్నాక్స్ ప్యాకెట్లు వంటి వ్యర్థాలను వేయాలి. ఈవ్యర్థాలు రీసైక్లింగ్ కావడంతో పాటు భక్తులకు ప్రోత్సాహకంగా రూ.5 లభిస్తుంది.

ఐసీసీ సెంటర్‌తో తిరుమలపై మరింత నిఘా!

భక్తులకు మెరుగైన దర్శనం, నిరీక్షణ సమయం తగ్గింపు, నిఘా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేయడంతోపాటు.. భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడేలా అధునాతన ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)ను తిరుమల వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 25వ కంపార్టుమెంట్‌లో ఏర్పాటు చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం, దర్శనానికి సరైన సమయాన్ని లెక్కకట్టడం, దర్శనానికి వచ్చే భక్తుల పూర్తి వివరాల నమోదు చేయడం, హెడ్ కౌంట్ వంటి వాటికి ఈవ్యవస్థ ఉపయోగపడనుంది. దేశవ్యాప్తంగా ఆలయాల్లో ఈస్థాయి సమీకృత నిఘా వ్యవస్థ ఏర్పాటు ఇదే తొలిసారి.





జీవిత ఖైదీకి గోల్డ్ మెడల్

- ఓపెన్ డిగ్రీలో అత్యుత్తమ ప్రతిభ
- హత్య కేసులో యుగంధర్‌కు జీవిత ఖైదు
- కడప సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవిస్తూ నాలుగు బీఏలు, మూడు ఎంఏలు పూర్తి

కడప క్రైం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆయనో హత్య కేసులో శిక్ష అనుభవిస్తున్న జీవిత ఖైదు. జైల్లో ఉంటూనే ఓపెన్ విద్య విధానంలో నాలుగు బీఏలు, మూడు ఎంఏలు పూర్తి చేశాడు. తాజాగా డిగ్రీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి గోల్డ్‌మెడల్‌కు ఎంపికయ్యాడు. గునుకుల యుగంధర్ అనే ఆ వ్యక్తి పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ సబ్జెక్టులుగా బీఏ పూర్తి చేశారు. ఇందులో మొత్తం 8.02 జీపీఏ సాధించి గోల్డ్ మెడల్‌కు ఎంపికయ్యారు. ఈనెల 30న హైదరాబాద్‌లో జరిగే 26వ స్నాతకోత్సవంలో మెడల్ పొందేందుకు వర్సిటీ నుంచి ఆహ్వానం లభించింది. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం జంగాలపల్లెకు చెందిన యుగంధర్‌కు ఓ హత్య కేసులో 2011లో జీవిత ఖైదు శిక్ష పడింది. ఆయన కడప కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నాడు. కాగా, దాదాపు 15 సంవత్సరాలుగా శిక్ష అనుభవిస్తున్న తన కుమారుడు యుగంధర్‌కు క్షమాభిక్ష పెట్టాలని అతని తల్లి చెంగమ్మ కోరారు. గురువారం ఆమె కడప సెంట్రల్ జైలు వద్ద మీడియాతో మాట్లాడారు. తన కుమారుడు చదువుల్లో గోల్డ్ మెడల్ సాధించాడని, సత్ప్రవర్తన కలిగి ఉన్నాడని పేర్కొన్నారు. ప్రభుత్వం తమ ఆవేదనను గుర్తించి, తన బిడ్డను క్షమాభిక్ష కింద విడుదల చేయాలని కోరారు.

మిథున్‌రెడ్డి బెయిల్‌పై 29న తీర్పు

విజయవాడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మద్యం కేసులో ఏ4 నిందితుడిగా ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డి బెయిల్‌పై ఈనెల 29వ తేదీన విజయవాడ ఏసీబీ కోర్టు తీర్పును వెలువరించనుంది. ప్రస్తుతం రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న మిథున్‌రెడ్డి తనకు బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం ఏసీబీ కోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును సోమవారం వెలువరిస్తామని న్యాయాధికారి పి.భాస్కరరావు వెల్లడించారు.

దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కారకుడైన అఖ్తర్ ఉరిశిక్షపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్ నగర్ బాంబు పేలుళ్ల కేసు నిందితుడు అసదుల్లా అఖ్తర్ ఉరిశిక్షపై సుప్రీంకోర్టు గురువారం స్టే విధించింది. 2013లో దిల్‌సుఖ్ నగర్‌లో రెండుచోట్ల జరిగిన బాంబు పేలుళ్లలో 18 మంది మరణించగా..131 మంది తీవ్రగాయాలపాలైన సంగతి తెలిసిందే. ఆ పేలుళ్లకు కారకులైన ఇండియన్ ముజాహిదీన్ సహవ్యవస్థాపకుడు యాసిన్ భత్కల్, అఖ్తర్ సహా ఐదుగురికి ఉరి శిక్ష వేస్తూ 2016 డిసెంబరులో ఎన్‌ఐఏ కోర్టు ఇచ్చిన తీర్పును ఈ ఏడాది ఏప్రిల్‌లో తెలంగాణ హైకోర్టు సమర్థించింది. ఢిల్లీ జైలులో ఉన్న అఖ్తర్ ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేశాడు. జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజారియాతో కూడిన ధర్మాసనం ఆ పిటిషన్‌ను విచారించి.. 8 వారాలలోగా దీనిపై నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. అంతవరకూ మరణశిక్షపై స్టే విధిస్తున్నట్టు తెలిపింది.

Printed and Published by ***Koganti Venkata Seshagiri Rao*** *on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107,* ***Editor : N.Rahul Kumar,*** *RNI No:3470/1960,* ***Managing Director : Vemuri Radha Krishna, Founder :*** *K.L.N. Prasad.*